సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 314

మంగళవారం 4-2-2020

'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

3 రోజుల నష్టాలకు బ్రేక్

సెన్సెక్స్ 137 పాయింట్లు అప్.. 46 పాయింట్లు పెరిగిన నిఫ్టీ -బిజినెస్‌లో

కుర్రాళ్ల సమరం..

అండర్-19 ప్రపంచకప్‌లో నేడు భారత్, పాక్ జట్ల మధ్య సెమీఫైనల్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

దేశ సామరస్యతపై కుట్ర: ప్రధాని

పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జరుగుతున్న నిరసనలు దేశ సామరస్యతను దెబ్బతీసేందుకు పన్నిన రాజకీయ కుట్రలో భాగమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. సోమవారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

- 5లో

'ధర్మ' సందేహాలపై నిర్ణయం తీసుకుంటాం

ప్రార్థన స్థలాల్లో మహిళలపై వివక్షకు సంబంధించి న్యాయపరమైన ప్రశ్నలు సిద్ధం చేస్తామని, తొమ్మిది మంది సభ్యులున్న విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఈ ప్రశ్నలపై ఒక నిర్ణయం తీసుకుంటుందని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది.

- 5లో

షారూక్ ఖాన్ కేకేఆర్ జప్తు..

రోజ్‌వ్యాలీ స్కామ్‌పై విచారణలో భాగంగా రూ.70 కోట్ల విలువైన మూడు ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. ఇందులో బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్‌కు చెందిన కోల్‌కతా నైట్‌రైడర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్ ఉన్నట్లు తెలిపింది.

- 5లో

కార్ల సందడి రెడీ

రెండేళ్లకొకసారి జరిగే వాహన పండుగకు రంగం సిద్ధమైంది. ఈ నెల 7-12 వరకు గ్రేటర్ నోయిడాలో 15వ ఆటో ఎక్స్‌పో జరగనుంది. ఈసారి ఎలక్ట్రిక్ వాహనాల జోరు ఉండగలదని నిపుణులు భావిస్తున్న నేపథ్యంలో ఆటో ఎక్స్‌పోపై ప్రత్యేక కథనం.

- బిజినెస్‌లో

రోజూ 800 మందికి కరోనా స్క్రీనింగ్

- రాజీవ్‌గాంధీ విమానాశ్రయంలో స్క్రీనింగ్ ప్రక్రియపై వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష
- వారంతా చైనా, థాయ్‌లాండ్, హాంకాంగ్, సింగపూర్, మలేసియా దేశస్తులే
- ఆ దేశాలకు చెందిన మొత్తం 2,733 మంది ప్రయాణికులకు స్క్రీనింగ్
- జాగ్రత్తలపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రోజూ 800 మందికి కరోనా వైరస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైరస్ అధికంగా విస్తరించిన దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలించాకే బయటకు పంపిస్తున్నారు. ముఖ్యంగా చైనా, హాంకాంగ్, థాయిలాండ్, సింగపూర్, మలేసియా దేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికులకు పూర్తిస్థాయిలో స్క్రీనింగ్ చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు ఆ దేశాలకు చెందిన 29 విమానాల నుంచి 2,733 మంది ప్రయాణికులను విమానాశ్రయంలో స్క్రీనింగ్ చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లి అక్కడ జరుగుతున్న స్క్రీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం వారు అక్కడ సమీక్ష నిర్వహించారు. వివిధ దేశాల నుంచి

మిగతా 2వ పేజీలో ▶

సోమవారం పగిడిద్దరాజును మేడారం తీసుకెళ్తున్న అర్రెం వంశీయులు

మహా జాతరకు వేళాయె..

- రేపటి నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర
- 5న గద్దెలపైకి సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు
- 6న సమ్మక్క ఆగమనం
- వరాల తల్లులను దర్శించుకోనున్న భక్తజనం
- సుమారు 1.40 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఆదివాసీల అతి పెద్ద ఉత్సవం.. దక్షిణాది కుంభమేళా.. మేడారం జాతరకు వేళయ్యింది. గుడిమెలిగె, మండమెలిగె పండుగలతో రెండు వారాల క్రితం నుంచే జాతర ఘట్టం మొదలు కాగా.. బుధవారం సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు గద్దెలపైకి రావడంతో మహాజాతర ప్రారంభమవుతోంది. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు అత్యంత వైభవంగా సమ్మక్క-సారలమ్మ మహా జాతర నిర్వహణ కోసం మేడారం సిద్ధమైంది. వన దేవతల వారంగా

మిగతా 2వ పేజీలో ▶

సైబర్ రక్షణ..

- దేశంలోనే తొలి సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రాష్ట్రంలో ఏర్పాటు
- ప్రభుత్వ విభాగాలు, ఐటీ, విద్య, పరిశోధన సంస్థలకు శిక్షణ
- సైబర్ సెక్యూరిటీలో ఇజ్రాయెల్ స్థాయికి చేరడమే సీసీఓఈ లక్ష్యం
- డేటా భద్రత, గోప్యతపై ఆందోళన నేపథ్యంలో పీడీపీ బిల్లు

సాక్షి, హైదరాబాద్

ఇంటర్నెట్ సేవలను అత్యధికంగా వినియోగిస్తున్న దేశాల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న భారత్ తరచూ సైబర్ దాడులకు గురవుతోంది. దేశ రక్షణ, ఆర్థిక సంస్థలతోపాటు ఇతర కీలక రంగాలకు చెందిన డేటా (సమాచారం) తస్కరణ, దుర్వినియోగమవుతోంది. దీంతో దేశ భద్రతతో పాటు ఆర్థిక పురోగతిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సైబర్ సెక్యూరిటీ ప్రమాదంలో ఉన్నప్పటికీ చాలా రాష్ట్రాలు సైబర్ సెక్యూరిటీ సెల్స్, సైబర్ ఆపరేషన్ సెంటర్ల ఏర్పాటు వంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. మరోవైపు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి నూతన సాంకేతికత వినియోగం పెరగడంతోపాటు త్వరలో 5జీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా అందుబాటులో వచ్చే ఐటీ సాంకేతికతలతో సైబర్ భద్రతకు మరింత ముప్పు పొంచి ఉందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ సెక్యూరిటీ దిశగా చర్యలు చేపడుతున్నాయి. సైబర్ సెక్యూరిటీ విషయంలో ఇతర రాష్ట్రాలకంటే ముందంజలో ఉన్న తెలంగాణ రాష్ట్రం ఇటీవల హైదరాబాద్‌లో సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీసీఓఈ) ప్రారంభించింది.

దేశంలోనే మొట్టమొదటి సీసీఓఈ...

సైబర్ సెక్యూరిటీకి ఉన్న ముప్పును దృష్టిలో పెట్టుకొని దేశంలోనే తొలి సీసీఓఈను డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్‌సీఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. సైబర్ సెక్యూరిటీ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉండే సీసీఓఈ.. సైబర్ సెక్యూరిటీ, గోప్యతకు సంబంధించిన అనువైన వాతావరణాన్ని సృష్టించడంపై దృష్టి కేంద్రీకరిస్తుంది. సీసీఓఈలో

మిగతా 2వ పేజీలో ▶

2 కొత్త రెవెన్యూ డివిజన్లు

- జోగిపేట, వేములవాడను ఏర్పాటు చేస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్
- రాష్ట్రంలో 74కు చేరిన డివిజన్ల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండు కొత్త రెవెన్యూ డివిజన్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మెదక్ జిల్లా జోగిపేట, సిరిసిల్ల రాజన్న జిల్లా వేములవాడను నూతన రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేసేందుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది. వీటితో రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్ల సంఖ్య 74కు చేరింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమయంలో కొత్తగా జిల్లాలు, డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఆ తర్వాత కూడా స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని డివిజన్లు, మండలాలకు లైన్‌క్లియర్ చేస్తున్న సంగతి తెలిసిందే.

కొత్తగా చౌట్కూరు మండలం: ప్రతిపాదిత జోగిపేట రెవెన్యూ డివిజన్‌లో నాలుగు మండలాలను

మిగతా 2వ పేజీలో ▶

అమరావతిలో మనీల్యాండరింగ్ బాగోతం..

'ఇన్‌సైడర్'పై ఈడీ కేసు!

- ఏపీ మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఆధారంగా కదిలిన డొంక
- టీడీపీ నేతల బినామీలుగా 797 మంది తెల్లకార్డుదారుల ఆధారాలు ఈడీకి అందజేసిన సీఐడీ
- మనీల్యాండరింగ్‌పై ఈడీకి, తెల్లకార్డు దారులకు రూ. వందల కోట్లు ఎలా వచ్చాయనేదానిపై ఐటీ శాఖకు లేఖ

-2లో

11న కలెక్టర్ల సదస్సు

- ఎన్నికల హడావుడి ముగియడంతో పాలనపై సీఎం దృష్టి
- రెండో విడత పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిపై దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్

- 3లో

కంటకత్

'నెట్టే'ట మునిగారు

డిజిటల్ బానిసలుగా మెట్రో నగరాల ప్రజలు

- రోజుకు 7 గంటలు ఆన్‌లైన్‌లో విహారం
- ప్రతి 5 నిమిషాలకు అప్‌డేట్స్ చెకింగ్.. ప్రతి ఐదుగురిలో ముగ్గురికి స్మార్ట్‌ఫోన్, పీసీ, సోషల్ మీడియా అడిక్షన్
- డిజిటల్ మార్కెటీర్ సర్వేలో ఆందోళనకర అంశాలు
- అధిక వాడకంతో చాలా మందికి శారీరక, మానసిక సమస్యలు.. 50 వేల మంది అభిప్రాయాలతో అధ్యయన వివరాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ప్రజలు 'నెట్'లోకంలో మునిగితేలుతున్నారు. గంటలకొద్దీ డిజిటల్ ప్రపంచంలో విహరిస్తూ ఇంటర్నెట్‌కు బానిసలుగా మారుతున్నారు. ఆధునిక సాంకేతికతను అవసరానికి మించి వాడుతూ శారీరక, మానసిక సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, టీవీ, సోషల్ మీడియా... ఇలా డిజిటల్ మాధ్యమాలతో రోజుకు ఏడు గంటల చొప్పున ఏడాదికి సరాసరిన 1,800 గంటలపాటు కుస్తీ పడుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. డిజిటల్ మార్కెటీర్ అనే సంస్థ ఇటీవల హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ తదితర మెట్రో నగరాల్లో ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా సుమారు 50 వేల మంది అభిప్రాయాలు

మిగతా 2వ పేజీలో ▶

పాత పద్ధతిలోనే టీచర్లకు వేతనాలు

ఎంఈవోలే వేతన బిల్లులు చేసేలా ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీచర్ల వేతన బిల్లులను చేసే బాధ్యతలను మళ్లీ మండల విద్యాధికారులకే (ఎంఈవో) విద్యాశాఖ అప్పగించింది. గతంలో ఆయా పాఠశాలల టీచర్ల వేతన బిల్లులను ఎంఈవోలే చేయగా, ఇటీవల విద్యాశాఖ ఆ బాధ్యతలను స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లకు అప్పగించింది. అయితే ఎంఈవోల ఆధ్వర్యంలోనే వేతన బిల్లుల ప్రక్రియను చేపట్టాలని పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. దీనికితోడు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైన నేపథ్యంలో పాత పద్ధతిలోనే కొనసాగించాలని పేర్కొంటూ పాఠశాల విద్య ఇన్‌ఛార్జి కమిషనర్ డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈవోలే ఆయా టీచర్ల వేతన బిల్లులను చేసేలా డీఈవోలు చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ట్రాక్టర్లు, ట్యాంకర్ల కొనుగోలు బాధ్యత అగ్రోస్‌కు..

- స్థానిక సంస్థల్లో భారీగా ట్రాక్టర్లను కొంటున్న సర్కారు
- ఇకపై వీటి కొనుగోలుకు నోడల్ సంస్థగా అగ్రోస్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖలు ఇకపై విడివిడిగా ట్రాక్టర్లను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నియంత్రణ విధించింది.వ్యవసాయ శాఖే గాకుండా పంచాయతీరాజ్, పురపాలకశాఖలకు ఇక నుంచి అగ్రోస్ సంస్థ ట్రాక్టర్లను సరఫరా చేయనుంది.వాటి తయారీ కంపెనీలు,డీలర్లతో సంప్రదింపులు.. కొనుగోలు చేసే బాధ్యతను ఆ సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ సంస్థ నిర్దేశించిన ధరను చెల్లించి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌ను స్థానిక సంస్థలు తీసుకోవాల్సివుంటుంది. గ్రామాల పరిధిలో చెత్త సేకరణ, హరితహారం కింద మొక్కలకు నీళ్లు పోసేందుకు గ్రామ పంచాయతీలు ట్రాక్టర్లను సమకూర్చుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నేరుగా డీలర్లతో సంస్థలతో చర్చించి కొనేస్తున్నాయి.తద్వారా వాటి ధరల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ రేట్లలో తేడా రాకుండా కొనుగోలుకు అగ్రోస్‌ను నోడల్ సంస్థగా ప్రభుత్వం ప్రకటించింది. పల్లె ప్రగతి, తెలంగాణకు హరితహారం కింద ప్రతి జీపీ ఒక ట్రాక్టర్ కొనే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 12,751 పల్లెలు ట్రాక్టర్లను సమకూర్చుకోనున్నాయి. దీనికి అనుగుణంగా పంచాయతీరాజ్, పురపాలక శాఖలు కూడా నేరుగా కాకుండా..అగ్రోస్ సంస్థ ద్వారా ట్రాక్టర్లను కొనుగోలు చేయాలని తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది.

రేపు చెన్నై తాగునీటి అవసరాలపై బోర్డు భేటీ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల నుంచి చెన్నై తాగునీటి అవసరాలకు నీటి విడుదలకు సంబంధించి కృష్ణా బోర్డు ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 5న భేటీ కానుంది. ఇక్కడి జలసౌధలో జరిగే భేటీకి కృష్ణాబోర్డుతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇంజనీర్లు హాజరు కానున్నారు. సాధారణంగా చెన్నై తాగునీటి కోసం శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ప్రతి ఏటా సుమారు 15 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇందులో మహారాష్ట్ర 5 టీఎంసీలు, కర్ణాటక 5 టీఎంసీలు, ఏపీ 3.3 టీఎంసీలు, తెలంగాణ 1.7 టీఎంసీలను తమ రాష్ట్ర కోటా నుంచి చెన్నైకి అందించాల్సి ఉంది. అయితే ఏటా 2 నుంచి 3 టీఎంసీల కంటే ఎక్కువ నీటిని ఆయా రాష్ట్రాలకు విడుదల చేయడం లేదని తమిళనాడు అంటోంది. ఈ ఏడాది సైతం ఇప్పటివరకు కేవలం 2 టీఎంసీల నీరు మాత్రమే వచ్చిందని బోర్డు దృష్టికి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చే వేసవిలో తాగునీటి అవసరాల నిమిత్తం తమకు దక్కే వాటా నీటిని విడుదల చేయాలని తమిళనాడు కోరుతోంది. దీనిపై చర్చించేందుకు బుధవారం బోర్డు కమిటీ భేటీ కానుంది.

నిద్రపోతున్నారా..? సహకరిస్తున్నారా?

ప్రభుత్వ భూమి ఆక్రమణలపై హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతుంటే తెలియదా? 24 అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతున్నా కనబడదా? అని హైకోర్టు మండిపడింది. 'అధికారులు నిద్రపోతుంటే కోట్లాది రూపాయల విలువైన భూములు ఆక్రమణలకు గురికావడమే కాకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. ఇవన్నీ అధికారులకు తెలిసే జరుగుతాయి. ఈ విషయం ప్రజలతోపాటు మాకు కూడా తెలుసు. అధికారుల సహకారం లేకుండా ఏమీ కాదు'అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ గ్రామంలోని సర్వే నంబర్ 43లోని కోట్లాది రూపాయల విలువైన 3.22 ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమణలకు గురవుతుంటే అధికారులు పట్టించుకోవట్లేదంటూ కె.క్రిష్టగౌడ్ అనే వ్యక్తి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సోమవారం ధర్మాసనం విచారించింది. ఆ ప్రాంతంలో భూ సర్వే జరుగుతోందని, 3 నెలల సమయమిస్తే పూర్తి స్థాయి నివేదిక అందజేస్తామని ప్రభుత్వ న్యాయవాది కోరారు. దీన్ని ధర్మాసనం ఖండించింది. సర్వే చేసి నెల రోజుల్లోగా నివేదిక సమర్పించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. భూములను రక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆక్రమణదారులతో చేతులు కలిపారనే సందేహాలు కూడా వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణ మార్చి 11న జరుపుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం తెలిపింది.

నేడు, రేపు పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: లక్షద్వీప్ నుంచి ఉత్తర మధ్య మహారాష్ట్ర, దాన్ని ఆనుకుని ఉన్న ఇంటీరియర్ కర్ణాటక ప్రాంతాల మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడింది. తెలంగాణలో ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. గడచిన 24 గంటల్లో నల్లగొండలో రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా నమోదైంది.

జాతరకు వేళాయె..

▶ మొదటి పేజీ తరువాయి

భావించే బుధవారం రోజున.. మేడారం, కన్నెపల్లి, కొండాయి, పూనుగొండ్లలో జాతరకు శ్రీకారం చుడుతారు. నాలుగు ప్రాంతాల్లోనూ వన దేవతల పూజ కార్యక్రమాలు నిర్వహించడంతో మేడారం జాతర లాంఛనంగా మొదలవుతుంది. రెండేళ్లకోసారి జరిగే జాతర కోసం ఈసారి 1.4 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేశారు.

5న సారలమ్మ, 6న సమ్మక్క

సమ్మక్క కూతురైన సారలమ్మ నివాసం కన్నెపల్లి. మేడారం గద్దెలకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని ఈ కుగ్రామంలో చిన్న దేవాలయంలో ప్రతిష్ఠించబడిన సారలమ్మ 5న బుధవారం సాయంత్రం మేడారంలోని గద్దె వద్దకు చేరుతుంది. ఉదయం వేళ కోట్లాది మంది భక్తులు ఎదురు చూసే ఈ మహాజాతరలో తొలి ఘట్టం మంగళవారం మొదలు కానుంది. సమ్మక్క భర్త పగిడిద్దరాజును పెళ్లి కుమారుడిగా తయారు చేయడంతో ప్రారంభమవుతోంది. పెనక వంశానికి చెందిన పూజారులతో పాటు పూనుగొండ్ల గ్రామస్తులు నిష్ఠతో ఈ పూజలు నిర్వహిస్తారు. ముందుగా తలపతి (పూజారుల పెద్ద) ఇంట్లో అమ్మవారికి తీసుకుని వెళ్లే పానుపు (పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు) సిద్ధం చేస్తారు. ఉదయం పానుపును డోలి వాయిద్యాల నడుమ ఆలయానికి తరలించి పూజలు చేస్తారు. దేవుని గుట్ట నుంచి తీసుకువచ్చిన వెదురు కర్ర తో పగిడిద్దరాజు పడిగెను సిద్ధం చేస్తారు. శివసత్తుల పూనకాలు, దేవుని మహిమతో తన్మయత్వం పొందిన పూజారులు పడిగెను ఆలయ ప్రాంగణంలోని గద్దెపై ప్రతిష్ఠిస్తారు. సుమారు రెండు గంటలు పెళ్లి కుమారుడిగా భక్తులకు దర్శనం ఇచ్చే పగిడిద్దరాజును దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. అనంతరం పూజారులు తలపతి ఇంట్లో సిద్ధం చేసిన పానుపుతో పాటు పడిగెను తీసుకుని కాలినడకన అటవీ మార్గాన బయలు దేరుతారు. పస్రా చేరుకున్న తర్వాత పగిడిద్ద రాజుకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ నేరుగా సమ్మక్క కొలువుదీరిన చిలుకల గుట్టపైకి చేరుకుంటారు. ఇక్కడ వారి ఇరువు రికి ఆదివాసీ సంప్రదాయంలో ఇరు పూజారులు ఎదుర్కోళ్లు, వివాహం జరిపిస్తారు.

నేటి నుంచే కీలక ఘట్టం మొదలు

సారలమ్మ కొలువుదీరిన మరుసటి రోజున అంటే 6న గురువారం సాయంత్రం వేళ సమ్మక్క గద్దెపైకి వస్తుంది. ఆ రోజు ఉదయమే పూజారులు చిలకలగుట్టకు వెళ్లి వనం (వెదురు కర్రలు) తెచ్చి గద్దెలపై ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం సమ్మక్క పూజామందిరం నుంచి వడరాలు, పసిడి కుండలను తెచ్చి గద్దెలపై నెలకొల్పుతారు. అనంతరం సాయంత్రం వేళలో చిలకలగుట్టపై కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెచ్చేందుకు పూజారులు బయలుదేరుతారు. జాతర మొత్తానికి ప్రధాన ఘట్టమైన సమ్మక్క ఆగమనం కోసం లక్షలాది మంది భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తారు. తల్లికి ఆహ్వానం పలుకుతూ లక్షల మంది చిలకలగుట్ట వద్దకు వెళ్తారు. సమ్మక్క కొలువైన ప్రదేశానికి చేరుకున్న పూజారులు అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. తల్లి రూపాన్ని చేతపట్టుకున్న మరుక్షణమే ప్రధాన పూజారి మైకంతో పరుగున బయల్దేరి గుట్ట దిగుతాడు. వందలాది మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. జిల్లా ఎస్పీ తుపాకీతో గాల్లోకి మూడుసార్లు కాల్పులు జరిపి అధికార వందనంతో స్వాగతం పలుకుతారు.

సమ్మక్క గద్దె

సారలమ్మ గద్దె

మూడో రోజు మొక్కులు.. నాలుగో రోజు వనప్రవేశం

గద్దెలపై ఆశీనులైన సమ్మక్క–సారలమ్మ జాతరలో మూడో రోజు (7వ తేదీన శుక్రవారం) అశేష భక్త జనానికి దర్శనమిస్తారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటారు. కోర్కెలు తీర్చమని వేడుకుంటారు. కోర్కెలు తీరినవారు కానుకలు చెల్లిస్తారు. ఆడపడుచులుగా భావిస్తూ పసుపుకుంకుమలు, చీరె, సారెలు పెడతారు. ఒడి బియ్యం పోస్తారు. తలనీలాలు సమర్పించుకుంటారు. ఎత్తు బంగారం (బెల్లం) నైవేద్యంగా పెడతారు. ఉప్పొంగిన భక్తి.. ఉరకలెత్తుతున్న జనంతో మేడారం పరిసరాలు సందడిగా మారుతాయి. ఆ రోజంతా లక్షలాది మంది గద్దెల వద్ద అమ్మవార్లను దర్శించుకుంటారు. కనులారా వీక్షించి మొక్కులు తీర్చుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అశేష భక్తజనానికి దర్శనం ఇచ్చిన సమ్మక్క–సారలమ్మ నాలుగో రోజున (8 శనివారం) సాయంత్రం తిరిగి వన ప్రవేశం చేస్తారు. దీంతో జాతర ముగిసిపోతుంది.

మేడారం బయలుదేరిన పగిడిద్దరాజు

గుండాల: అర్రెం వంశీయుల ఆరాధ్య దైవం, సమక్క భర్త అయిన పగిడిద్దరాజు సోమవారం మేడారం పయనమయ్యాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం యాపలగడ్డ గ్రామం నుంచి అర్రెం వంశీయులు పగిడిద్దరాజును తీసుకుని కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా పడగలకు (జెండాలకు), ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన నృత్యాలు, డప్పు వాయిద్యాలతో మేడారం వరకు ఊరేగింపుగా వెళ్లారు.

'నెట్టే'ట మునిగారు

▶ మొదటి పేజీ తరువాయి

సేకరించి అధ్యయన వివరాలు ప్రకటించింది. చేతిలో నిరంతరం స్మార్ట్‌ఫోన్‌తో దర్శనమిచ్చే యువత... ఖాళీ సమయాల్లో డిజిటల్ మాధ్యమాలతో కుస్తీ పడుతోంది. ప్రతి ముగ్గురిలో ఒకరు ప్రతి ఐదు నిమిషాలకు ఓసారి సెల్‌ఫోన్ టచ్ చేస్తూ అప్‌డేట్స్ చూసుకుంటున్నట్లు ఈ అధ్యయనం తెలిపింది. ప్రతి ఐదుగురిలో ముగ్గురు సెల్‌ఫోన్ తమ జీవితంలో విడదీయరాని భాగంగా మారిందని అభిప్రాయపడినట్లు పేర్కొంది. టీనేజర్లలో సుమారు 50 శాతం మంది డిజిటల్ ఎడిక్షన్‌కు గురవుతున్నట్లు అధ్యయనం స్పష్టం చేసింది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే డిజిటల్ ఎడిక్షన్‌తో పలు శారీరక, మానసిక సమస్యలతో బాధపడాల్సి వస్తుందని హెచ్చరించింది.

డిజిటల్ వర్రీ..

క్షణం తీరికలేకుండా స్మార్ట్‌ఫోన్‌తో గంటలతరబడి కాలక్షేపం చేస్తున్న మెట్రో నగరవాసులకు ఇప్పుడు కొత్త చిక్కులొచ్చాయి. నిరంతరాయంగా వాట్సాప్‌లో చాటింగ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వాటిలో అప్‌డేట్స్ కోసం రెప్పవాల్చకుండా స్మార్ట్‌ఫోన్ వైపు దృష్టిసారిస్తుండడంతో పలువురు మెడ, వెన్నునొప్పులతో సతమతమవుతున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. ప్రధానంగా స్మార్ట్‌ఫోన్‌ను చేతిలో పట్టుకొని సరిగా కూర్చోకుండా చాటింగ్ చేయడం, అధిక సమయం చాటింగ్‌లోనే గడిపేస్తుండటంతో వెన్నెముక డిస్కులు ఒత్తిడికి గురై పలువురు వెన్నునొప్పులతో బాధపడుతున్నట్లు వివరించింది. చాటింగ్ సమయంలో భుజం, తల, మెడ కండరాలు అధికంగా ఒత్తిడికి గురై బిగుసుకుపోవడంతోనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని, ఇక ఛాతీ కండరాలు కూడా పలుమార్లు బిగుసుకుపోతున్నట్లు వైద్యులను ఉటంకిస్తూ పేర్కొంది.

చిన్నారులూ బాధితులే....

అధిక గంటలు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లలో గేమ్స్ ఆడే చిన్నారులు సైతం మెడ, వెన్నునొప్పులతో సతమతమవుతున్నట్లు సర్వేలో తేలింది. ప్రధానంగా సెల్‌ఫోన్లు, ట్యాబ్లెట్స్‌లో గేమ్స్ ఆడే సమయంలో సోఫాలు, మంచాలు, కుర్చీల్లో సరిగా కూర్చోకపోవడం వల్ల శారీరక కదలికలు లేక జీవనక్రియల్లో సమతౌల్యం దెబ్బతిని అనారోగ్యం పాలవుతున్నారని అధ్యయనం వెల్లడించింది.

అనర్థాలివే..

మెడ నొప్పులు, వెన్నెముక డిస్కులు ఒత్తిడికి గురై నొప్పులతో సతమతమవడం, నరాలు బిగుసుకుపోవడం, చేతివేళ్లకు తరచూ తిమ్మిర్లు రావడం, స్పర్శ కోల్పోవడం, జీవన క్రియలు మందగించడం, వెన్నునొప్పులు, నిద్రలేమి, తుంటికండరాలు పట్టేయడం.

ఇలా చేస్తే నొప్పుల నుంచి ఉపశమనం..

- స్మార్ట్‌ఫోన్లు వినియోగించే సమయంలో తరచూ బ్రేక్ తీసుకోవాలి. శరీర కదలికలు ఉండేలా చూసుకోవాలి.
- మెడను వంచకుండా స్మార్ట్‌ఫోన్ తెరను చూడాలి.
- నొప్పులు అధికమైతే న్యూరో సర్జన్‌లు, ఫిజియోథెరపిస్టులను సంప్రదించాలి.

శ్రుతి మించితే వైద్యులను సంప్రదించాల్సిందే..

చిన్నారులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం దురలవాటుగా మారితే తప్పనిసరిగా సైకియాట్రిస్ట్‌లను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. చిన్నారుల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఫోన్ హాబీ ఇటీవలి కాలంలో ఐదు రెట్లు పెరిగిందని సైకాలజిస్టులు చెబుతున్నారు. పిల్లలకు ఫోన్లను సరదా కోసం ఇస్తున్న తల్లిదండ్రులు... అది వారికి దురలవాటుగా మారినప్పుడే కళ్లు తెరుస్తున్నారని చెబుతున్నారు. చాలా మంది మాట్లాడటం కంటే ఫోన్ చాటింగ్‌కే ప్రాధాన్యతనిస్తున్నట్లు సైకాలజిస్టులు చెబుతున్నారు. ఫోన్ హాబీ శ్రుతి మించి దురలవాటుగా మారితే చిన్నారుల మెదడు కణాలు సైతం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. శారీరక వ్యాయామం, ఆటల ద్వారా చిన్నారుల్లో మానసిక, శారీరక ఆరోగ్యం పెరుగుతుందని సూచిస్తున్నారు. ఆటలకు దూరమై ఫోన్లు, ట్యాబ్లెట్లతో కుస్తీపట్టే చిన్నారులు తీవ్ర ఆవేశకావేశాలకు గురవడంతో పాటు వారిలో క్రమంగా హింసా ప్రవృత్తి కూడా పెరుగుతోందని స్పష్టం చేస్తున్నారు.

రెండు కొత్త రెవెన్యూ డివిజన్లు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం చేర్చింది. ప్రస్తుతం సంగారెడ్డి డివిజన్‌లో కొనసాగుతున్న అందోల్, పుల్కల్, వట్పల్లి మండలాలతోపాటు కొత్తగా చౌట్కూరు మండలాన్ని ఏర్పాటు చేసింది. పుల్కల్ మండలం నుంచి కొన్ని గ్రామాలను తొలగించి చౌట్కూరు మండలంలో కలిపింది. దీంతో రాష్ట్రంలో మండలాల సంఖ్య 586కు చేరింది.

వేములవాడ డివిజన్ ఇలా..

ప్రస్తుతం సిరిసిల్ల రెవెన్యూ డివిజన్‌లో ఉన్న 6 మండలాలతో వేములవాడ డివిజన్ ఏర్పాటు చేశారు. ఇందులో వేములవాడ, వేములవాడ (గ్రామీణ), చందుర్తి, బోయినపల్లి, కోనరావుపేట, రుద్రండి మండలాలున్నాయి. ఇదిలావుండగా డివిజన్లు, మండలం ఏర్పాటుపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు 30 రోజుల గడువు ఇస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

'సైబర్' రక్షణ

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం ద్వారా ప్రభుత్వ విభాగాలు, ఐటీ సంస్థలు, విద్య, పరిశోధన కేంద్రాలతోపాటు సంబంధిత రంగానికి చెందిన వారికి సైబర్ సెక్యూరిటీపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ రంగంలో అగ్రగామిగా ఉన్న ఇజ్రాయెల్ స్థాయికి రాష్ట్రాన్ని చేర్చేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. సైబర్ సెక్యూరిటీ పరిశోధనల్లో ఇప్పటికే రష్యా, యూకే, నెదర్లాండ్స్, కెనడా వంటి దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్న సీసీఓఈ... దేశీయంగా టీ–హబ్, ఫిక్కీ, సీఐఐ, ఐఐటీ హైదరాబాద్ వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. సీసీఓఈ ఏర్పాటు ద్వారా ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సైబర్ సెక్యూరిటీ సంస్థలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

డేటా భద్రత కోసం పీడీపీ బిల్లు...

సైబర్ సెక్యూరిటీ కోసం ఇప్పటికే నేషనల్ టెక్నికల్ ఆర్గనైజేషన్‌తోపాటు హోం, ఐటీ, రక్షణ, మానవ వనరుల మంత్రిత్వ శాఖలు వేర్వేరు కార్యకలాపాలు చేపట్టాయి. అయితే డేటా భద్రత, గోప్యతపై ఆందోళన పెరుగుతుండటంతో 'పర్సనల్ డేటా ప్రొటెక్షన్'బిల్లు తేవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలనలో ఉన్న ఈ బిల్లు... త్వరలో పార్లమెంటు ముందుకు వచ్చే అవకాశం ఉంది. బిల్లు ప్రతిపాదనల ప్రకారం తొలుత చైర్మన్, నలుగురు శాశ్వత సభ్యులు ఉండే డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేస్తారు. ఏది సున్నిత సమాచారం, ఏది కీలక సమాచారం అనే అంశాలను ఈ అథారిటీ నిర్వచించడంతోపాటు దేశంలోనే ఉండాల్సిన డేటా, ఇతర దేశాలకు ఇవ్వాల్సిన డేటాపై స్పష్టత ఇస్తుంది. బిల్లును చట్టంగా మార్చి ఒకట్రెండేళ్లలో అమల్లోకి తెచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సైబర్ సెక్యూరిటీ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని నిర్ణయించింది.

రోజూ 800 మందికి కరోనా స్క్రీనింగ్

▶ మొదటి పేజీ తరువాయి

రోజూ వేలాది మంది ప్రయాణికులు హైదరాబాద్ విమానాశ్రయంలో దిగుతుంటారు. వారిలో ఆ ఐదు దేశాలకు చెందిన ప్రయాణికులు రోజూ సరాసరి 800 మంది వస్తుంటారని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. మిగిలిన దేశాలకు చెందినవారికి జలుబు, దగ్గు, తలనొప్పి వంటి కరోనా వైరస్ లక్షణాలుంటే వెంటనే తమను సంప్రదించాలని కోరుతున్నారు. అటువంటి లక్షణాలతో ఇప్పటికే ఇళ్లకు చేరినవారుంటే తమను సంప్రదించాలని లేకుంటే ఎవరికివారు ఇళ్లల్లోనే ఒంటరిగా ఉండిపోవాలని కోరుతున్నారు. ఇలా 27 మంది ప్రయాణికులు వస్తే వారు తమ తమ ఇళ్లల్లో 28 రోజుల పాటు ఇంటి నిర్బంధంలో ఉండాలని ఆదేశాలు జారీచేశారు. గాంధీ, ఫీవర్ ఆస్పత్రికి ఇప్పటివరకు వచ్చిన 19 ప్రయాణికులను పరీక్షించగా, వారికి కరోనా లక్షణాలు లేవని నిర్ధారణ అయింది. ఇదిలావుంటే రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్‌లైన్‌కు 125 ఫోన్ కాల్స్ వచ్చినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. 4,275 వ్యక్తిగత రక్షణ పరికరాలు, 15 వేల ఎన్95 మాస్కులు అందుబాటులో ఉన్నాయి. మరోవైపు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ మరో ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక మార్గదర్శకాలు..

- కరోనా వైరస్ ప్రభావిత దేశాల నుంచి ఇక్కడకు వచ్చినవారు 28 రోజులు ఇంట్లోనే ఒంటరిగా ఉండాలి.
- అనుమానిత కేసులను విమానాశ్రయం నుంచి నేరుగా ఆస్పత్రికి పంపడానికి ప్రత్యేక అంబులెన్స్‌లను విమానాశ్రయంలో అందుబాటులో ఉంచాలి.
- చైనా, ఇతర ప్రభావిత దేశాలకు వెళ్లివచ్చిన ప్రయాణికుల రోజువారీ జాబితాను తయారు చేయాలి. వుహాన్ నుంచి వచ్చే ప్రతీ ఒక్కరినీ పరీక్షించాలి.
- విమానాశ్రయంలో పబ్లిక్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో జాగ్రత్తలతో రాసిన నోటీసులను స్టాండ్‌లపై ప్రదర్శించాలి. దానిపై కంట్రోల్ రూం నంబర్ కూడా ఇవ్వాలి.
- ఆ మూడు భాషల్లో ప్రచురించిన 80 వేల కరపత్రాలను విమానాశ్రయ ఆరోగ్య అధికారికి, హెల్ప్ డెస్క్, ఇమ్మిగ్రేషన్ కౌంటర్, ఇన్ఫర్మేషన్ డెస్క్ వద్ద ఉంచాలి. అంతర్జాతీయ ప్రయాణికులకు, దేశీయ ప్రయాణికులకు తప్పనిసరిగా ఇవ్వాలి.
- అవసరమైతే 24 గంటల్లోపు కరపత్రాల అదనపు స్టాక్‌ను సరఫరా చేయాలి.
- అలాగే దేశీయ ప్రయాణికులు బయటకు వచ్చేచోట హెల్త్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి.
- అన్ని అంతర్జాతీయ విమానాల్లో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో కరోనాపై ప్రకటనలు ఇవ్వాలి.
- విమానాశ్రయంలోని సిబ్బందికి గ్లోవ్స్, మాస్కులు ఇవ్వాలి. వాటిని ఒక వారం వరకు సరిపోయేలా తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేస్తుంది. తర్వాత విమానాశ్రయం అధికారులు సరఫరా చేయాలి.
- బయో మెడికల్ వ్యర్థాలను, ఉపయోగించిన చేతి తొడుగులు, మాస్కులను పారవేయడం మొత్తం నిబంధనలకు అనుగుణంగా ఉండాలి.
- ఆయుష్ మంత్రిత్వశాఖ కరోనా వైరస్ సోకకుండా సిఫార్సు చేసిన హోమియోపతి మందు 'ఆర్సెనికమ్ ఆల్బమ్ 30'ను వాడవచ్చు.
- ప్రతి మెడికల్ కాలేజీలో ముగ్గురు సభ్యుల వైద్య బృందం ఉండాలి. ప్రతి జిల్లాలో కనీసం 5 పడకల ఐసోలేషన్ వార్డులను అందుబాటులో ఉంచాలి.

'ఇన్‌సైడర్'పై ఈడీ కేసు

అమరావతి 'భూ దందా'పై కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

రాజధాని పేరుతో జరిగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో చంద్రబాబు, మరికొందరిపై అభియోగాలు

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో జరిగిన భూ కుంభకోణంపై దర్యాప్తునకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమైంది. రాజధాని పేరుతో సాగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో మనీ ల్యాండ రింగ్‌కు పాల్పడ్డారంటూ ఈడీ సోమవారం ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కేసు నమోదు చేసింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు, మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు, మరికొందరు టీడీపీ నేతలపై సీఐడీ ఇచ్చిన ఆధారాల నేపథ్యంలో ఈడీ కేసు నమోదు చేసింది. చంద్రబాబు హయాంలో రాజధాని ఏర్పాటుపై పథకం ప్రకారం ముందే లీకులు ఇచ్చి అమరావతి ప్రాంతంలో ట

సహకార సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

- 905 ప్యాక్స్‌ల్లోని 11,765 డైరెక్టర్ పదవులకు ఎన్నికలు
- ఈ నెల 15న పోలింగ్.. అదేరోజు సాయంత్రం ఫలితాలు
- 6 నుంచి 8వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 9న నామినేషన్ల పరిశీలన.. 10న విత్‌డ్రా, గుర్తుల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 905 ప్యాక్స్‌ల్లోని 11,765 డైరెక్టర్ పదవులకు జిల్లాల్లో సహకార ఎన్నికల అథారిటీ సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, ఆర్‌డీవోలు, జిల్లాల సహకార అధికారులతో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ అయిన జనార్దన్ రెడ్డి, రాష్ట్ర సహకార కమిషనర్ వీరబ్రహ్మయ్య, రాష్ట్ర ఎన్నికల సహకార అథారిటీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించారు. మొత్తం 906 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్‌ల)కుగాను మహబూబాద్ జిల్లాలోని ఒక ప్యాక్స్‌కు ఎన్నిక నిర్వహించడం లేదు. ఆ ప్యాక్స్‌లో నిధులు లేకపోవడమే ఇందుకు కారణంగా అధికారులు తెలిపారు. ప్రతీ ప్యాక్స్ వారి నిధులతోనే ఎన్నికలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. దీంతో ప్రతీ ప్యాక్స్‌కు 13 మంది డైరెక్టర్ల చొప్పున మొత్తం 11,765 డైరెక్టర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఇటు ప్రతి ప్యాక్స్‌కు ఎన్నికల నోటీసులు కూడా జారీ చేశారు. ఇక సహకార సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500, బీసీలు రూ.750, ఓసీలు (ఇతరులు) రూ.వెయ్యి నామినేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఓటర్లను 13 డైరెక్టర్ వార్డులుగా విభజిస్తారు. ఈ 13 వార్డుల్లో రెండు డైరెక్టర్ పదవులు మహిళలు, మరో రెండు డైరెక్టర్ పదవులు బీసీలకు, ఒక డైరెక్టర్ పదవి ఎస్సీ, ఎస్టీల్లో ఒకరికి రిజర్వు చేశారు.

ఒక్కో డైరెక్టర్ ఒక పోలింగ్ బూత్

ఒక్కో డైరెక్టర్ ఎన్నికకు ఒక్కో పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో 11,765 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ముగ్గురు ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు దాదాపు 30 వేల మంది సిబ్బందికి మొదటి విడత శిక్షణ పూర్తి చేసినట్లు సహకార శాఖ వర్గాలు వెల్లడించాయి. నోటిఫికేషన్ ప్రకారం నామినేషన్లు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు స్వీకరించనున్నారు. తొమ్మిదో తేదీన నామినేషన్ల పరిశీలన, 10న ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, గుర్తు కేటాయింపులు చేస్తారు. ఈ నెల 15వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి, వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

సమాన ఓట్లు వస్తే లాటరీ..

ఒక్కోఅభ్యర్థి రెండు సెట్ల నామినేషన్ పత్రాలకు మించి దాఖలు చేయరాదు. ఒక డైరెక్టర్ వార్డులో ఓటరుగా నమోదైన వ్యక్తి మరో డైరెక్టర్ వార్డులో పోటీ చేయొచ్చు. సదరు అభ్యర్థిని బలపరిచి, ప్రతిపాదించే వ్యక్తులు మాత్రం ఆయా వార్డుల్లోనే ఓటు హక్కు కలిగి ఉండాలి. ఒక వ్యక్తి ఒకరిని మాత్రమే ప్రతిపాదించాల్సి ఉంటుంది. బలపరిచే, ప్రతిపాదించే వ్యక్తులు ఓటు వేసేందుకు అర్హులై ఉండాలి. నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి ఇచ్చే సమయంలో తప్పనిసరిగా ప్రతిపాదిస్తున్న వ్యక్తి పోటీ చేసే వ్యక్తితో ఉండాల్సి ఉంటుంది. ఇక పోటీ చేసే అభ్యర్థులిద్దరికీ సమానంగా ఓట్లు వస్తే విజేతను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు.

భళా.. తమిళ ఫార్ములా!

రోడ్డు ప్రమాదాల నివారణకు తమిళనాడు తరహా ప్రత్యేక సెల్

- ట్రామాకేర్‌కు పెద్దపీట.. 24 గంటలూ అందుబాటులో వైద్యసేవలు
- అక్కడి విధానాన్ని అధ్యయనం చేసిన తెలంగాణ పోలీసుశాఖ
- ప్రధాన విభాగాలతో కమిటీ.. విధానం అమలుకు సీఎం పచ్చజెండా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తమిళనాడు తరహాలో ప్రత్యేక విధానాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన ఈ విధానంలో తమిళనాడులో చాలావరకు సత్ఫలితాలిచ్చాయి. ఫలితంగా అక్కడ దాదాపు 35 శాతానికి పైగా రోడ్డు ప్రమాద మరణాలు తగ్గాయి. అక్కడ విజయవంతమైన ఈ విధానాన్ని తెలంగాణ పోలీసులు అధ్యయనం చేశారు. దీనిపై ఇటీవలే సీఎస్‌కు నివేదిక సమర్పించారు. అది సీఎం వద్దకు వెళ్లడం, ఆయన సుముఖత వ్యక్తం చేయడంతో త్వరలో ఇక్కడా అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మన వద్ద ప్రమాదాలకు కారణాలివే..

ప్రమాదాల నివారణే లక్ష్యంగా తమిళనాడు విధానం అమలు చేయబోతున్నామని చెబుతోన్న పోలీసు ఉన్నతాధికారులు.. త్వరలోనే అక్కడి తరహాలో ప్రత్యేక కమిటీని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలకు కారణమవుతోన్న బ్లాక్‌స్పాట్లను గుర్తించడంతో పాటు ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర సేవలు 24 గంటలూ అందుబాటులోకి తెస్తామని అంటున్నారు.

- రాష్ట్రంలో జరుగుతున్న అత్యధిక ప్రమాదాలకు తొలి కారణం అతి వేగమైతే, రెండో కారణం బ్లాక్‌స్పాట్లు (తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు).
- మూలమలుపుల వద్ద రోడ్లకు గట్టు కోణం (సూపర్ ఎలివేషన్.. దాదాపు 7 డిగ్రీలు) ఏర్పాటు చేయకపోవడం, ప్రమాద హెచ్చరికలు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.
- రాష్ట్రంలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లలో హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి డెయిరీఫాం, బేగంపేట ఎయిర్‌పోర్టు వెనక ప్రమాదకర మలుపు, రైల్‌నిలయం రోడ్డు అత్యంత ప్రమాదకరమైనవి.
- తరచూ ప్రమాదాలు జరిగే ఈ ప్రాంతాల్లో రహదారి లోపాలు సవరించి, చిన్నపాటి మరమ్మతులు చేశారు. దీంతో ఇక్కడ చాలాకాలంగా ప్రమాదాలు దాదాపు జరగడం లేదని పోలీసులు చెబుతున్నారు.

అక్కడ ఏం చేశారు..

వాస్తవానికి రోడ్డు ప్రమాదాలు జరగ్గానే.. దాన్ని పోలీసుల పనిగానో లేదా ఆరోగ్యవిభాగం పనిగానో చూస్తారు. రోడ్డు ప్రమాదాలు, మరణాల నివారణ కేవలం వీరి వల్ల మాత్రమే సాధ్యం కాదు. మిగతా అన్ని విభాగాలూ కలిసి వచ్చినపుడే అది సాధ్యమవుతుందన్న విషయాన్ని తమిళనాడు గుర్తించింది. అనుకున్నదే తడవుగా పోలీసులతో పాటు, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, జాతీయరహదారుల అధికారులను ఈ ప్రాజెక్టులో భాగస్వాములను చేసింది. దీనికి నేతృత్వం వహించేందుకు కమిషనర్‌ను నియమించింది. ఈ కమిటీ మొదట తమిళనాడులో తరచుగా ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్స్, ప్రమాదకర మలుపులను గుర్తించి వాటిని సరిచేసింది. ప్రమాదాలు జరిగిన తరువాత 'గోల్డెన్ అవర్'కు ఉన్న ప్రాధాన్యం నేపథ్యంలో మరణాలను తగ్గించేందుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర విభాగాలను ఏర్పాటు చేసింది. ట్రామాకేర్ సదుపాయాలతో కూడిన అత్యవసర విభాగాలను 24 గంటలూ అందుబాటులో ఉంచింది. ప్రమాదం జరిగిన తరవాత జాతీయ రహదారులు, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలు రంగంలోకి దిగి రోడ్లలోని లోపాలను గుర్తించేవి. ఆ మేరకు ఆయా రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టేవారు. అలా రోడ్డు ప్రమాదాలను 35 శాతానికిపైగా అరికట్టగలిగారు.

మన రాష్ట్రంలో ఇలా..

34,000	22,000	6,600	6,800	44
ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు	ఏడాదికి రోడ్డు ప్రమాద క్షతగాత్రులు	2018లో రోడ్డు ప్రమాద మృతులు	2019లో రోడ్డు ప్రమాద మృతులు	రాష్ట్రంలో ప్రమాదకరమైన బ్లాక్‌స్పాట్లు

ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులు!

- జేఎన్టీయూ అనుబంధ కాలేజీల్లో ప్రవేశపెట్టేందుకు చర్యలు
- ఏఐ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ..
- సదుపాయాలు, ఫ్యాకల్టీ ఉన్న కాలేజీలన్నింటికీ ఇవ్వాలని నిర్ణయం
- ఎం.ఫార్మసీలోనూ 4 కొత్త కోర్సులకు అనుమతి
- డిమాండ్ లేని నాలుగు పాత కోర్సుల తొలగింపు

సాక్షి, హైదరాబాద్: జేఎన్టీయూ పరిధిలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. అవసరమైన సదుపాయాలు, ఫ్యాకల్టీ ఉంటే 2020-21 విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులు ప్రారంభించేందుకు కాలేజీలకు గుర్తింపు ఇవ్వాలని జేఎన్టీయూ నిర్ణయించింది. 2019-20 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో 5 కాలేజీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ప్రవేశ పెట్టగా, 2020-21 విద్యా సంవత్సరంలో సదుపాయాలు ఉన్న అన్ని కాలేజీలు ఆ కోర్సును ప్రారంభించేందుకు అనుమతులను ఇవ్వనుంది. ఏఐతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సీఎస్ఐటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్ (సీఎస్‌బీఎస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ (ఐటీఈ) కోర్సులను ప్రవేశ పెట్టేందుకు అనుబంధ గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో 2020-21 విద్యా సంవత్సరంలో జేఎన్టీయూ కాలేజీలతో పాటు దాని అనుబంధ కాలేజీల్లో ఆయా కోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి.

170 ఇంజనీరింగ్ కాలేజీల్లో లక్షకు పైగా సీట్లు..

ప్రస్తుతం జేఎన్టీయూ పరిధిలో 170 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో లక్షకు పైగా సీట్లు ఉన్నాయి. అయితే ఏటా జేఎన్టీయూ 85 వేల వరకు సీట్లను భర్తీ చేసేందుకు కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇస్తోంది. ప్రస్తుతం కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈసారి అదనంగా మరో 10 వేల సీట్లలో ప్రవేశాలకు అనుమతించే అవకాశం ఉంది. మరోవైపు 100 ఫార్మసీ కాలేజీలు, 10 పీజీ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో 50 వేల వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లోనూ సీట్లు పెరిగే అవకాశం ఉంది. అయితే కొత్త కోర్సులను ప్రవేశ పెట్టేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉండి, ఆయా కోర్సులను ప్రారంభించాలనుకునే యాజమాన్యాల నుంచి జేఎన్టీయూ దరఖాస్తులు స్వీకరించి అనుబంధ గుర్తింపు ఇవ్వనుంది. ఇదే విషయాన్ని డ్రాఫ్ట్ అఫీలియేషన్ రెగ్యులేషన్స్‌లో పొందుపరిచింది.



కొత్త కోర్సులతోపాటు కొత్త కాలేజీలు

రానున్న విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులతో పాటు అదనపు సీట్లకు ఓకే చెప్పనుంది. మరోవైపు కొత్త కాలేజీల ఏర్పాటును కూడా అనుబంధ గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఆయా కాలేజీలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుంటేనే వాటికి ఓకే చెప్పాలని, నోఆబ్జెక్షన్ సర్టిఫికెట్లను (ఎన్‌వోసీ) అందజేయాలని నిర్ణయించింది. కొత్త కాలేజీలు ఏర్పాటు చేయాలన్నా, అనుమతి ఇవ్వాలన్నా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత యూనివర్సిటీ ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంటుంది. అది ఉంటేనే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కాలేజీల ఏర్పాటుకు, ఇంటేక్ పెంపునకు అనుమతి ఇవ్వనుంది. 2020-21 విద్యాసంవత్సరంలో కాలేజీల అనుమతులకు సంబంధించిన ఏఐసీటీఈ అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్‌ను ఇంకా విడుదల కాలేదు. అది విడుదల అయ్యాక ఏఐసీటీఈ అందులో విధాన నిర్ణయానిన్న ప్రకటించనుంది. కొత్త కోర్సులకు అనుమతించాలని కిందటేడాదే ఏఐసీటీఈ విధానపర నిర్ణయం తీసుకొని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డాటా సైన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి కోర్సులకు అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇపుడు ఏఐసీటీఈ వ్యతిరేకించేది ఉండదు కాబట్టి జేఎన్టీయూ నిర్ణయం తీసుకుంది.

ఎం.ఫార్మసీలో నాలుగు కొత్త కోర్సులు..

ఎం.ఫార్మసీలోనూ నాలుగు కొత్త కోర్సులకు అనుమతి ఇవ్వనుంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆయా కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇతర సబ్జెక్టులతో కాంబినేషన్‌గా ఉన్న సబ్జెక్టులను ప్రత్యేక సబ్జెక్టులుగా ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మాసూటికల్ అనాలిసిస్, ఫార్మాసూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్, ఫార్మాసూటికల్ క్వాలిటీ అషూరెన్స్ కోర్సులను నిర్వహించేందుకు కాలేజీలకు అనుబంధ గుర్తింపు జారీ చేయనుంది. మరోవైపు పెద్దగా డిమాండ్ లేని హాస్పిటల్ అండ్ క్లినికల్ ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ అండ్ క్వాలిటీ అషూరెన్స్, ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్, క్వాలిటీ అషూరెన్స్ కోర్సులను తొలగించింది.

11న కలెక్టర్ల సదస్సు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాలనను పరుగులు పెట్టించేందుకు ఐఏఎస్ అధికారుల బదిలీలతో శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్.. కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 15వ తేదీతో సహకార ఎన్నికలు ముగియనున్నాయి. దీంతో ఏడాదిగా సాగుతున్న ఎన్నికల హడావుడికి తెర పడనుంది. ఈ నేపథ్యంలో పాలనపై పూర్తి స్థాయి దృష్టి పెట్టాలని భావిస్తున్న ముఖ్యమంత్రి.. కలెక్టర్ల సదస్సు నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 11న ఉదయం 11 గంటలకు ప్రగతి భవన్‌లో కలెక్టర్లతో సమావేశమై.. ప్రభుత్వ ప్రాధమ్యాలను తెలియజేయడంతోపాటు ముఖ్యమైన పథకాలు, కార్యక్రమాల అమలుపై దిశానిర్దేశం చేస్తారు. అలాగే రెండో విడత 'పల్లె ప్రగతి'లో సాధించిన పురోగతిని జిల్లాలవారీగా సమీక్షిస్తారు. ఇక ఈనెల 15వ తేదీ తర్వాత రాష్ట్రంలో 'పట్టణ ప్రగతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణ పారిశుద్ధ్యంతోపాటు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్నవివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని సీఎం నిర్ణయించారు. ఈ కార్యకమంలో భాగంగా చేపట్టనున్న పనులను, వాటి లక్ష్యాలను కలెక్టర్లకు వివరించనున్నారు. ప్రభుత్వం ఆదివారం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. 21 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. వీరిలో చాలామంది తొలిసారిగా జిల్లా పగ్గాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ఉద్దేశాలను తెలియజేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అలాగే, రెవెన్యూ చట్టం తీసుకురావాలని కృతనిశ్చయంతో ఉన్న సీఎం.. ఆ చట్టం ఎలా ఉండాలనే అంశంపై కలెక్టర్ల అభిప్రాయాలను అడిగి తెలుసుకునే అవకాశం కూడా కనిపిస్తోంది.

రఘునందన్‌రావుపై కేసు నమోదు

- అత్యాచారం, బ్లాక్‌మెయిలింగ్ ఆరోపణలతో హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన మహిళ
- హక్కుల కమిషన్ ఆదేశాలతో కేసు నమోదు చేసిన పోలీసులు

పటాన్‌చెరు: తన కేసును వాదించాలని కోరితే తనపై అత్యాచారం చేయడంతో పాటు కొన్నేళ్లు వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఓ మహిళ ప్రముఖ న్యాయవాది, బీజేపీ నేత రఘునందన్‌రావుపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఆయనపై కేసు నమోదు చేశారు. మానవ హక్కుల కమిషన్ సూచనలతో, ఆ మహిళ చేసిన ఆరోపణలపై రామచంద్రాపురం పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. రఘునందన్‌రావుపై రేప్, బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపు ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్‌కుమార్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. ఆర్సీపురానికి చెందిన ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని.. ఈ నేపథ్యంలో తన తరపున కేసును వాదించాలని కోరుతూ గతంలో పటాన్‌చెరులోని రఘునందన్ ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో 2007లో ఒక రోజున రఘునందన్‌రావు తనకు మత్తు కలిగించేదేదో కలిపి కాఫీ తాగించాడని, అది తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాత తనపై అత్యాచారం చేశాడని ఆరోపించారు. ఆ తరువాత తన నగ్న ఫొటోలను వైరల్ చేస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. తర్వాత తాను పోలీసుల వద్దకు వెళ్లినా న్యాయవాదిపై చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆమె హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో హక్కుల కమిషన్ ఆ మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు సోమవారం రఘునందన్‌రావుపై రామచంద్రాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏ నేరం చేయలేదు: రఘునందన్‌రావు

ఆ మహిళ చేస్తున్న ఆరోపణలపై రఘునందన్‌రావు 'సాక్షి'తో మాట్లాడుతూ 'నాపై ఆ మహిళ చేస్తున్న ఆరోపణలు నూటికి నూరు శాతం అవాస్తవాలు'అని తెలిపారు. ఇప్పటి వరకు తనకు ఎవరి వద్ద నుంచి ఎలాంటి నోటీసులు రాలేదన్నారు. తాను ఏ నేరం చేయలేదని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయో చెప్పలేనని, పూర్తి వివరాలను తెలుసుకుని స్పష్టత ఇస్తానని చెప్పారు.

కాజీపేట్ జంక్షన్‌ను డివిజన్‌గా ప్రకటించాలి

రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు టీఆర్ఎస్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు టీఆర్ఎస్ ఎంపీలు పసునూరి దయాకర్, బండ ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ విన్నవించారు. ఈమేరకు సోమవారం ఇక్కడ కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కాజీపేట రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని, రహదారి విస్తరణ కారణంగా ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు నిరుపయోగంగా ఉన్న రైల్వే స్థలం కేటాయించాలని కోరారు.

వేయి స్తంభాల గుడి పనులకు నిధులొచ్చేలా చూడండి..

గోయల్‌తో భేటీ అనంతరం ఎంపీలు పసునూరి దయాకర్, బండ ప్రకాశ్, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ భారత పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ ఉషా శర్మతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి పునరుద్ధరణ పనులను వేగంగా జరిపేందుకు వీలుగా కేంద్రం నుంచి నిధులు వచ్చేలా చూడాలని విన్నవించారు. నిర్మాణ ధరలకు సంబంధించిన సమస్య కారణంగా పునరుద్ధరణ పనుల్లో జాప్యం చోటు చేసుకుంటోందని వివరించారు. సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణలో చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్ నగరానికి కేంద్రం నిధులు కేటాయించాలని కోరారు. కేంద్రం తాజా బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిందని బండ ప్రకాశ్ ఆరోపించారు.

నీళ్లు, నిధులు, నియామకాలపై దృష్టి

హైదరాబాద్: నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రస్తుతం నియామకాలపై సర్కారు దృష్టిసారించిందని తెలిపారు. కిస్మత్‌పూర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో 284 మంది ఎక్సైజ్ ఎస్సైలకు సోమవారం ఆయన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామన్నారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన అధికారులు అంకితభావంతో శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. గుడుంబా రహిత రాష్ట్రంగా చేయడంతో పాటు గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నీరాను అందుబాటులోకి తేనుందని చెప్పారు. ఈత, తాటిచెట్లను పెంచే వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. అనంతరం ఎక్సైజ్ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఉద్యమించండి

సాక్షి, హైదరాబాద్: చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ప్రజలు ఉద్యమించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ కావాలని బలంగా కోరుకుంటున్నా.. జేఏసీగా ఏర్పడి ఉద్యమించినా సీఎం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. తాజాగా వేములవాడ, జోగిపేట రెవెన్యూ డివిజన్లు ప్రకటించి, చేర్యాల ప్రజలను విస్మరించడం శోచనీయమని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేర్యాలనియోజకవర్గంపై ముందునుంచి సీఎం కేసీఆర్ వివక్ష చూపుతున్నారని, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.. గుడ్డి గుర్రాల పళ్లు తోముతున్నారా? అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం పైన ఒత్తిడి తేవడం చేత కాదా? ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

సహకార ఎన్నికల తేదీని మార్చండి: టీఆర్‌పీఎస్

సాక్షి, హైదరాబాద్: సహకార ఎన్నికల తేదీని మార్చాలని గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి (టీఆర్‌పీఎస్) డిమాండ్‌చేసింది. ఈనెల 15న గిరిజనుల ఆరాధ్యంగా భావించే సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు ఉన్నందున మరో రోజున ఈ ఎన్నికలు నిర్వహించాలని కోరింది. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ నేతృత్వంలో టీఆర్‌పీఎస్ ప్రతినిధి బృందం సహకారశాఖ కమిషనర్ వీరబ్రహ్మయ్యను కలసి వినతిపత్రం అందజేసింది.

రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు జరగాలి

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న సహకార ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం బాగా పెరిగిపోయి వ్యవస్థ అస్తవ్యస్తం అయిందని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి వ్యవస్థను బాగుచేశారని పేర్కొన్నారు. సహకార ఎన్నికలపై సోమవారం గాంధీభవన్‌లో కిసాన్ సెల్ అత్యవసర సమావేశం నిర్వహించింది. అనంతరం కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డితో కలిసి కోదండరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సహకార సంఘాలను పెద్దగా పట్టించుకోలేదని ఆరోపించారు.

'మా సహకార సంఘాలకు ఎన్నికలు పెట్టండి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం పశుసంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ రాంచందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో 7,985 ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలున్నాయని, వీటి పాలకవర్గాలకు పదవీకాలం ముగిసి ఐదేళ్లు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. దీంతో సంఘాల కార్యకలాపాలు నిలిచిపోయాయని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడిగా

అద్దంకి దయాకర్ ఎన్నిక

ఐదు రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక.. మార్చి 1న కాకినాడలో సభ

సాక్షి, హైదరాబాద్: మాల మహానాడు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడిగా అద్దంకి దయాకర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 7 రాష్ట్రాల ప్రతినిధుల సమావేశంలో దయాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిల్లి సుధాకర్ (తెలంగాణ), సిద్ధాంతుల కొండబాబు (ఏపీ), ఎ.అరివేలు (తమిళనాడు), కొండప్ప (కర్ణాటక), బత్తుల లింగం (మహారాష్ట్ర)లను ఆయా రాష్ట్రాలకు అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బైరి రమేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ మాలల అస్తిత్వం కోసం, దళితుల ఐక్యత కోసం మాల మహానాడు పనిచేస్తుందని చెప్పారు. దళితుల ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ కోసం మార్చి 1న మాలల యుద్ధభేరి బహిరంగ సభ కాకినాడలో నిర్వహిస్తున్నామని చెప్పారు.

'షీటీమ్స్'పై మరింత అవగాహన రావాలి

సాక్షి, హైదరాబాద్: షీటీమ్స్ పనితీరుపై సామాన్య మహిళలకు మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందని ఐజీ స్వాతి లక్రా అన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వేధింపులను అరికట్టే క్రమంలో షీటీమ్స్ ఎలా పనిచేస్తాయో వివరించే డాక్యుమెంటరీని సోమవారం ఆమె ఆవిష్కరించారు. విద్యార్థినులు పోకిరీల నుంచి ఎదురయ్యే వేధింపులను ఎలా ఎదుర్కోవాలి? షీటీమ్స్ వారి ఆటకట్టించే విధానాలు, ఆపద సమయాల్లో ఏవిధంగా సాయపడతాయి? తదితర వివరాలన్నింటినీ ఈ డాక్యుమెంటరీలో పొందుపరిచారు. స్వాతి లక్రా మాట్లాడుతూ నేటి యువతలో 80 శాతం స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ డాక్యుమెంటరీని ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌ల్లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-NIT No.21/S.E.(R&B)KNR/01 to 03/2019-20 తేది: 28.01.2020
పనుల సంఖ్య(03). పనుల పేరు: కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ టౌన్‌లోని LMD లేక్ ఫ్రంట్ వద్ద శాతవాహన యూనివర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు ప్రీ-క్యాస్ట్ కాంపౌండ్ వాల్ నిర్మాణము మరియు ఇతర అదే విధమైన పనుల కోసం దిగువ నంతకందారునే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: 1.50 కోట్లు. బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం: 04.02.2020న సా.4.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 11.02.2020 మ.3.30 గం. కమర్షియల్ స్టేజ్: 11.02.2020 సా.4.00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ అంటే www.tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నం. 0878-2243754.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్, కరీంనగర్
DIPR Ro.No.2339-DP/CL/Advt/1/2019-20, Dt: 03.02.2020

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-NIT No.22/S.E. (R&B)KNR/01 to 09/2019-20 తేది 28.01.2020
పనుల సంఖ్య: (09), పనుల పేర్లు: మానకొండూరు-హుస్నాబాద్ రోడ్‌కు పీరియాడికల్ రెన్యూవల్, మానకొండూరు-పచ్చునూరు వయా వెల్లె రోడ్‌కు పీరియాడికల్ రెన్యూవల్, PWD రోడ్-వేములగట్ రోడ్‌కు పీరియాడికల్ రెన్యూవల్ మరియు ఇతర సివిల్ పనులు దిగువ నంతకందారు పరిధిలో ఉన్నాయి. మొత్తం ECV: 3.72 కోట్లు. బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం: 03.02.2020 సా.4 గం. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 10.02.2020 మ. 3.30 గం. కమర్షియల్ స్టేజ్: 10.02.2020 సా.4 గం.కు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నం.0878- 2243754
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (R&B) సర్కిల్, కరీంనగర్
DIPR RO.No.2331-DP/CL/Advt/1/2019-20, Dt: 03.02.2020

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమం, 5వ అంతస్తు, D.S.S. భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, గిరిజన సంక్షేమం, హైదరాబాద్
టెండర్ ప్రకటన
NIT No. SE/TW/HYD/258/2019-20, తేది: 31.01.2020
పని పేరు: హైదరాబాద్, బంజారా హిల్స్, రోడ్ నం. 10 వద్ద బంజారా భవన్ మరియు కుమరమ్ భీమ్ భవన్‌కు 125 & 320 KVA DG సెట్స్ సరఫరా మరియు బిగించుట. అంచనా వ్యయము: రూ. 72.96 లక్షలు (సుమారుగా). బిడ్ దాఖలు ప్రారంభ తేది: 05.02.2020 సా. 05.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది: 13.02.2020 మ. 03.00 గం. టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 13.02.2020 సా. 04.00 గం. కమర్షియల్ బిడ్ తెరుచు తేది: 14.02.2020 సా. 05.00 గం. తదుపరి వివరాలను ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ https://tender.telangana.gov.in// లో చూడవచ్చును. ఫోన్ నం.: 040-23315950, మెయిల్ ID: setwhyd13@gmail.com
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, 5వ అంతస్తు, D.S.S. భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్
DIPR RO.No. 2335-DP/CL/ADVT/1/2019-20, Dt : 03.02.2020

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర
నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04
ఇ-ప్రొక్యూర్‌మెంట్ - టెండరు ప్రకటన

ఇ-టెండరు ప్రకటన నం & తేదీ	పనిపేరు	రేంజింగ్ (సుమారు)	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది
ఇ-టెండరు ప్రకటన EP నం. 147/CG M(E)/(TC/T1/O&M Div-XI/Ferric Alum/2019-20, తేది: 03.02.2020	సాదాబ్‌నగర్, O&M డివిజన్ నం. XI, సబ్-డివిజన్ నం.1 పరిధిలోని కోదండాపూర్ వద్ద KDWSP ఫేజ్-III యొక్క వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం IS 299/2012ను నిర్దారించే ఫెరిక్ ఆలంగ్రేడ్-IV 16% స్ట్రెంత్ మరియు IS 15573/2005ను నిర్దారించే పాలీ అల్యూమినియం క్లోరైడ్ పౌడర్ ఒక సంవత్సరం కాలానికి తయారీ, సరఫరా మరియు బట్వాడా	రూ. 137.257 లక్షలు	04.02.2020 ఉ.10.30

సమాచారాన్ని ప్రధానంగా ZIP ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా టెండరుదారులను కోరడమైనది. తదుపరి వివరాలను www.eprocurement.gov.inలో చూడవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004

బి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
రిజిస్టరు ఆఫీసు : కొత్తగూడెం కాలరీస్ - 507 101
ప్రకటన
భారత అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ. F.No. 8-277/1985-FC(vol. I) తేది. 15.10.2019 ప్రకారం బి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియాలో మొదటి సారి రెన్యూవల్ కొరకు 0.9 హ. పద్మావతి గని నందు సబ్-మెర్జబుల్ పంపులు పెట్టుటకు భూమిని కేటాయించుటకు మొదటి దశ అనుమతిలో విధించిన నిబంధనల తెలుగు తర్జుమా ప్రతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు ప్రకటించడం అయినది.
(i). మళ్లించిన అటవీ భూమి యొక్క చట్టపరమైన స్థితి మారదు. (ii). రాష్ట్ర ప్రభుత్వము యూజర్ ఏజెన్సీ నుండి కాంపెన్సేటరీ అటవీ నిర్మూలన పైపు పడే అవకాశం ఉన్న చెట్ల సంఖ్య కంటే పది రెట్లు ఎక్కువ తోటల ఖర్చు (10 సంవత్సరాల నిర్వహణతో సహా) CAMPA ఖాతాలో ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే జమ చేయాలి (https//parivesh.nic.in). తలగీపోయిన అటవీ భూమిని స్టేజ్-II ఆమోదించడానికి ముందు రాష్ట్ర అటవీ శాఖ గుర్తించాలి. (iii). గౌరవ సుప్రీంకోర్టు సివిల్ కేస్ నెంబర్ 202/1995లో జారీ చేసిన ఉత్తర్వు తేదీ. 28.03.2008, 24.04.2008 మరియు 09.05.2008 మరియు కేంద్ర ప్రభుత్వ అడవులు మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ నిర్దేశాల లేఖ 5-3/2007-FC తేదీ. 05.02.2009 లను అనుసరించి మళ్లించిన అటవీ భూమి యొక్క నికర ప్రస్తుత విలువ (NPV) ను నిర్ణయించి యూజర్ ఏజెన్సీ చెల్లించవలెను. అట్టి నిధులను CAMPA ఖాతాలో జమ చేయవలెను (iv). పై నికర ప్రస్తుత విలువను యూజర్ ఏజెన్సీ చెల్లించినప్పుడు సుప్రీం కోర్టు తుది ఉత్తర్వుల ప్రకారం ఏదేని అదనపు మొత్తం చెల్లించాల్సి వస్తే ఆ సొమ్మును చెల్లిస్తామని ఒక వ్రాతపూర్వక అంగీకార పత్రమును యూజర్ ఏజెన్సీ ఇవ్వవలసి ఉంటుంది. (v). CA యొక్క ప్రయోజనం కోసం గుర్తించబడిన భూమి 1:50,000, స్కేల్ యొక్క సర్వే ఆఫ్ ఇండియా టోపో షీట్లో స్పష్టంగా చూపబడుతుంది. (vi). యూజర్ ఏజెన్సీ ప్రాజెక్ట్ నుండి తీసుకున్న అన్ని నిధులు CAMPA ఖాతాలో ఇ-పోర్టల్ (https//parivesh.nic.in) మాత్రమే జమ చేయబడతాయి. ఇతర పద్ధతి ద్వారా జమ చేసిన మొత్తం స్టేజ్-1క్లియరెన్స్ కి తీసుకోబడదు. (vii). సమ్మతి నివేదిక ఇ-పోర్టల్ (https//parivesh.nic.in)లో అప్‌లోడ్ చేయబడుతుంది. (viii). ఈ ఆమోదం క్రింద చెప్పిన అటవీ భూమిని మళ్లించే పృవది 1957 గనులు మరియు ఖనిజముల అభివృద్ధి మరియు నియంత్రణ చట్టం క్రింద మంజూరు చేసిన మైనింగ్ లీజు కాలంతో కో-టెర్మినస్ కాలానికి సవరించబడినది. (ix). యూజర్ ఏజెన్సీ పర్యావరణ రక్షణ చట్టం 1986 క్రింద పర్యావరణ అనుమతిని ఈ ప్రాజెక్ట్ కొరకు పొందవలెను. (x). FRA, 2006 యొక్క పూర్తి సమ్మతి సంబంధిత జిల్లా కలెక్టర్ నుండి ధృవీకరించబడిన ధృవీకరణ పత్రం ద్వారా నిర్ధారించబడుతుంది. (xi). అటవీ భూమిలో కార్మికులకు ఎట్టి శిబిరాలను ఏర్పాటు చేయరాదు మరియు యూజర్ ఏజెన్సీ అటవీ భూమికి నష్టం జరగకుండా కార్మికులకు వంట చెరకు లేదా ఇతర ఇంధనమును ఏర్పాటు చేయవలెను. (xii). డైవర్షన్ (మళ్లించిన) కొరకు ప్రతిపాదించిన అటవీ భూమిని కేంద్ర ప్రభుత్వ వారి ముందస్తు అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితులలోను ఇతర ఏజెన్సీకి/ శాఖలకు/ వ్యక్తులకు బదిలీ చేయకూడదు. (xiii). పక్క ప్రాంతాల వృక్షజాలం మరియు జంతుజాలానికి ఎటువంటి నష్టం జరగకూడదు. (xiv). యూజర్ ఏజెన్సీ తొలగించవలసిన చెట్లను తిరిగి పెట్టుటకు గల అవకాశాన్ని అన్వేషిస్తుంది మరియు చెట్లు నరికివేత తప్పని సరి అయినచో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అటవీశాఖ పర్యవేక్షణలోనే జరుగవలెను. (xv). ఈ పరతులలో దేనినైనా ఉల్లంఘిస్తే అటవీ (పరిరక్షణ) చట్టం, 1980 యొక్క ఉల్లంఘన అవుతుంది మరియు 28.03.2019 నాటి ఈ మంత్రిత్వ శాఖ లేఖ 5-2/2017-ఎఫ్‌సి ద్వారా జారీ చేసిన విధంగా అటవీ (పరిరక్షణ) చట్టం, 1980 యొక్క సమగ్ర మార్గదర్శకాల హ్యాండ్‌బుక్‌లోని చాప్టర్ 1లోని పేరా 1.21లో సూచించిన విధంగా చర్యలు తీసుకోబడతాయి. (xvi). యూజర్ ఏజెన్సీ పైన పేర్కొన్న షరతులకు సంబంధించి వార్షిక స్వీయ-సమ్మతి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత ప్రాంతీయ కార్యాలయానికి మరియు ఈ మంత్రిత్వ శాఖకు మార్చి చివరి నాటికి క్రమం తప్పకుండా సమర్పించాలి; మరియు (xvii) ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని చట్టాలు, నియమాలు, నిబంధనలు, మార్గదర్శకాలు, గౌరవనీయ కోర్టు ఉత్తర్వులు మరియు NGT ఆర్డర్ (లు) యొక్క అన్ని నిబంధనలను ప్రస్తుతానికి ఏదైనా అమలులో ఉంటే, ప్రాజెక్టుకు వర్తించే విధంగా యూజర్ ఏజెన్సీ పాటించాలి.
ఇట్లు
శ్రావణ్ కుమార్ వర్మ
డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్
PR/2019-20/KGMEST/SLK/110

ప్రభుత్వ ఆస్పత్రులకు మంచి రోజులు

అందుబాటులో పేదలకు అధునాతన వైద్యసేవలు: మంత్రి ఈటల

- ఇక గాంధీలోనే కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు
- గాంధీ, ఉస్మానియా తదితర ఆస్పత్రుల్లో పలు నిర్మాణాల ప్రారంభం

గాంధీలో కరోనా వైరస్ టెస్ట్ ల్యాబ్ ప్రారంభానికి ముందు ప్రత్యేక సూట్, మాస్క్ ధరిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆస్పత్రులకు మంచి రోజులు వచ్చాయని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. పేదలకు ఖరీదైన వైద్యసేవలను మరింత మెరుగ్గా అందించే ఆలోచనతో ప్రభుత్వం ఆయా ఆస్పత్రులను ఆధునీకరిస్తుందని చెప్పారు. ఇప్పటికే ఖరీదైన, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దిందని స్పష్టం చేశారు. నగరంలోని గాంధీ, ఉస్మానియా, ఇతర ప్రతిష్టాత్మక ప్రభుత్వాస్పత్రుల్లో పలు నిర్మాణాలకు శంకుస్థాపనలు, అత్యాధునిక వైద్య పరికరాలు, కొత్త భవనాల ప్రారంభాలతో సోమవారం ఆయన బిజీగా గడిపారు. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రభుత్వపరంగా చేసిన ముందస్తు ఏర్పాట్లు, అందించే వైద్య సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇప్పటి వరకు 21 అనుమానిత కేసులు నమోదయ్యాయని, వీటిలో 19 నెగెటివ్ రిపోర్ట్‌లు వచ్చాయని, మరొకటి రావాల్సి ఉందన్నారు. గాంధీ, ఫీవర్, ఛాతీ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశామని, మానిటర్లు, వెంటిలేటర్ల కొరత లేదని తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదని, మన వాతావరణంలో ఆ వైరస్ బతికే అవకాశం లేదన్నారు. ఇప్పటి వరకు రిపోర్టుల కోసం పుణే వైరాలజీ ల్యాబ్‌పై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై గాంధీలోనే కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

గాంధీలో 'కరోనా'టెస్ట్ లాబ్.. ఎంఎన్‌జేలో పెట్‌స్కాన్

- గాంధీ ఆస్పత్రిలో కరోనా వైరస్ టెస్ట్ లేబొరేటరీ, డెర్మటాలజీ విభాగంలో అత్యాధునిక లేజర్ యూనిట్, గాంధీ మెడికల్ కాలేజీలో రూ.10 కోట్లతో నిర్మించిన లైబ్రరీ బిల్డింగ్ సహా ఎగ్జామినేషన్ హాల్‌ను మంత్రి ఈటల ప్రారంభించారు. అనంతరం కరోనా బాధితుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డును సందర్శించారు. పుట్టుకతోనే వినికిడి లోపాన్ని గుర్తించే పరికరాలను ఆస్పత్రికి అందజేశారు.
- ఎంఎన్‌జే ఆస్పత్రిలో రూ.15 కోట్ల ఖరీదైన పెట్‌స్కాన్‌ను రోగులకు అంకితం చేశారు. కేన్సర్‌తో బాధపడుతూ పీడియాట్రిక్ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారుల వార్డును సందర్శించి, వారిని పలకరించారు. వైద్య సేవలపై రోగి బంధువులను ఆరా తీశారు.
- సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రూ.17.6 కోట్లతో 150 పడకల సామర్థ్యంతో ఏర్పాటుచేసిన అదనపు బ్లాక్‌ను ప్రారంభించారు.
- ఉస్మానియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో కొత్తగా రూ.1.96 కోట్లతో నిర్మించనున్న అకడమిక్ బ్లాక్‌కు శంకుస్థాపన చేశారు. జనరల్ సర్జరీ విభాగంలో రూ.15 లక్షలతో సమకూర్చిన లేజర్ మిషన్‌ను ప్రారంభించారు. పలువురు వైద్యులు మంత్రి దృష్టికి సమస్యలను తెచ్చారు.
- ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రిలో రూ.56.25 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన వీఐపీ బ్లాక్‌ను ప్రారంభించారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఇక్కడ మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు.

మరో రెండు కరోనా

అనుమానిత కేసులు

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్‌పై గ్రేటర్ వాసుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా సోమవారం గాంధీలో ఒకటి, ఫీవర్‌లో మరో అనుమానిత కేసు నమోదైంది. కొండాపూర్‌కు చెందిన వ్యక్తి(33) ఇటీవలే చైనా నుంచి హైదరాబాద్ వచ్చాడు. 2 రోజుల నుంచి జ్వరం, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో కరోనా వైరస్ అనే అనుమానంతో చికిత్సల కోసం గాంధీ ఆస్పత్రి వైద్యులను ఆశ్రయించగా, వైద్యులు ఆయన్ను ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేసుకున్నారు. బాధితుడి నుంచి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. ఆయనతోపాటు మలేసియా, థాయిలాండ్, హాంకాంగ్‌ల నుంచి ఇటీవల వచ్చిన మరో ముగ్గురు వైద్యులను సంప్రదించగా, వారిలో ఎలాంటి వైరస్ లక్షణాలు కన్పించకపోవడంతో, కరోనా వైరస్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించి ఇంటికి పంపించేశారు. ఇదిలా ఉంటే కూకట్‌పల్లికి చెందిన వ్యక్తి(39)బీజింగ్ నుంచి ఇటీవల నగరానికి చేరుకున్నాడు. జ్వరం, జలుబుతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స కోసం ఫీవర్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన్ను ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేసుకుని, వ్యాధినిర్ధారణ పరీక్షల కోసం గాంధీ వైరాలజీ ల్యాబ్‌కు నమూనాలు పంపారు. రిపోర్టులు రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇద్దరు అనుమానిత బాధితులు చికిత్స పొందుతున్నారు. చైనా నుంచి ఇప్పటివరకు 45 మంది ఇక్కడికి వచ్చినట్లు ప్రభుత్వం గుర్తించింది. అయితే వారిలో 21 మంది జలుబు, జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతూ గాంధీ, ఫీవర్ ఆస్పత్రులకు చేరుకున్నారు. వైద్యులు బాధితుల నుంచి నమూనాలు సేకరించి, పరీక్షించగా 19 మందికి నెగిటివ్ వచ్చింది. మరో ఇద్దరికి సంబంధించిన నమూనాలు రావాల్సి ఉంది.

టీబీ ఆస్పత్రిలో ఆకలి కేకలు

14 నెలలుగా భోజనం బిల్లులు పెండింగ్

అనంతగిరి/వికారాబాద్ అర్బన్ : వికారాబాద్ పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్ట టీబీ శానిటోరియంలో చికిత్స పొందుతున్న రోగులు ఆకలి కేకలు పెడుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 40 మందికిపైగా ఇన్‌పేషెంట్లు ఉన్నారు. వారికి నిత్యం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనంతో పాటు మందులను ఉచితంగా అందజేస్తారు. కానీ సదరు కాంట్రాక్టర్‌కు 14 నెలలుగా బిల్లులు చెల్లించలేదు. ఇన్నాళ్ల పాటు అప్పులు చేసి భోజనం వడ్డించిన కాంట్రాక్టర్ జనవరి 31నుంచి ఆపేశాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు మానవతా దృక్పథంతో చందాలు వేసుకుని నాలుగు రోజులుగా రోగులకు భోజనం అందిస్తున్నారు. ఇక్కడి పరిస్థితి తెలుసుకున్న 17వ వార్డు కౌన్సిలర్ ఫైముదాబేగమ్‌ఖాజ కూడా ముందుకు వచ్చి రోగులకు ఆహారం అందిస్తున్నారు.

కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా?

- కేటీఆర్‌కు లక్ష్మణ్ సవాల్
- కేంద్రంపై ఆధారపడే పథకాలు ఇస్తామని ఓట్లు అడిగావా?
- మీ జేబులు నింపడానికి కేంద్రం నిధులు ఇవ్వదన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై మంత్రి కేటీఆర్‌తో తాము చర్చకు సిద్ధమని, కేటీఆర్ అందుకు సిద్ధమా..? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ సవాల్ విసిరారు. కేంద్రంపై అర్థంలేని విమర్శలు చేయడం కాదని, బడ్జెట్‌పై కేటీఆర్ మాటలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. బడ్జెట్ ఎలా ఉంటుందో కూడా ఆయనకు తెలియక పోవడం దురదృష్టకరమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. టీమిండియా స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి ఇతోధికంగా నిధులు మంజూరు చేస్తున్నా కేటీఆర్ గజనీలా మారి కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులను మర్చిపోతున్నారని ఎద్దేవా చేశారు. యూపీఏ హయాంలో కేసీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారో చర్చకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరిస్తారా? అని ప్రశ్నించారు. నాటి యూపీఏతో పోలిస్తే ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి 7 రెట్లు అధికంగా నిధులు ఇచ్చిందని స్పష్టం చేశారు. దేశ ఆర్థిక మూలాలను పటిష్టం చేసేలా, ద్రవ్యోల్బణం అదుపు చేసేలా, అట్టడుగు వర్గాల ఆర్థిక స్వావలంబనకు దోహదం చేసేలా ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పేదలు, మధ్యతరగతితో పాటు సర్వత్రా స్వాగతిస్తుంటే కేటీఆర్ మాత్రం తెలంగాణకు మేలు చేసిందేమీ లేదంటూ కూనిరాగాలు తీస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రాలకు మేలుచేసేందుకే కలసిపనిచేస్తున్నా...

వివిధ మంత్రిత్వ శాఖలు రాష్ట్రాల భాగస్వామ్యంతో అమలు చేసే పథకాలు ఆయా రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకే అన్న స్పృహ కేటీఆర్‌కు లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.కేటీఆర్ జేబులు నింపేందుకో, ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు నొక్కేందుకో బడ్జెట్ ఉండదని ఆయన గ్రహిస్తే మంచిదనీ, టీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత, అసంబద్ధ విధానాలు, ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్ర ఆర్థిక స్థితి దిగజారితే కేసీఆర్, కేటీఆర్ కేంద్రంపై నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారీ ప్రాజెక్టులు, వాటి మీద వచ్చే కమీషన్లు తప్పితే సంపద సృష్టి, ఆదాయ వనరుల పెంపుపై దృష్టి లేదన్నారు. కేసీఆర్ మంత్రిగా కొనసాగిన యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే ఎన్డీఏ ప్రభుత్వం 10 రెట్లు ఎక్కువగా కేంద్ర పన్నులను రాష్ట్రానికి ఇచ్చిందనీ, ప్రత్యేక సహాయం కింద 4 రెట్లు అధికంగా నిధులు అందించిందన్నారు. 35 రెట్లు అధికంగా స్థానిక సంస్థలకు నిధులు ఇచ్చినా మరిచిపోయారన్నారు. చివరికి కె.కేశవరావు ఆంధ్రా ఎంపీ అన్న విషయాన్ని మరచిపోయి బోగస్ ఓటు వేయించారన్నారు.

కాళేశ్వరంపై డీపీఆర్ సమర్పించలేదేం...

విభజన చట్టంలో కాళేశ్వరానికి జాతీయ హోదా ప్రస్తావనే లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం కోరినా ఇంతవరకు ఇవ్వలేదని వెల్లడించారు. డీపీఆర్‌ను సమర్పిస్తే తమ అవినీతి అక్రమాలన్నీ బయటపడిపోతాయనేది వారి భయమనీ, రూ.లక్ష కోట్ల పనులకు టెండర్లు పిలవకుండా నామినేషన్లపై నంజుకుని తినేశారని ఆరోపించారు. ఆ కమిషన్లతోనే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ నీతి తుక్కుగుడా, నేరేడు చెర్ల, నిజామాబాద్‌లలో ఎక్కడి పోయిందని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల్లో హిందు గాళ్లు బొందుగాళ్లు అని చలిగాచుకొంది ఎవరని ప్రశ్నించారు. ముస్లిం ఓట్ల కోసం మాట్లాడలేదా, మజ్లీస్‌ను చంకలో పెట్టుకొని లౌకికవాదం గురించి చెప్పలేదా? అని నిలదీశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీకి 15 శాతం ఓట్లు వచ్చాయని, టీఆర్ఎస్‌ప్రభుత్వం గాలి బుడగ లాంటిదన్నారు. రామచంద్రరావు నేతృత్వంలో భైంసా సంఘటనపై నిజానిర్ధారణ కమిటీ వేశామన్నారు. జర్నలిస్ట్ సిద్దుపై పెట్టిన కేసును ఎత్తివేయాలని కోరారు. సీఏఏకు అనుకూలంగా జరిగిన సభకు ముస్లింలు కూడా వచ్చారని, దమ్ముంటే సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని సవాల్ చేశారు.

జీఎస్టీ పరిహారం బకాయిలపై

సభలో టీఆర్ఎస్ ఆందోళన

- టీఆర్ఎస్ నుంచి ఎంపీలు నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలు
- రెండు విడతల్లో విడుదల చేస్తామన్న ఆర్థికశాఖ సహాయ మంత్రి ఠాకూర్

సాక్షి, న్యూఢిల్లీ : జీఎస్టీ పరిహారం బకాయిలపై వివిధ పార్టీల ఎంపీలు లోక్‌సభలో ఆందోళన వ్యక్తంచేశారు.టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వంగ గీతావిశ్వనాథ్, మార్గాని భరత్, బీజేడీ ఎంపీ చంద్రశేఖర్ సాహులు సోమవారం ఉదయం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై ప్రశ్నలు సంధించారు. టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్న సంధిస్తూ 'ఆర్థిక మందగమనం నేపథ్యంలో పరిహారం ఇవ్వాల్సిన ఆవశ్యకత మరింత పెరిగింది. తె

దేశ సామరస్యతపై కుట్ర

ఢిల్లీలో బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

- 'సీఏఏ' నిరసనలపై ప్రధాని మోదీ వ్యాఖ్య
- ఆప్, కాంగ్రెస్‌లే రెచ్చగొడ్తున్నాయి
- ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మోదీ

సాక్షి న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జరుగుతున్న నిరసనలు దేశ సామరస్యతను దెబ్బతీసేందుకు పన్నిన రాజకీయ కుట్రలో భాగమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆ నిరసనలు యాదృచ్ఛికంగా జరుగుతున్నవి కావని, వాటిని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లు ఎగదోస్తున్నాయని విమర్శించారు. ఆ రెండు పార్టీలు సీఏఏ నిరసనల్లో రాజ్యాంగం, జాతీయ పతాకాలను ముందుపెట్టి అసలు కుట్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సోమవారం ప్రధాని మోదీ తొలిసారి పాల్గొన్నారు. షహీన్‌బాఘ్ నిరసనల కారణంగా ఢిల్లీ పౌరులు ముఖ్యంగా సాటిలైట్ సిటీ ప్రజలు అనేక ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఢిల్లీ ప్రజలు కోపంగా, మౌనంగా ఈ ఓటుబ్యాంక్ రాజకీయాలను చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 8న జరిగే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఈ అరాచకాన్ని ఆపేందుకు సహకరించాలని కోరారు. 21వ శతాబ్ది భారత్‌లో విద్వేష పూరిత రాజకీయాలు పనిచేయవని, అభివృద్ధి రాజకీయాలు మాత్రమే పనిచేస్తాయని కడ్కడూమా సీబీడీ గ్రౌండ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ వ్యాఖ్యానించారు. బాట్లా హౌజ్ ఎన్‌కౌంటర్‌ను ప్రశ్నించినవారే ఇప్పుడు 'తుక్డే తుక్డే' నినాదాలు చేస్తున్నవారిని రక్షిస్తున్నారని కాంగ్రెస్‌పై పరోక్ష ఆరోపణలు చేశారు. పాక్ ఉగ్రవాదులపై భారత ఆర్మీ జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌ను ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు. ఢిల్లీ ఒక నగరం కాదని, అది దేశ సాంస్కృతిక వారసత్వమని ప్రధాని పేర్కొన్నారు. ప్రతీ ఢిల్లీవాసి చెమటోడ్చి ఢిల్లీని ప్రస్తుతమున్న స్థాయికి తెచ్చారన్నారు. గత రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న పార్టీలు 21వ శతాబ్ది ప్రయోజనాలు ఢిల్లీకి అందకుండా చేశాయన్నారు. ఢిల్లీ వాసులు లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి ఓటేసి దేశ భవిష్యత్తు మారేందుకు బాట వేశారని, ఇప్పుడు ఢిల్లీ భవిష్యత్తు మార్చడం కోసం మళ్లీ బీజేపీకే ఓటేయాలని కోరారు. ఢిల్లీ సురక్షితంగా, పరిశుభ్రంగా, ఆధునికంగా ఉండాలంటే తమ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అనేక అడ్డంకులు ఉన్నప్పటికీ అనధికార కాలనీలను క్రమబద్ధీకరిస్తామన్న తమ వాగ్దానాన్ని నిలబెట్టుకున్నామని ప్రధాని గుర్తు చేశారు. ఢిల్లీలోని ఆప్ సర్కారు పీఎం ఆవాస్ యోజనను అడ్డుకుని పేదలకు ఇళ్లు ఇవ్వకుండా చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆప్‌కి మరోసారి అధికార మిస్తే కేంద్రం ప్రకటించిన ప్రజా సంక్షేమ పథకాలను అన్నింటినీ అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు. పౌరసత్వ సవరణ చట్టం, కర్తార్‌పుర్ కారిడార్, 370 అధికరణం రద్దు, అయోధ్యపై కోర్టు తీర్పు, భారత బంగ్లాదేశ్ సరిహద్దు సమస్య పరిష్కారం.. తదితర అంశాలను ప్రసంగంలో ప్రస్తావించిన మోదీ.. ఇవన్నీ 70 ఏళ్ల తరువాత, తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. తాజా బడ్జెట్‌లో తమ ప్రభుత్వం సామాన్యుల కోసం, వ్యాపారుల కోసం చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా మోదీ వివరించారు.

రాజధాని రణరంగం

కేజ్రీవాల్ ఉగ్రవాదే

కేంద్ర మంత్రి జవదేకర్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఉగ్రవాది అని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ సోమవారం వెల్లడించారు. గతంలో కేజ్రీవాల్ తనకు తానుగా అరాచకవాదినని ప్రకటించుకున్నారని, నా దృష్టిలో అరాచకవాదికి, ఉగ్రవాదికి మధ్య పెద్ద వ్యత్యాసం లేదని ప్రకాశ్ జవదేకర్ స్పష్టంచేశారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఖలిస్తాన్ కమాండో ఫోర్స్ చీఫ్ గురీందర్ సింగ్ నివాసమైన మోగాలో కేజ్రీవాల్ బస చేశారని గుర్తుచేశారు. అది ఉగ్రవాది నివాసమని తెలిసీ కేజ్రీవాల్ బసచేశారని ప్రకాశ్ జవదేకర్ ఆరోపించారు. షహీన్‌బాగ్‌లో ఆందోళనలు చేస్తోన్న వారికి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వారికి కేజ్రీవాల్ మద్దతు ఇచ్చారన్నారు. షహీన్‌బాగ్‌లో దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అరాచకవాదులకు మద్దతిచ్చిన నువ్వు నిజంగా ఉగ్రవాదివే అంటూ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

అత్యాచార బెదిరింపులపై ప్రధాని మోదీకి లేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతల అత్యాచార బెదిరింపులకు తెగబడుతున్నారని ఆరోపిస్తూ వారి తీరును నిందిస్తూ, తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ సుమారు 170 మంది మహిళా ఉద్యమకారులు ప్రధాని నరేంద్ర మోదీకి ఒక బహిరంగ లేఖ రాశారు. పౌరసత్వ సవరణ చట్టంతోపాటు, ఎన్‌పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఉద్యమిస్తున్న మహిళలపై హింసకు పాల్పడాల్సిందిగా బీజేపీ నేతలు తమ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని, తద్వారా ఎన్నికల్లో ఒక హింసాత్మక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఉమెన్స్ అసోసియేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్ సంస్థలతోపాటు ఆర్థికవేత్త దేవకీ జైన్, ఉద్యమకారణి లైలా త్యాబ్జీ, మధు బాధురీ (విశ్రాంత దౌత్యవేత్త), కమలా భాసిన్ తదితరులు ఆ లేఖలో ఆరోపించారు. ఢిల్లీ మహిళలకు ప్రధాని ఇస్తున్న ఎన్నికల సందేశం ఇదేనా? బీజేపీ ఇంతటి అధమ స్థితికి దిగజారిపోయిందా? అని ప్రశ్నించారు.

మహారాష్ట్రలో దిశ చట్టం!

ముంబై: అత్యాచార దోషులకు తక్కువ సమయంలో శిక్ష విధించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశా చట్టాన్ని మహారాష్ట్రలో అమలు చేసే అంశం పరిశీలిస్తామని మహారాష్ట్ర హోంశాఖ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ సోమవారం చెప్పారు. త్వరలోనే తాను ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి దిశ చట్టం గురించి లోతుగా తెలుసుకుంటానని చెప్పారు. ఈ చట్టం ప్రకారం మహిళలపై అఘాయిత్యాలు జరిగిన మూడు వారాల్లోనే దోషికి శిక్ష పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వార్ధాలో మహిళకు నిప్పు పెట్టిన కేసుపై ఫాస్ట్ ట్రాక్ విచారణ జరిపి త్వరలోనే దోషికి శిక్ష పడేలా చేస్తామని అనిల్ అన్నారు. నాగ్‌పడా ప్రాంతంలో కొందరు పోలీసుల అనుమతి లేకుండానే సీఏఏపై నిరసనలు చేస్తున్నారని చెప్పారు. సీఏఏ వల్ల పౌరసత్వం పోదని వారికి వివరించామని చెప్పారు.

ఓపెన్ బోర్‌వెల్స్‌పై సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఓపెన్ బోర్‌వెల్స్‌లో చిన్న పిల్లలు పడకుండా, చనిపోకుండా చూడటంలో విఫలమవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు వాదనలు వినడానికి అంగీకరించింది. ఈ పిటిషన్‌కు సమాధానమివ్వాలని కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అడిగింది. సుప్రీంకోర్టు 2010లో ఇచ్చిన సూచనలను పాటించడంలో విఫలమైన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకొనేలా ఆదేశించాలని పిటిషన్‌ను దాఖలు చేసిన లాయర్ జీఎస్ మణి పేర్కొన్నారు. తెరిచి ఉంచిన బోర్‌వెల్స్‌ను మూసివేయించడంలో అధికార యంత్రాంగం వైఫల్యం వల్ల పౌరులు బాధితులుగా మారుతున్నారని, దీనివల్ల దేశవ్యాప్తంగా అనేక మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు సంభవించకుండా కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చర్యలు తీసుకొనేలా వాటిని ఆదేశించాలన్నారు.

తప్పుడు సమాచారాన్ని నిషేధించనున్న యూట్యూబ్

వాషింగ్టన్: నిరాధార వార్తలను అరికట్టడమే లక్ష్యంగా, ఎన్నికలకు సంబంధించి తప్పుడు సమాచారం పోస్ట్ చేయడాన్ని యూట్యూబ్‌లో నిషేధించనున్నట్లు గూగుల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు మరణించారనిగానీ, ఎన్నికల తేదీ వ్యవహారంలో తప్పుడు సమాచారంగానీ యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తే దాన్ని తొలగిస్తామని ఆ సంస్థ చెప్పింది. తాము నియమించిన ట్రస్ట్ అండ్ సేఫ్టీ టీమ్‌లు ఆయా వీడియోలను నిరంతరం పరిశీలిస్తుంటాయని చెప్పింది. వార్తలకు నమ్మదగిన స్థానం కలిగిన దానిగా యూట్యూబ్‌ను మార్చనున్నట్లు తెలిపింది. ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలను నిషేధిస్తున్నామని ట్విట్టర్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇది రాజీవ్ ఫిరోజ్ ఖాన్ సర్కార్ కాదు

- సీఏఏను అమలు చేసి తీరుతామన్న బీజేపీ సభ్యుడు పర్వేశ్ వర్మ
- వర్మ ప్రసంగం ప్రారంభించగానే నిరసనగా వాకౌట్ చేసిన కాంగ్రెస్, డీఎంకే, ఇతర విపక్షాలు


లోక్‌సభలో మాట్లాడుతున్న పర్వేశ్ వర్మ

లోక్‌సభలో మాట్లాడుతున్న అధిర్ చౌధరి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో కొనసాగుతున్న పౌరసత్వ సవరణ చట్ట(సీఏఏ) వ్యతిరేక నిరసనలపై, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ ఎంపీలు అనురాగ్ ఠాకూర్, పర్వేశ్ వర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సోమవారం నాటి లోక్‌సభ సమావేశాలు దద్దరిల్లాయి. ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కాగానే కాంగ్రెస్, డీఎంకే సభ్యులు సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీల వ్యతిరేక నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. బుల్లెట్లతో ప్రజల గొంతుకను అణచేయలేరని కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌధరి వ్యాఖ్యానించారు. 'మీరు నకిలీ హిందువులు' అని అధికార పక్షాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో సీఏఏ వ్యతిరేక నిరసనకారులను ఉద్దేశించి 'ద్రోహులను కాల్చి చంపండి' అని మంత్రి అనురాగ్ ఠాకూర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై విపక్ష సభ్యులు మండిపడ్డారు. 'మీ తూటాలెక్కడ?' అని ప్రశ్నించారు. సప్లిమెంటరీ ప్రశ్నలకు జవాబిచ్చేందుకు ఠాకూర్ ప్రయత్నించిన ప్రతీసారి నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ప్రారంభించేందుకు బీజేపీ ఎంపీ పర్వేశ్ వర్మ లేచినపుడు.. 'సిగ్గు పడు' అని విపక్ష సభ్యులు గట్టిగా నినాదాలు చేశారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా.. 'సీఏఏ నిరసనకారులు మీ ఇళ్లల్లోకి వచ్చి, మీ మహిళలపై అత్యాచారం చేస్తారు' అని వర్మ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

పాకిస్తాన్ జిందాబాద్ అంటున్నారు

వర్మ ప్రసంగం ప్రారంభించగానే.. నిరసనగా కాంగ్రెస్, డీఎంకే సహా విపక్ష పార్టీల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం వర్మ మాట్లాడుతూ.. సీఏఏను వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదని, అది దేశ సమగ్రతకు సంబంధించిన విషయమని తేల్చిచెప్పారు. 'ఇది రాజీవ్ ఫిరోజ్ ఖాన్ ప్రభుత్వం కాదు.. ఇది మోదీ ప్రభుత్వం' అని ఇందిరా గాంధీ కుటుంబం ముస్లింలేనని పరోక్షంగా వ్యాఖ్యానించారు. 'షహీన్‌బాగ్ నిరసనలు సీఏఏను వ్యతిరేకిస్తూ చేస్తున్నవి కావు. అక్కడి నిరసనకారులు పాకిస్తాన్ జిందాబాద్ అని, కశ్మీర్‌ను, అస్సాంను భారత్ నుంచి విడగొట్టాలి అని అంటున్నారు' అని వర్మ పేర్కొన్నారు. మానవత్వ సందేశం ఇచ్చిన రాముడికి కాంగ్రెస్ మతం రంగు పులిమిందని విమర్శించారు. 'ఇప్పటికైనా ప్రతిపక్ష సభ్యులు జై శ్రీరాం అని నినదిస్తే వారి పాపాలు తొలగిపోతాయి' అన్నారు. రాజ్యాంగం తొలి ప్రతుల నుంచి శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, హనుమంతుడి చిత్రాలను కాంగ్రెస్ తొలగించిందని ఆయన ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా ఆర్టికల్ 370 లాంటి సమస్యలను కాంగ్రెస్ పెంచి పోషించిందన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే అనధికార కాలనీల ప్రజలకు పక్కా ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. వర్మ ప్రసంగంపై టీఎంసీ స్పందిస్తూ.. అది ఢిల్లీ ఎన్నికల ప్రచార ప్రసంగంలా ఉందని ఎద్దేవా చేసింది. ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. జామియా మిలియా యూనివర్సిటీలో సీఏఏ నిరసనకారులను దారుణంగా కొట్టారని గుర్తు చేశారు. ఒక విద్యార్థిని తన కన్ను కూడా కోల్పోయిందన్నారు. 'అమ్మాయిలను దారుణంగా కొట్టారు. పిల్లలపై తూటాలు ప్రయోగించారు. ఈ ప్రభుత్వానికి సిగ్గు లేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజ్యసభలోనూ...

పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)లపై చర్చించాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు సోమవారం రాజ్యసభ కార్యకలాపాలను అడ్డుకున్నారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళనలతో సభ పలుమార్లు వాయిదా పడింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టకుండా బీజేపీ సభ్యుడు భూపేందర్ యాదవ్‌ను అడ్డుకున్నారు. సీఏఏ వ్యతిరేక నిరసనలపై కాల్పులు జరిపిన ఘటనలను కాంగ్రెస్, సీపీఎం, టీఎంసీ తదితర విపక్ష పార్టీల సభ్యులు తీవ్రంగా ఖండించారు. సభ్యులను శాంతపర్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో డెప్యూటీ చైర్మన్ హరివంశ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

షహీన్‌బాగ్ శిశువు మృతి

ఏడాది కొడుకుతో మహ్మద్ ఆరిఫ్, నజియా

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో నిరసన తెలుపుతున్న నాలుగు నెలల శిశువు మృతిచెందాడు. బాలుడు నిరసన తెలపడం ఏంటి అనుకుంటున్నారా? మీరు చదివింది నిజమే. షహీన్‌బాగ్ వద్ద నిరసనలో పాల్గొనడానికి మహ్మద్ జహాన్ అనే బాలుడిని అతని తల్లి ప్రతిరోజూ తనతోపాటు అక్కడికి తీసుకెళ్లేది. అక్కడ ఉన్న నిరసనకారులంతా కూడా జహాన్‌ను ముద్దుచేసేవారు. అలాగే బాలుడి బుగ్గ మీద త్రివర్ణ పతాకాన్ని రంగులతో వేసేది. కానీ, ఆ పాలబుగ్గల చిన్నారి ఇక నుంచి కనబడడు. చలితీవ్రత పెరగడంతో, తట్టుకోలేక ఆ చిన్నారి కన్నుమూశాడు. అయినప్పటికీ జహాన్ తల్లి ఆ నిరసనల్లో పాల్గొనడానికి నిశ్చయించుకోవడం గమనార్హం. 'నేను నా పిల్లల భవిష్యత్తు కోసం అందులో పాల్గొంటాను' అని తెలిపింది. జహాన్ తల్లిదండ్రులు మహ్మద్ ఆరిఫ్, నజియా బట్లా హౌజ్ ప్రాంతంలో ప్లాస్టిక్ షీట్లు, వస్త్రాలతో చేసిన ఓ చిన్న గుడిసెలో నివసిస్తున్నారు. వారికి మరో ఇద్దరు ఐదేళ్ల కుమార్తె, ఒక సంవత్సరం కొడుకు ఉన్నారు. 'జహాన్ జనవరి 30వ తేదీనే మృతిచెందాడు. షహీన్‌బాగ్ ప్రాంతం నుంచి ఆరోజు రాత్రి 1 గంటకు ఇంటికొచ్చి జహాన్‌ను నిద్రపుచ్చి నేను కూడా నిద్రపోయాను. ఉదయం లేవగానే తాను కదలకపోవడాన్ని గమనించాను. తను నిద్రలోనే చనిపోయాడు' అని నజియా వెల్లడించింది.

'గాంధీ డ్రామా' వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పండి

న్యూఢిల్లీ: గాంధీజీపై బీజేపీ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సారీ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు హెగ్డేకు షోకాజ్ నోటీసిచ్చింది. గాంధీని అగౌరవపరిచే ఎలాంటి చర్యలైనా ఒప్పుకునేదిలేదని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. 'మహాత్మాగాంధీ చేసిన స్వాతంత్ర్య పోరాటం అంతా ఓ డ్రామా. అలాంటి వాళ్లను మహాత్మా అని ఎందుకు పిలవాలి'అంటూ శనివారం బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో హెగ్డే అన్నారు. గాంధీపై బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తంచేసింది.

'ధర్మ' సందేహాలపై నిర్ణయం తీసుకుంటాం!

శబరిమల తీర్పుపై సమీక్షకు సుప్రీం నో

న్యూఢిల్లీ: ప్రార్థన స్థలాల్లో మహిళలపై వివక్షకు సంబంధించి న్యాయపరమైన ప్రశ్నలు సిద్ధం చేస్తామని, తొమ్మిది మంది సభ్యులున్న విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఈ ప్రశ్నలపై ఒక నిర్ణయం తీసుకుంటుందని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల వారిని అనుమతిస్తూ తీర్పు నేపథ్యంలో వేర్వేరు మతాల్లో మహిళలపై కొనసాగుతున్న వివక్షకు సంబంధించి కొన్ని పిటిషన్లు దాఖలు కాగా.. దానిపై సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం తెల్సిందే. ఈ అంశంపై చీఫ్ జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే నేతృత్వంలోని బెంచ్ సోమవారం విచారణ చేపట్టింది. అయితే ఈ విస్తృత ధర్మాసనం ఏఏ అంశాలపై వాదనలు వినాలన్న అంశంపై కక్షిదారుల లాయర్లు ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో ఆ ధర్మ సందేహాలను తామే సిద్ధం చేస్తామని ప్రకటించింది. శబరిమలపై తీసుకున్న నిర్ణయంపై సమీక్ష ఉండదని స్పష్టం చేసింది. ఈ నెల ఆరవ తేదీ మహిళా వివక్షకు సంబంధించి సిద్ధం చేసే ప్రశ్నలతోపాటు, కాలావధికి సంబంధించిన సమాచారాన్ని కక్షిదారులందరికీ అందజేస్తామని చెప్పింది. ఐదుగురు సభ్యుల ధర్మాసనం గత ఏడాది నవంబరులో ఇచ్చిన రిఫరెన్స్ ఆర్డర్ ఆధారంగా తాము మత స్వేచ్ఛ, మసీదులు, దర్గాల్లోకి మహిళల ప్రవేశం, పార్శీ మహిళలను పెళ్లి చేసుకున్న ఇతర మతస్తులకు పార్శీ ప్రార్థన స్థలాల్లో ప్రవేశంపై నిషేధం వంటి అంశాలపై ఒక న్యాయపరమైన విధానాన్ని అభివృద్ధి చేయనున్నామని బెంచ్ తెలిపింది. పదేళ్ల నుంచి యాభై ఏళ్ల మధ్యవయస్కులకూ శబరిమల ఆలయంలోకి ప్రవేశం కల్పిస్తూ సుప్రీంకోర్టు బెంచ్ 2018 సెప్టెంబర్ 28న 4:1 మెజార్టీ తీర్పు ఇవ్వడం తెల్సిందే.

టీచర్‌ను తాళ్లతో కట్టి.. రోడ్డుపై ఈడ్చి..

రోడ్డు నిర్మాణానికి స్థలం ఇవ్వలేదని తృణమూల్ నేతల దుశ్చర్య

బలుర్ఘాట్: రోడ్డు వేసేందుకు స్థలం ఇవ్వడం లేదన్న కారణంతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిని కాళ్లు, చేతులు కట్టేసి, రోడ్డుపై ఈడ్చిన దారుణ దుర్ఘటన పశ్చిమబెంగాల్‌లోని దీనజ్‌పూర్‌లో జరిగింది. ఆ రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ నేతలే ఈ దారుణానికి ఒడిగట్టడంతో రాజకీయ సెగ అలుముకుంది. గత శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగారాంపూర్ బ్లాక్‌కు చెందిన ప్రభుత్వ టీచర్, బీజేపీ మద్దతుదారు స్మృతికానా దాస్ స్థలంలో రోడ్డు నిర్మాణం చేపట్టేలా పంచాయతీ నిర్ణయం తీసుకుంది. అయితే దీనికి ఆమె అంగీకరించకపోవడంతో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఉప ప్రధాన్ (డిప్యూటీ చీఫ్) అమల్ సర్కార్.. స్మృతి కానా దాస్ కుటుంబాన్ని హింసించారు. టీచర్ కాళ్లను, చేతులను కట్టేయడంతో ఆమె కిందపడిపోవడం, ఆమెను కొందరు దుండగులు దాదాపు 30 అడుగులు ఈడ్చుకుంటూ గదిలోకి తీసుకెళ్లి బంధించడం వీడియోలో రికార్డయ్యింది. దీంతో ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. దీనిపై రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి సయంతన్ బసు మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ పాలనలో గూండాయిజం సాగుతున్నదనడానికి ఇది ఉదాహరణ అంటూ విమర్శించారు. ఈ చర్యకు పాల్పడిన వ్యక్తిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు తృణమూల్ ప్రధాన కార్యదర్శి పార్థ చటర్జీ చెప్పారు.

లెక్చరర్‌కు నిప్పంటించాడు!

బాధితురాలి పరిస్థితి విషమం

సాక్షి, ముంబై: మహారాష్ట్రలో దారుణం చోటు చేసుకుంది. 25 ఏళ్ల యువతిపై ఒక దుండగుడు పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటన సోమవారం వార్ధా జిల్లాలోని హింగణ్‌ఘాట్‌లో జరిగింది. కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న అంకితని వివాహితుడైన వికేశ్ నగ్రాలె గత కొన్నాళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. కాలేజీకి బయల్దేరిన యువతిని సోమవారం ఉదయం నందోరి చౌక్ వద్ద అడ్డగించిన వికేశ్.. అకస్మాత్తుగా ఆమె తలపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. 40శాతం కాలిన గాయాలైన బాధితురాలిని స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. నాగ్‌పూర్‌లో ఆస్పత్రిలో ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టుచేశారు. మంటల్లో చిక్కుకుని ఆర్తనాదాలు చేస్తున్న ఆ యువతిని వెంటనే రక్షించకపోవడంపై, పైగా.. కొందరు ఈ ఘటనను తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బాధితురాలికి సత్వరమే న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుపుతామని హోంమంత్రి అనిల్ ప్రకటించారు. బాధితురాలు, నిందితుడు వికేశ్ ఇద్దరూ ఒకే గ్రామానికి చెందినవారు. రెండేళ్ల క్రితం వరకూ ఇద్దరూ స్నేహితులేనని, వేధింపుల వల్ల ఇప్పుడు ఆమె స్నేహంచేయట్లేదని ఇన్‌స్పెక్టర్ సత్యవీర్ తెలిపారు. వికేశ్‌కు 9 నెలల బాబు ఉన్నాడన్నారు. వికేశ్ కారణంగా గత సంవత్సరం ఆమె వివాహం విచ్ఛిన్నమైందని బాధితురాలి సోదరుడు శుభమ్ తెలిపారు.

షారూక్ ఖాన్ కేకేఆర్ జప్తు!

న్యూఢిల్లీ: రోజ్‌వ్యాలీ స్కామ్‌పై విచారణలో భాగంగా రూ.70 కోట్ల విలువైన మూడు ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం ప్రకటించింది. బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్‌కు చెందిన కోల్‌కతా నైట్‌రైడర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్ (కేకేఆర్)తోపాటు మల్టిపుల్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, సెయింట్ జేవియర్స్ కాలేజీలు జప్తు అయిన ఆస్తుల్లో ఉన్నట్లు ఈడీ తెలిపింది. జప్తు అయిన మూడు ఆస్తుల తాలూకు ఖాతాల్లో దాదాపు 16.20 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, ఇందులో రూ.11.87 కోట్లు షారూక్ ఖాన్‌కు చెందిన కోల్‌కతా నైట్ రైడర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌దని వివరించారు. ఐపీఎల్ క్రికెట్ టీమ్ యాజమాన్య కంపెనీలో షారూక్‌ఖాన్, ఆయన భార్య గౌరీ ఖాన్, సినీనటి జూహీ చావ్లా భర్త జై మెహతా సీఈవో వెంకటేష్ మైసూర్‌లతోపాటు మరో ఇద్దరు డైరెక్టర్లుగా ఉన్నారు. కేసుకు సంబంధించి మైసూర్‌ను గత అక్టోబరులో ఈడీ ప్రశ్నించిన విషయం తెల్సిందే.

9 రోజుల్లో కరోనా ఆస్పత్రి

- యుద్ధప్రాతిపదికన 1000 పడకల ఆస్పత్రిని సిద్ధంచేసిన చైనా
- అందుబాటులోకి వైద్యసేవలు

బీజింగ్/తిరువనంతపురం: ప్రపంచ దేశాలను వణికిస్తోన్న కరోనా వైరస్ బారి నుంచి ప్రజలను కాపాడేందుకు చైనా ప్రభుత్వం కఠోర యుద్ధం చేస్తోంది. అందుకు ఎంత ఖర్చైనా వెనకాడేది లేదని చైనా ప్రభుత్వం తేల్చి చెప్పింది. కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు వుహాన్‌లో రికార్డుస్థాయిలో కేవలం తొమ్మిది రోజుల్లోనే 1000 పడకల భారీ ఆస్పత్రిని నిర్మించింది. అత్యంత అధునాతన వైద్య సదుపాయాలతో వుహాన్‌లో నిర్మించిన ఈ హౌషెన్‌షాన్

సాక్షి
మంగళవారం, ఫిబ్రవరి, 4

మెప్పించని విన్యాసం

ఆర్థిక రంగం ఒడిదుడుకులు ఎదుర్కొంటూ, మందగమనంతో అది అందరినీ భయపెడుతున్న వేళ... వృద్ధి రేటు పల్టీలు కొడుతూ, ద్రవ్యోల్బణం పైపైకి పోతున్న వేళ బడ్జెట్ విన్యాసం కత్తి మీది సాము. ఖజానా రాబడి తగ్గుతూ ఎంచుకున్న లక్ష్యాల సాధనకు అవసరమైన నిధుల సమీకరణకు సమస్యలెదురైనప్పుడు అందరినీ మెప్పించేలా బడ్జెట్ ప్రతిపాదనలుండటం అసాధ్యం. మెప్పించడం మాట అటుంచి ఇప్పుడున్న సంక్షోభం పేట్రేగకుండా చూస్తే అదే పదివేలు. కానీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం 2020-21 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు అందుకనుగుణంగా ఉన్నట్టు తోచదు. వినిమయాన్ని పెంచడానికి మధ్యతరగతి చేతుల్లో డబ్బులుండేలా చూడాలి. ఉపాధి అవకాశాలు పెరిగితే వారికి ఆదాయం వస్తుంది. ఆ వచ్చిన ఆదాయం పన్నుల రూపంలో పెద్దగా పోనప్పుడు వారు తమ అవసరాల కోసం ఖర్చు పెట్టగలుగుతారు. అయితే ఈ క్రమంలో ఖజానా పెద్దగా నష్టపోకూడదని ప్రభుత్వం భావిస్తుంది. పన్ను వసూళ్లు తగ్గకుండావున్నప్పుడే అది సాధ్యమవుతుంది. కనుక ప్రజల కొనుగోలు శక్తి పెంచి వినిమయం బాగుండేలా తీసుకునే చర్యలకూ, ఖజానా దండిగా నిండటానికి చేసే ప్రయత్నాలకూ మధ్య వైరుధ్యం ఉంటుంది. దీన్నెంత ఒడుపుగా చేయగలుగుతారన్న దాన్నిబట్టే ఆర్థికమంత్రి చాకచక్యం వెల్లడవుతుంది.

మిగిలినవాటి మాటెలావున్నా ప్రతి బడ్జెట్‌కు ముందూ మధ్యతరగతి ఆశగా ఎదురు చూసేది ఆదాయం పన్ను మినహాయింపు. కేంద్ర ఆర్థికమంత్రి కనికరించి గడిచిన సంవత్సరంకన్నా పన్ను భారం మరింత తగ్గిస్తే బాగుండునని మధ్యతరగతి జీవులు ఆశిస్తారు. ఆ విషయంలో ప్రతిసారీ వారికి నిరాశే ఎదురవుతోంది. ఈసారి నిర్మలా సీతారామన్ ఆదాయం పన్ను వసూలుకు సంబంధించి రెండు రకాల విధానాలు ప్రతిపాదించారు. ఇప్పుడున్న మూడు శ్లాబ్‌లను యథాతథంగా కొనసాగిస్తూ, దాంతోపాటు ఏడు కొత్త శ్లాబ్‌లు ప్రకటించారు. కొత్త శ్లాబుల్ని ఎంచుకుంటే కొన్ని మినహాయింపులు ఎగిరిపోతాయని ఆమె చావు కబురు చల్లగా చెప్పడంతో అందరూ నీరసపడ్డారు. ఇంతకూ కేంద్ర ఆర్థికమంత్రి చేసిందల్లా ఏది కావాలో ఎంచుకునే స్వేచ్ఛ వేతన జీవులకివ్వడమే. రెండూ కత్తులే. ఏ కత్తి మెత్తగా తెగుతుందో ఎవరికి వారు తేల్చుకోవాల్సివుంటుంది. నిపుణులు చెబుతున్నదాన్నిబట్టి ఈ చర్య వల్ల ఆదాయం పన్ను గణన, రిటర్న్‌ల దాఖలు ఎంతో సంక్లిష్టంగా మారాయి. కొత్త శ్లాబుల్లోకి మారదల్చుకున్నవారికి నిరాకరిస్తున్న మినహాయింపులు హేతుబద్ధంగా అనిపించడం లేదు. రూ. 15 లక్షల వార్షిక ఆదాయం ఉండేవారికి పాత విధానంలో రూ. 2,73,000 ఆదాయం పన్ను చెల్లించాల్సివస్తే... కొత్త విధానం ప్రకారం రూ. 1,95,000 చెల్లిస్తే సరిపోతుంది. అంటే కొత్త విధానంలో రూ. 78,000 మిగులుతుంది. కానీ అదే సమయంలో వారు గృహ రుణంపై చెల్లించే వడ్డీ, బీమా ప్రీమియంలు, పిల్లల చదువులకయ్యే ఫీజులు, పీపీఎఫ్ వంటివాటిపై ఇప్పుడున్న మినహాయింపులన్నీ కోల్పోతారు. ఇవే కాదు... 80జీ కింద విరాళాలపై ఉండే మినహాయింపు, 80 జీజీ కింద నెలకు రూ. 5,000 వరకూ ఉండే మినహాయింపు మాయమవుతాయి. ఇలా దాదాపు 70కి పైగా మినహాయింపులను తొలగించారు. అయితే మున్ముందు సమీక్షించి మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ సంగతలా వుంచితే... గృహ నిర్మాణ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వర్తమానంలో ఇలా మినహాయింపులు తొలగించడం ఆ రంగానికి చేటు కలిగించదా? అలాగే బీమా ప్రీమియంలు చెల్లించేవారికిచ్చే మినహాయింపులు కూడా కొత్త విధానంలో కనుమరుగయ్యాయి. ఆదాయం పన్ను మినహాయింపు కోసం అధిక శాతంమంది ఆశ్రయించేది బీమా ప్రీమియంలు చెల్లించడం. ఆ మినహాయింపు కాస్తా ఎత్తేస్తే, ఎవరైనా బీమా జోలికి వెళ్తారా? అది ఆ వ్యాపారంపై ప్రభావం చూపదా? ఉన్నంతలో సాగురంగానికీ, గ్రామీణ రంగానికీ కేటాయింపులు మెరుగ్గానే ఉన్నాయి. బ్యాంకు డిపాజిట్లపై ఉన్న బీమాను పెంచడం మంచి చర్యే.

జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లోని వాటాలను విక్రయించదల్చుకున్నట్టు నిర్మలాసీతారామన్ ప్రకటించారు. ప్రస్తుతం కేంద్రానికి ఎల్ఐసీలో పది శాతం వాటావుంది. ఇందులో ఏమేరకు విక్రయిస్తారో చూడాలి. దండిగా లాభాలు ఆర్జిస్తున్న ఎల్ఐసీలో ప్రైవేటీకరణకు వీలుకల్పించే ఈ చర్య అమలు అంత సులభం కాదు. దీన్ని ప్రతిఘటిస్తామని బీమా ఉద్యోగులు హెచ్చరించారు. కేంద్రం నిధులు సమకూరిస్తే తప్ప నడిచే అవకాశం లేని సంస్థలను వదిలిపెట్టి నిక్షేపంలా ఉండే సంస్థలను ప్రైవేటు పరం చేయడమేమిటన్నది వారి ప్రశ్న. ఎల్ఐసీ ఏ రోజూ ఆర్థికంగా ఇబ్బందుల్లోపడలేదు. ప్రభుత్వాన్ని ప్రాధేయపడలేదు. సరిగదా... నష్టాల్లో మునిగిన అనేక పబ్లిక్ రంగ సంస్థల్ని బతికించడానికి దాని నిధులే అక్కరకొస్తున్నాయి. బీమా రంగంలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించినా, ప్రజలు ఎల్ఐసీ వైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికీ ఆ సంస్థే అగ్రగామిగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం పునరాలోచించడం ఉత్తమం. వివిధ మౌలిక సదుపాయ రంగ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు సమీకరిస్తూనే, ద్రవ్యలోటు రాకుండా చూడటానికి ఎల్ఐసీలోనూ, ఐడీబీఐలోనూ ఉన్న వాటాలను కేంద్రం విక్రయించదల్చుకుంది. ఈ వాటాల విక్రయం ద్వారా రూ. 90,000 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇది ఏమేరకు సాధ్యమో చూడాల్సివుంది. అయితే ద్రవ్యలోటును నిర్దేశించిన పరిమితికి లోబడివుండేలా చూడాలన్న లక్ష్యంలో సంక్షేమ పథకాలకు కోత పడకుండా చూడటం ముఖ్యం. బడ్జెట్ గణాంకాలు గమనిస్తే ముగుస్తున్న సంవత్సరంలో ఆహార సబ్సిడీలో రూ. 75,532 కోట్లు, గ్రామీణ ఉపాధిలో రూ. 9,502 కోట్లు కోతపడ్డాయి. ప్రజల్లో వినిమయాన్ని పెంచి, డిమాండ్ పెరిగేలా చేసినప్పుడే తయారీ రంగం కోలుకుంటుంది. అందుకవసరమైన మరిన్ని చర్యలు తీసుకుంటేనే వృద్ధి రేటు నిర్మలా సీతారామన్ ఆశించినట్టు 10 శాతానికి చేరుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి శు.దశమి సా.5.50 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం రోహిణి రా.10.28 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం ప.2.06 నుంచి 3.47 వరకు, తిరిగి తె.4.12 నుంచి 5.50 వరకు, దుర్ముహూర్తం ఉ.8.51 నుంచి 9.34 వరకు, తదుపరి రా.10.56 నుంచి 11.47 వరకు, అమృతఘడియలు... రా.7.09 నుంచి 8.44 వరకు.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

'వైరస్'ల ఆటబొమ్మ మన శరీరం

ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

విషక్రిముల కారణంగా ప్రబలిన రోగాలలో 60 శాతం రోగాలు ఉత్తర అమెరికా, యూరప్‌లలోనివే అని పరిశోధకులు తేల్చారు. కానీ సిద్ధాంత విభేదాల పేరిట పెట్టుబడిదారీ దేశాల అధినేతలు, ప్రభుత్వాలు కొన్ని ఈ 'విష క్రిముల' వ్యాప్తిని సోషలిస్టు దేశాలు బయటికి పొక్కనివ్వకుండా అణచివేస్తున్నాయని ఆరోపిస్తున్నాయి. నిజానికి చైనాలో ప్రబలిన తాజా 'కరోనా వైరస్' మహమ్మారి ఉదంతాన్ని వెంటనే ప్రపంచ ఆరోగ్య సంస్థకు తెలిపి, ప్రపంచ దేశాలను హెచ్చరించవలసిందిగా బీజింగ్ ప్రభుత్వం కోరిందని పెట్టుబడిదారీ పత్రికలే ప్రకటించాయి. తొలి అణుబాంబుతో నాగసాకి, హిరోషిమాలను నామరూపాల్లేకుండా చేసింది సామ్రాజ్యవాద ప్రభుత్వాలే అని మర్చిపోవద్దు. అదే సమయంలో మానవ శరీరమే అంతరంగంలో అనుకూల, ప్రతికూల సూక్ష్మజీవుల మధ్య నిరంతర పోరాట వేదిక అని మరవరాదు!

ఎప్పటికప్పుడు కొత్తగా మానవాళిని పీడిస్తున్న విషక్రిమి కీటకాదుల బారినుంచి తప్పించుకునే క్రమంలో ఆరోగ్య రక్షణ కోసం తీసుకోవలసిన తొలి చర్య- నిరంతర నిఘా. మానవుల ఉనికినే దెబ్బతీసే ఈ పరాన్నభుక్కులైన విష క్రిముల సంహారం ప్రపంచ దేశాల ప్రభుత్వాల సామూహిక దాడి వల్లేనే సాధ్యం. అలా చేసినప్పుడే విశ్వవ్యాప్తంగా రోజులలోనే ఈ విష క్రిముల దాడి నుంచి మానవులను రక్షించుకోగలం. కొత్తగా తలెత్తే విష క్రిములను శరవేగంతో కనిపెట్టి ఎదుర్కొని రూపుమాపగలం. ఇందుకు అన్ని దేశాల ప్రభుత్వాలకూ రాజకీయ సంసిద్ధత, మౌలికమైన పరిశోధనలకు తగిన సాధన సంపత్తి, శక్తియుక్తులు అవసరం. ఇది సమర్థవంతంగా జరిగిన నాడే హెచ్ఐవి-1 (ఎయిడ్స్), సార్స్, ఎబోలా, కరోనా లాంటి తాజా భయంకర విషక్రిముల వ్యాప్తిని అరికట్టగలం.

– మార్క్ ఉడ్ హౌస్ ఫియోనా స్కాట్, జో హడ్సన్, రిచర్డ్ హోయీ, మార్గోఛేజ్ టాపింగ్ సౌజన్యంతో 'హ్యూమన్ వైరసెస్స్, డిస్కవరీ అండ్ ఎమర్జెన్సీ'

మానవ, మానవేతర జీవజాలం బతుకంతా పరస్పర ఆశ్రయంతో సాగుతున్నంతకాలం విష క్రిముల పుట్టుక, వాటి వ్యాప్తి నుంచి పూర్తిగా తప్పించుకోలేమన్నది పరిణామ క్రియ. ఇప్పటికి మానవాళికి సోకిన ప్లేగు మహమ్మారి బ్రిటన్‌లో పుట్టి ఇండియాలోని సూరత్ పట్టణం దాకా వ్యాపించి వేలు లక్షల సంఖ్యలో ప్రజల్ని బలిగొంది. అలాగే తాజాగా మన ఇరుగుపొరుగైన చైనాలో కొత్తగా పుట్టిన మరో మహమ్మారి కరోనా వైరస్ వ్యాధి భారతదేశం సహా 21 దేశాలకు వ్యాపించి భయాందోళనలకు కారణమవుతోంది. చైనాలోని రెండు మూడు రాష్ట్రాలకు ఈ సరికొత్త కరోనా వైరస్ పరిమితమైనట్లు కనిపిస్తున్నా అనేక దేశాలు చైనా నుంచి విమాన ప్రయాణాల రాకపోకలను నిషేధించవలసి వచ్చింది. భారత్ సహా ఇతర దేశాలనుంచి చదువుసంధ్యల నిమిత్తం వచ్చి వివిధ వృత్తి విద్యల్లో నైపుణ్యం కోసం చైనాలోని ప్రముఖ విద్యా కేంద్రాలలో అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులంతా ఆందోళనలో ఉన్నారు.

అంతర్జాతీయ వైద్యనిపుణులు, విషక్రిముల అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం అంచనా ప్రకారం ఇంతవరకు ప్రపంచంలో ఆచూకీ దొరికిన వైరస్‌ల సంఖ్య 219 అని తేలింది. మానవులలో క్రిమివ్యాప్తి కారకాలైన 23 విషక్రిమి కుటుంబాలను పరిశోధకులు గుర్తించారు. ఈ క్రిమి కుటుంబాల తబిశీళ్లను 105 సంవత్సరాల మీదట వైద్య సాంకేతిక పరిశోధకులు కనిపెట్టగలిగారు. పశువుల నుంచి, గబ్బిలాలు, చుంచులు, పాములు, పందులు వగైరా మానవేతర జీవుల నుంచి ప్రధానంగా ఈ విషక్రిములు ప్రబలుతుంటాయి. సరికొత్త కరోనా వైరస్ తాజాగా ప్రబలేవరకూ చరిత్రలో ఇంతవరకూ మానవులను పీడించిన విషక్రిములలో పాపిలోమా, వెసెక్యులార్ సొమాటిస్ వైరస్‌లు ముఖ్యమైనవని శాస్త్రవేత్తల అంచనా. 1892లో టొబాకో మొజాయిక్ వైరస్‌ను కనిపెట్టగా, పశువుల కాళ్లకు, నోటికి (ఫుట్ అండ్ మౌత్) సోకే 'గాలి' వ్యాధి క్రిమిని శాస్త్రవేత్తలు 1898లో కనుగొన్నారు. మానవులకు సోకిన తొలి ఎల్లో ఫీవర్ వైరస్ క్రిమిని 1901లో కనిపెట్టారు.

రండో మాట



అంతేగాదు, ఇప్పటికీ మానవులకు సోకే మూడు నాలుగు రకాల వైరస్‌లను ఏటా కొత్తగా కనిపెడుతూనే ఉన్నారు. అలాగే, ఇంతకు ముందెన్నడూ కనిపెట్టని సరికొత్త విషక్రిముల (బాక్టీరియా, ఫంగీ) రకాల్ని కూడా కనిపెడుతున్నారు.

ఇలా విషక్రిముల కారణంగా ప్రబలిన రోగాలలో 60 శాతం రోగాలు ఉత్తర అమెరికా, యూరప్‌లలోనివే అని పరిశోధకులు తేల్చారు. గత 15 ఏళ్లలో 'ఆస్ట్రలేషియా'లో ఈ రోగాలు ప్రబలినాయని పరిశోధకులు నిర్ధారణ చేశారు. ఇవిగాక 1954 నుంచీ సగటున ఏడాదికి సుమారు 4 రకాల విష క్రిములను శాస్త్ర పరిశోధకులు కనిపెడుతూ వచ్చారు. బహుశా కొత్తగా వీటి సంఖ్య పెరగవచ్చునని కూడా ఒక అంచనా. ఇంతవరకు 'అమెరికా తుమ్మితే ప్రపంచానికి జలుబు చేస్తుందన్న' జోకు వ్యాప్తిలో ఉండేది. కానీ, ఇప్పుడు ఇరుగు పొరుగు తుమ్మినా దేశాంతరాలకు, దూరతీరాలకు కూడా వ్యాపిస్తుందన్న కొత్త సామెతకు మనం అలవాటుపడాలి. ఇందులో మళ్లీ సిద్ధాంత విభేదాల పేరిట పెట్టుబడిదారీ దేశాల అధినేతలు లేదా ప్రభుత్వాలు కొన్ని ఈ 'విష క్రిముల' వ్యాప్తిని సోషలిస్టు దేశాలు బయటికి పొక్కనివ్వకుండా అణచివేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. కానీ, భయాందోళనల ద్వారా ప్రజలలో అలజడి కల్గించకుండా బాధ్యతగల ప్రభుత్వాల మొత్తం కేంద్రీకరణంతా వైరస్ మహమ్మారిని ఎదుర్కోవడంపైనే ఉండాలని సోషలిస్టు దేశాలు భావిస్తున్నాయి. వియత్నాం దురాక్రమణ సందర్భంగా అమెరికన్ పెట్టుబడిదారీ సామ్రాజ్య పాలకులు వియత్నాం పంటపొలాలపై విషక్రిమి ప్రయోగం జరిపి, 15 ఏళ్లపాటు పంటలు పండకుండా చేశారని మరచిపోరాదు. కానీ, పెట్టుబడిదారీ పత్రికలే.. చైనాలో ప్రబలిన తాజా 'కరోనా వైరస్' మహమ్మారి ఉదంతాన్ని వెంటనే ప్రపంచ ఆరోగ్య సంస్థకు తెలిపి, ప్రపంచ దేశాలను హెచ్చరించ వలసిందిగా బీజింగ్ ప్రభుత్వం కోరిందని ప్రకటించాయి. అయితే కొత్త వైరస్‌ను గుర్తించడంలో కొంత ఆలస్యమైన మాట నిజమేనని చెబుతూ ఇందుకు కారణమైన స్థానిక అధికార గణాన్ని, స్థానిక కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల్ని కూడా స్థానిక నాయకత్వం హెచ్చరించి, సత్వర చర్యలు తీసుకున్నట్టు ప్రపంచ పత్రికలు పేర్కొన్నాయి.

అంతేగాదు, చైనాలోని సెంట్రల్ ప్రావిన్స్ అయిన హూబే రాష్ట్రంలోని భారతీయ విద్యార్థుల్ని స్వదేశానికి పంపడానికి అటువైపు నుంచి చైనా, ఇటునుంచి భారత్ పాలకులు ప్రయత్నిస్తున్న సమయంలో అక్కడి మన విద్యార్థులు, వూహాన్ నగరంలోని బట్టల పరిశ్రమకు చెందిన విశ్వవిద్యాలయంలో పనిచేసే భారతీయ ప్రొఫెసర్ అశోక్ కుమార్ యాదవ్, ఆయన భార్య నేహా యాదవ్ చెప్పిన మాటల్ని 'వైర్' సంస్థ ప్రతినిధి దేవిరూపమిత్రా ఇలా వివరించడం గమనార్హం. 'కరోనా వైరస్ మహమ్మారి ఇతర చోట్లకి పాకిపోకుండా కట్టడి చేసే ప్రయత్నంలో భాగంగానే చైనా ప్రభుత్వం ఆంక్షలు విధించినందున చైనీస్ నగరాలలో ఉండే భారతీయులు తమ గదులకు, డార్మెటరీలకు పరిమితం కావలసి వచ్చింది'. ఇందుకు కారణం- కరోనా వైరస్ వ్యాధి ఒక శరీరం నుంచి ఆగమేఘాలమీద, క్షణం వ్యవధి లేకుండా ఇన్‌ఫెక్ట్ అయిందన్న సూచన కూడా కనబడనంత వేగంగా పొరుగు వ్యక్తికి సోకుతుండటమే! ప్రొఫెసర్ యాదవ్ మరో మాట కూడా చెప్పారు. 'ఇప్పుడు మేమిక్కడ సురక్షితంగానే ఉన్నాం. ఈ పరిస్థితిలో మేము ఇండియాకి చేరుకోవడమంటే మా ద్వారా దేశమంతా ఈ మహమ్మారి పాకిపోతే, చైనా లాగా మనం పరిస్థితిని అదుపు చేయలేం' అన్నారు.

అంతేగాదు, 'ఇప్పుడు చైనాలో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. అందుకని ఇండియాకు వెళ్లొద్దనుకున్నాను' అన్నాడు ఆశీష్ యాదవ్. అంతేగాదు, హూపెలో మెడిసిన్ చదువుతున్న 23 ఏళ్ల 'ఇంటర్న్‌షిప్' విద్యార్థిని వర్షిణి శ్రీనివాస్ తన కోర్సు పూర్తి అయితే గానీ కదలనని భీష్మించింది. ఎందుకని? 'యూనివర్సిటీ అధికారులు ఆదర్శవంతమైన పరిసరాలను కాపాడేందుకుగాను బిల్డింగ్ వరండాలను, రోజుకు రెండేసిసార్లు పరిశుభ్రంగా బాగు చేసి ఉంచుతున్నారని' వర్షిణి చెప్పింది.

ఇంతకూ అమెరికా, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాలు 'సందోయ్, సందోయ్' అన్నట్టు చైనా విధానాల్ని వ్యతిరేకిస్తున్న దేశాలను బదనాం చేయడానికి చైనా ప్రభుత్వం 'కరోనా వైరస్'ను కృత్రిమంగా సృష్టించినట్టు ప్రచారం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మరవరాదు. అలా చైనా కృత్రిమ వైరస్‌ను కావాలని సృష్టించి ఉంటే, కరోనా వైరస్ సమాచారంపై వెంటనే ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థలను అప్రమత్తం చేస్తూ అధికారికంగా ఎందుకు సమాచారాన్ని అందించవలసి వచ్చిందో సమాధానం లేదు. నిజానికి ఈ రెండు సామ్రాజ్యవాద ప్రభుత్వాలే ఆసియా, ఆఫ్రికా దేశాలను దురాక్రమణ యుద్ధాలలో ఇరికించి ప్రజలను బికారులను చేసి వదిలిన పాలకులనీ, తొలి అణుబాంబుతో నాగసాకి, హిరోషిమాలను నామ రూపాల్లేకుండా చేసిన పచ్చి పుండాకోరులని మరువరాదు. మానవ శరీరమే అంతరంగంలో అనుకూల, ప్రతికూల సూక్ష్మజీవుల మధ్య నిరంతర పోరాట వేదిక అని మరవరాదు!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పేరు

"మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని బీజేపీ ఎంపీ పర్వేష్ వర్మ రాజీవ్ ఫిరోజ్ ఖాన్ అంటూ లోక్‌సభలో ప్రస్తావించారు. వాట్సాప్ యూనివర్సిటీ నుంచి వచ్చిన ఈ మేధావులు తెలుసుకోవాల్సిందేమిటంటే ఫిరోజ్ జహంగీర్ గాంధీ ముస్లిం కాదు, పార్శీ" – రవి నాయర్, జర్నలిస్ట్

అవమానం

"ఓట్లువేసి భారీ మెజారిటీతో గెలిపించుకున్న ఒక ముఖ్యమంత్రిని ఉగ్రవాది అనడం ఢిల్లీ ప్రజలందరినీ అవమానించినట్టే" – సాగరికా ఘోష్, జర్నలిస్ట్

ఉగ్రవాది

"ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఉగ్రవాది కాదని సామాన్యులకు కూడా తెలుసు. కానీ, 'తుపాకులతో కాల్చాలి'అని నినదించిన మీ పార్టీ గూండాలు మాత్రం ఉగ్రవాదులే. వారిని అరెస్ట్ చేయండి. ఉగ్రవాదులపట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఉదాసీనత చూపబోమని చెప్పారుగా?" – రూపా గులాబ్, రచయిత

సక్సెస్

"దేశంలో మీరు వెదజల్లుతున్న విద్వేషాన్ని చూసి కూడా స్పందించకుండా ఉండాలని నన్నూ, నా సహ నటులను కోరుతున్నారా? కుదరదు. మేం విజయవంతమైన బ్రాండ్లమని మాకు తెలుసు. మీరు అనామకులుగా అమ్ముడుపోయారు. మీరు ఏం చెప్పినా సత్యాన్ని మార్చలేరు" – కవిత, నటి

శత్రువులు

"నెలకి ఒకరి చొప్పున ఏడాదిలో పన్నెండు మంది జీవించి ఉన్న గొప్ప ఆర్థికవేత్తల కృషిని గురించి రాయాలని చాన్నాళ్లుగా ఆలోచిస్తున్నాను. కానీ నా పన్నెండవ కాలమ్ వెలువడే నాటికి హఠాత్తుగా నాకు అనేక మంది శత్రువులు తయారవుతారేమోనని భయంగా ఉంది. దాన్ని నేను సరిగా సంబాళించుకోలేనన్న సందేహం కూడా ఉంది" – కౌశిక్ బసు, ప్రొఫెసర్

తెలుసా?

"మన దేశరాజధానిలో ఏం జరుగుతోందో చూశా. ఎన్నికలు అయిపోయిన తరువాత ఏం జరుగుతుందో ఎవరైనా ఆలోచించారా? ఈ నగరానికి నష్టం జరుగుతుంది. దాని స్థాయికీ, అవగాహనకీ, వివిధ వర్గాల మధ్య సంబంధాలలో జరిగే నష్టాన్ని పూడ్చడానికి చాలా సమయం పడుతుంది" – భూపేంద్ర చౌబే, జర్నలిస్ట్

స్వాతంత్ర్యం

"వీళ్లంతా ఒక్కసారి కూడా పోలీసులతో దెబ్బలు తినని కుహనా నాయకులు. వారి స్వాతంత్ర్య పోరాటం అంతా ఒక నాటకం. అది నిజమైన పోరాటం కాదు. అది లోపాయికారీగా సాగిన స్వాతంత్ర్య పోరాటం మాత్రమే" – అనంత్ కుమార్ హెగ్డే, బీజేపీ ఎంపీ

ఇన్‌బాక్స్

జాతరకు ఘనంగా ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్రంలో కులాలకు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల పండుగలు సంస్కృతి ఆచార సంప్రదాయాలను గౌరవించుకునే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రభుత్వం పెంపొందిస్తుంది. అందులో భాగంగానే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ హయాంలో ఘనంగా జరుపుకుంటున్నాం. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు గిరిజనులే కాకుండా గిరిజనేతరులు కూడా తండోపతండాలుగా తరలివస్తారు. అమ్మవారికి బంగారం బెల్లం నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఈ జాతరకు 900 ఏళ్ల చరిత్ర ఉంది. మేడారం జాతరను 1940 వరకు చిలుకల గుట్టపై గిరిజనులు మాత్రమే జరుపుకునేవారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే వనదేవతల జాతరకు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి కూడా లక్షల కొద్ది భక్తులు తరలివస్తారు. 1996లో ఈ జాతరను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పండుగగా గుర్తించింది. జాతరలో భాగంగా చిలుకలగుట్టపైనున్న సమ్మక్కను 6వ తేదీ సాయంత్రం గద్దెపై ప్రతిష్ఠిస్తారు. 7న సమ్మక్క-సారలమ్మలతో పాటు పగిడిద్ద రాజులు, గోవిందరాజులను గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. 8న అమ్మవార్ల తిరుగు ప్రయాణంగా వన ప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. ఆ తర్వాత బుధవారం అంటే 12వ తేదీన తిరుగు వారం నిర్వహిస్తారు.

మేడారం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. పలు విషయాలపై భక్తులకు అవగాహన కల్పించడానికి డిజిటల్ వాహనాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. జాతర సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రభుత్వం కోరుతోంది. మేడారం జాతర పనుల పురోగతిపై ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, అటవీ శాఖ, గిరిజన శాఖలతో అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు.

డాక్టర్ గుగులోతు శంకర్ నాయక్
తెలంగాణ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు | 99088 17986

సమస్యల పరిష్కారంలో భారతీయులు భేష్!

బ్రిటన్ పేరు చెప్పగానే మనకు వలస పాలన, స్వాతంత్ర్య పోరాటం వంటి విషయాలు గుర్తుకు రావడం కద్దు. అయితే స్వాతంత్ర్యం తరువాత ఈ 73 ఏళ్లలోనూ బ్రిటన్ భారత దేశానికి మధ్య సహాయ, సహకారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో భారతదేశం ప్రతిభను గుర్తించి బ్రిటన్ వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతూండటం. పరిశోధన రంగంలో బ్రిటన్ ప్రభుత్వ ప్రతినిధిగా గుర్తింపు పొందిన యూకే రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ నేతృత్వంలో 2008 నుంచి భారత్‌లోని ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలు, యూనివర్సిటీల్లో పలు ప్రాజెక్టులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ అంశంపై మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు 'సాక్షి' యూకేఆర్ఐ డైరెక్టర్ (ఢిల్లీ) రెబెకా ఫెయిర్‌బేమ్‌తో ముచ్చటించింది.

ప్ర: యూకే రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సంస్థ భారత్‌లో రూ. 3,100 కోట్ల పెట్టుబడులు పెట్టింది. వీటి నుంచి మీరు ఆశిస్తున్నదేమిటి?

జ: ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు యూకే, భారత్‌లు సంయుక్తంగా పరిష్కారాలు కనుక్కోగలగాలని ఆశిస్తున్నాం. మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు పని కొచ్చే పనులు చేపట్టాలన్నది మా ఉద్దేశం.

ప్ర: భారత్‌తో కలిసి ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రత్యేకమైన కారణమేమైనా ఉందా?

జ: నా దృష్టిలో భారత్‌లో ఉన్నంత వైవిధ్యత ఇతర ప్రాంతాల్లో ఎక్కడా కనిపించదు. సమస్యల పరిష్కారం విషయంలో భారతీయులు అనుసరించే పద్ధతులు చాలా వినూత్నమైనవి. సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు ఈ వైవిధ్యత చాలా అవసరమవుతుంది.

ప్ర: ఏ రంగాల్లో ప్రాజెక్టులు ఎంచుకుంటారు?

జ: యునైట

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 4-2-2020

ఎయిర్ మార్షల్ పద్మావతి

తల ఎత్తి చూస్తే భారత జాతీయ పతాకం కనిపించిందామెకు. ఈ దేశానికి నేను సైతం సేవ చేయాలి అనుకుంది. ఇంటి నుంచి ఆడపిల్ల కాలు బయటపెట్టలేని రోజుల్లో కాలికి యూనిఫామ్ షూ కట్టుకోవడం ఎంత కష్టం. కాని ఉండిపోతే అలాగే ఉండిపోతాం. ఎదగాలి. ఎగరాలి. ఆకాశాన్ని అందుకోవాలి. అంతకు మించిన లీవితో తల ఎత్తుకు నిలబడాలి అనుకుందామె. పోరాడింది. గెలిచింది. భారతదేశపు తొలి మహిళా ఎయిర్ మార్షల్ పద్మావతి. మగవాళ్ల సామ్రాజ్యంగా ఉండే సైన్యంలో త్రీ స్టార్ ర్యాంక్‌కు ఎదిగిన ధీర మహిళ ఆమె.

ఎదిగిన ఆకాశం

1962- చైనా యుద్ధం.

ఆ యుద్ధ వాతావరణం, ఆ వాతావరణంలో వినిపించిన 'అయ్ మేరే వతన్‌కీ లోగో..' పాట అప్పటి పద్నాలుగేళ్ల అమ్మాయి ఆలోచనా ధోరణిని, జీవనశైలినే మార్చేశాయి. ఆమె దేశానికే తన జీవితాన్ని అంకితం చేసింది. ఫలితం? ఎన్నో ఘనతలను తన పేరుకు ముందు జత చేర్చుకోవడమే కాదు తాజాగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకునే గౌరవాన్ని పొందింది. నాటి ఆ అమ్మాయే నేటి 76 ఏళ్ల పద్మావతి బంధోపాధ్యాయ. భారత వైమానిక దళంలో తిరుగులేని పేరు. తొలి మహిళా ఎయిర్ మార్షల్, త్రివిధ దళాలలో 3 స్టార్ ర్యాంకుకు ఎదగగలిగిన రెండవ మహిళ, డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కోర్స్ పూర్తి చేసిన తొలి మహిళా అధికారి, ఏవియేషన్ సైన్స్‌లో తొలి మహిళా ఎక్స్‌పర్ట్, ఎయిర్‌ఫోర్స్‌లో తొలి మహిళా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్... ఇంత కీర్తి ఉన్నా ఎంతో ఒదిగి ఉండడం పద్మావతికున్న ముఖ్యమైన క్వాలిఫికేషన్. అదే ఈ రోజు ఆమె గురించి తెలుసుకునేలా చేసింది.

పుట్టింది 1944వ సంవత్సరం తిరుపతిలో. తండ్రి ఎస్.స్వామినాథన్, తల్లి అలమేలు. కాని పెరిగింది మాత్రం ఢిల్లీలో. చదువును ఆడపిల్లలకు ఆమడదూరం ఉంచే కాలం కావడం ఒకటి, కుటుంబ కట్టుబాట్ల కారణాన మరొకటి మొత్తానికి పదేళ్లు వచ్చేవరకు బడిని చూడలేదు పద్మావతి. అప్పటిదాకా సోదరుడి పాఠ్యపుస్తకాలతోనే అక్షర జ్ఞానం సంపాదించుకుని నేరుగా అయిదవ తరగతిలో బడిలో చేరింది. డాక్టర్ కావాలని పద్మావతి కల. కాని ఎనిమిదవ తరగతి పూర్తయ్యాక సైన్స్ అండ్ ఆర్ట్స్ కోర్సులు ఉన్న స్కూలు ఇంటికి దూరంగా ఉండటంతో అంతదూరం ఆడపిల్లను బస్సులో పంపడం ఇష్టం లేక ఇంటిముందున్న స్కూల్లోనే పద్మావతిని చేర్పించింది తల్లి. ఆ స్కూల్లో డొమెస్టిక్ సైన్స్, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, తమిళం, సంస్కృతం చదువుకుంది పద్మావతి. బోర్డ్‌లో ఫస్ట్‌న నిలిచింది. ఇప్పుడు పెద్దదయ్యింది కనుక ప్రీ మెడికల్ చదువుతా అని ఉత్సాహపడింది పద్మావతి. ఆ మాట విని అందరూ నవ్వారు. 'సైన్స్ బేస్ లేంది ప్రీ మెడికల్ ఎలా చదువుతావు?' అన్నారు. అయినా వెరవక ప్రీ మెడికల్లో చేరాలనే పట్టుపట్టిన కూతురి కోసం తండ్రి 'మా అమ్మాయికి సీట్ ఇవ్వండి.. ' అంటూ ఢిల్లీలోని ఎక్కని కాలేజి మెట్టు లేదు.. చేతులు జోడించి విన్నవించుకోలేని కాలేజీ సిబ్బంది లేదు. మొత్తానికి ఒక కాలేజ్ ఆ రిక్వెస్ట్‌ను మన్నించి పద్మావతికి ప్రీ మెడికల్ చదువుకు అవకాశమిచ్చింది. అలా ఢిల్లీ బోర్డ్ ఆఫ్ ఆర్ట్స్ నుంచి ఢిల్లీ యూనివర్శిటీ సైన్స్ కోర్సెస్‌కు వెళ్లిన తొలి విద్యార్థిని పద్మావతే అయ్యింది.

ఎయిర్‌ఫోర్స్‌లో..

అప్పుడే అంటే 1962లో వచ్చిన చైనా యుద్ధం ఆమెలో 'దేశం కోసం ఏదైనా చేయాలనే' ఆలోచనను రేకెత్తించాయి. ఎలాగైనా ఆర్మీలో చేరాలి అని నిశ్చయించుకుంది. అసలు వాళ్లింట్లో ఏ తరమూ కనీసం మిలిటరీ కవాతు శబ్దం కూడా

విని ఎరగదు. ఆ మాటకొస్తే పద్మావతికీ దానికి సంబంధించిన అవగాహన ఆవగింజంతైనా లేదు. ఆమె ఆకాంక్ష విన్న వాళ్లంతా ఎద్దేవా చేయడమే 'అమ్మాయి అయ్యుండి మిలటరీలో చేరుతావా?' అని. ఈలోపు అదే యేడు ఆర్మ్డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్ ప్రారంభమైంది. 'ఇది నాకోసమే అనుకుంది' పద్మావతి. ఆ తర్వాతి యేడు అందులో సీటు తెచ్చుకుంది. పూర్తయ్యాక వైద్యసేవలను అందించడానికి ఎయిర్‌ఫోర్స్‌ను ఎంపిక చేసుకుంది. 'ఆ వయసులో ఆ యూనిఫామ్, ఆ విమానాల విన్యాసాలు చూస్తుంటే ఎయిర్ ఫోర్స్ అంటే క్రేజ్ ఉండేది. అందుకే దాన్ని ఎంచుకున్నా' అంటారు పద్మావతి నవ్వుతూ. ఎలాగూ ఎయిర్ ఫోర్స్‌లో చేరాను కాబట్టి పైలట్‌గా కూడా ప్రయత్నిద్దామని దానికోసమూ శ్రమించింది ఆమె. అయితే ఫిట్‌నెస్ లేని కారణంగా ఆ అవకాశం రాలేదు. అయినా నిరాశ పడలేదు. ఏవియేషన్ మెడిసిన్‌లో స్పెషలైజేషన్ చేసింది. అలాగైనా పెలట్స్ కలిసి పనిచేయొచ్చని. అనుకున్నట్లుగానే తను పని చేసిన చాలాచోట్ల పైలట్స్‌తో ఎయిర్ క్రాఫ్ట్స్‌లో ప్రయాణించింది కూడా.

1971 పాకిస్తాన్‌తో యుద్ధంలో..

యుక్త వయసులో చైనా యుద్ధం చూసింది. సర్వీస్‌లో చేరగానే పాకిస్తాన్‌తో యుద్ధ పరిస్థితులు అనుభవంలోకి వచ్చాయి. అప్పుడు ఆమె పంజాబ్‌లోని సరిహద్దు ప్రాంతంలో ఇంటర్న్‌షిప్‌లో ఉంది. కుటుంబంతో కలిసి ఉండే నివాస ప్రాంతం కాదు అది. 'అందుకే బంకర్లలో ఉండేవాళ్లం. అప్పటికి నాకు ఆరునెలల కొడుకు. నేను తప్ప ఆ బంకర్లలో మిగిలిన వాళ్లంతా మగవాళ్లే. నా పారామెడికల్ స్టాఫ్‌తో కలిసి బంకర్లో ఉండేదాన్ని. యుద్ధం మొదటి రోజు పాకిస్తాన్ బాంబ్‌తో దాడి చేసింది. ఆ టైమ్‌లో మేము బయటే నిలబడి ఉన్నాం. రెండో రోజు 250 మంది క్షతగాత్రులయ్యారు. వాళ్లందరికీ చికిత్స చేశాను. మెడిసిన్‌లో ప్రాక్టికల్ లెసన్స్ నేర్చుకున్న సందర్భం అది' అంటూ ఆ రోజులను గుర్తు తెచ్చుకున్నారు పద్మావతి. కార్గిల్ యుద్ధమప్పటికీ ఆమె కల్నల్‌గా పర్యవేక్షణా బాధ్యతల్లో ఉన్నారు.

ఎప్పటికీ మరిచిపోలేనివి..

''ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌ని అయ్యాక.... ముందు కార్ ఫ్లాగ్ ఎగురుతుండగా నా అధికార వాహనాన్ని డ్రైవ్ చేసుకుంటూ వెళుతుంటే అక్కడున్న ఆడవాళ్లంతా చప్పట్లు కొట్టారు. ఎందుకు అలా? అని అడిగాను. ఇప్పటివరకు భార్యను పక్కన కూర్చోబెట్టుకొని అధికార వాహనాన్ని నడుపుకుంటూ వెళ్లిన మేల్ ఆఫీసర్లనే చూశాం. కాని ఇప్పుడు ఒక మహిళ దర్పంగా అధికార వాహనాన్ని నడుపుకుంటూ వెళ్తుంటే గర్వంగా అనిపించి చప్పట్లు కొట్టాం అని చెప్పారు. అప్పుడు ఆ ప్రత్యేకత తెలిసింది నాకు'' అంటూ తను ఎప్పటికీ మరిచిపోలేని విషయాలను పంచుకున్నారు.

పద్మావతి భర్త ఎస్.ఎన్.బందోపాధ్యాయ కూడా ఎయిర్‌ఫోర్స్‌లోనే సేవలందించారు. 1971 పాకిస్తాన్ యుద్ధం తర్వాత ఈ ఇద్దరికీ ఒకే రోజున విశిష్ట సేవా పురస్కారం లభించింది. భార్యభర్తలిద్దరూ ఒకేసారి.. ఒకే రోజున ఇలా మెడల్ తీసుకోవడం ప్రపంచ సైనికచరిత్రలోనే లేదు. అదీ రికార్డే.

'నాకు మా నాన్న, నా భర్త.. ఇద్దరూ స్ఫూర్తే. వీళ్లిద్దరూ ఆడ, మగ ఇద్దరూ సమానమని నమ్మారు కాబట్టే నేను ఈ రోజు దేశానికి తెలిశాను' అంటారు పద్మావతి.

'పనికి ఆడ, మగ వ్యత్యాసం ఉండదు. సామర్థ్యమే ప్రధానం. ఏ స్త్రీ అబల కాదు. మహిళ నిర్ణయాధికారమే సాధికారత. చదువుతోనే అది సాధ్యమవుతుంది' అని చెప్తారు పద్మావతి.

మత సామరస్యం

నేను దక్షిణ భారతదేశంలో పుట్టి ఢిల్లీలో పెరిగాను. మా ఆయన వాళ్లది ఉత్తర ప్రదేశ్‌లో స్థిరపడ్డ బెంగాలీ కుటుంబం. మేం పెళ్లిచేసుకున్నాం. కులం, మతం, ప్రాంతం ప్రాతిపాదికగా కాదు. భారతీయత ప్రాతిపాదికగా. కులం, మతం, ప్రాంతంతో గొడవలెందుకు? అందరం భారతీయులమే. ఈ సందర్భంగా నా చిన్నప్పటి సంఘటన ఒకటి చెప్తాను. దేశ విభజనప్పుడు జరిగిన మత కల్లోలాల సమయంలో మేము లోధీ మార్గ్‌లో ఉండేవాళ్లం. అది ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతం. ఆ టైమ్‌లో ఓ రెండు రోజులు మా పేరెంట్స్ నన్ను ఓ ముస్లిం ఇంట్లో ఉంచి వెళ్లారు. ఆ రెండు రోజులు నా పేరును ఫాతిమాగా మార్చి కంటికి రెప్పలా కాపాడుకుంది ఆ కుటుంబం. తర్వాత వాళ్లు పాకిస్తాన్ వెళ్లారో.. ఎక్కడికి వెళ్లారో.. వివరాలు తెలియలేదు. మానవత్వానికి ఇంతకుమించిన ఉదాహరణ ఏముంటుంది చెప్పండి?

– పద్మావతి బంధోపాధ్యాయ

చెట్టు నీడ

నరం లేని నాలుక

అతనొక వ్యాపారి. ఓమారు విదేశాలకు వెళ్ల వలసి వచ్చింది. రేప్పొద్దున్నే నాలుగున్నర కల్లా విమానాన్ని అందుకోవాలి. దాంతో కారు డ్రైవరుని తనింట్లోనే పడుకోమని చెప్పాడు. కానీ డ్రైవరు తాను కచ్చితంగా మూడు గంటలకన్నా ముందే వచ్చేస్తానని నమ్మకంగా చెప్పి ఇంటికెళ్ళిపోయాడు. అయితే గాఢమైన నిద్రతో అనుకున్న సమయానికి రాలేక ఆలస్యంగా రావడంతో అతన్ని మందలించాడు వ్యాపారి. 'అయ్యా! మీకెందుకు... సమయానికల్లా గమ్యస్థానానికి చేరుస్తాను' అని యజమానిని కూర్చోబెట్టి కారు తీశాడు. తీరా కొంచెం వెళ్ళేసరికి టైరు పంక్చరై కారు ఆగిపోయింది. అసలే చికాకులో ఉన్న వ్యాపారి అతనిపై రుసరుసలాడసాగాడు. ఇంతలో అటువైపుగా వచ్చిన ఓ యువకుడు, విషయం

ప్రతీకాత్మక చిత్రం

తెలుసుకుని తన వాహనం ఎక్కించుకుని సమయానికి వ్యాపారిని విమానం ఎక్కించాడు. అతన్ని వ్యాపారి తెగపొగుడుతాడు.

విమానం బయలుదేరింది. ఓ అరగంట ప్రయాణం తర్వాత ''సాంకేతికలోపం కారణంగా విమానాన్ని అత్యవసరంగా కిందకు దించడానికి ప్రయత్నిస్తున్నాం. దేనికైనా సిద్ధంగా ఉండండి...' అన్న ప్రకటనతో వ్యాపారి మనసు మారిపోయింది. తనను సమయానికి విమానాన్ని ఎక్కించిన యువకుడిని పొగిడిన వ్యాపారి 'ఛీఛీ, అనవసరంగా డ్రైవరుని తిట్టాను. నా ప్రయాణం వాయిదాపడటానికే దేవుడు నా డ్రైవరుని సమయానికి రాకుండా చేసాడేమో... అలాగే కారు టైరు పంక్చర్ అయ్యేలా చేసాడేమో. అది గ్రహించక అనవసరంగా డ్రైవరునీ, కారునీ తిట్టాను. ఇప్పుడు దురదృష్టం ఆ యువకుడి రూపంలో నన్ను వెంటాడింది కదా' అని తెగ గొణుక్కున్నాడు.

– యామిజాల జగదీశ్

క్యాన్సర్‌పై పోరు ఓ యుద్ధతంత్రం

Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

యుద్ధాన్ని గెలవాలంటే యుద్ధతంత్రాన్ని అనుసరించాలి. క్యాన్సర్‌పై పోరాటం కూడా యుద్ధమే. దానికీ ఓ తంత్రం కావాలి. స్టెమ్‌సెల్ థెరపీ, లైట్‌తో ఇచ్చే ఫోటో డైనమిక్ థెరపీలు, అతి వేడి లేదా అతి చల్లటి ఉష్ణోగ్రతలతో చేసే చికిత్సలు, మెట్రానమిక్స్ లాంటి కొత్త కొత్త ప్రక్రియలెన్నో ఉన్నా... మనందరికీ తెలిసినవి కీమో, రేడియేషన్, శస్త్రచికిత్స, టార్గెట్ థెరపీ, ఇమ్యూనోథెరపీ లాంటివి. ఈ ఐదింటిలోనూ దీన్నెప్పుడు, ఎలా, ఏ మోతాదులో వాడాలన్నదే 'చికిత్సాయుద్ధ(పంచ)తంత్ర'మనుకోవచ్చు. ఇక చిన్నప్పుడు పంచతంత్ర కథలను మనందరం చదివాం కదా. రాజుగారి కొడుకులకు తేలిగ్గా లోకరీతులపై అవగాహన కలిగించడం కోసం విష్ణుశర్మ రాసిందే పంచతంత్రం. క్యాన్సర్‌పై యుద్ధతంత్రాలను మనం కూడా అంతే తేలిగ్గా అచ్చం పంచతంత్ర కథల్లాగే సులువుగా, తేలిగ్గా తెలుసుకుందాం. అవే క్యాన్సర్-మిత్రలాభం, క్యాన్సర్-మిత్రభేదం, క్యాన్సర్- సంధి, విగ్రహానికి బదులుగా నిగ్రహం కథలు. ఇక చదవండి. అవగాహన పెంచుకోండి.

క్యాన్సర్ - మిత్రలాభం

లేడిని తినే ఉద్దేశంతో ఓ నక్క దాంతో స్నేహం చేసింది. ఓనాడు లేడి దగ్గరికి వెళ్లి ''దగ్గర్లోని ఓ రైతు పొలంలో రుచికరమైన పచ్చగడ్డి ఉంది. తిందువుగానీ రా'' అంది. ముందుగా లేడి కాస్త సందేహించినా పచ్చగడ్డి మీద ఆశతో వెళ్లి, అక్కడ రైతు పన్నిన వలలో చిక్కుకుంది. రైతు వచ్చి లేడిని చంపి పారేస్తాడనీ... అప్పుడు దాని మాంసం తాను తినొచ్చని నక్క వేచిచూస్తోంది. తన మిత్రుడైన లేడి కనిపించడం లేదని వెతుకుతూ దాని స్నేహితుడైన కాకి అక్కడికి వచ్చి, పరిస్థితి గ్రహించింది. 'నువ్వు చచ్చిపడినట్టు నటించు. రైతును నమ్మించడానికి నేను నా ముక్కుతో నిన్ను పొడుస్తున్నట్టు నటిస్తాను. రైతు వల తొలగించగానే పారిపో' అని ఉపాయం చెప్పింది. ఆ ప్రకారం... లేడి తప్పించుకుంది.

ఇప్పుడు మనం ఓ క్యాన్సర్ కథ చెప్పుకుందాం. అది కూడా అచ్చం పై కథలాగే ఉంటుంది. ఓ చిన్నారికి బ్లడ్‌క్యాన్సర్ సోకింది. అంటే... పాత తెల్లరక్తకణాలు పూర్తిగా చనిపోక ముందే కొత్తవి పుట్టుకొస్తూ... రక్తం తన పని తాను చేయకుండా అడ్డుపడటమే ఈ బ్లడ్ క్యాన్సర్. ఇలా క్రమపద్ధతిలో కాకుండా తెల్లరక్తకణాలు అదేపనిగా పుట్టడానికి కారణం టైరోసిన్ కైనేజ్ అనే ఓ రసాయనం. అదిలా అడ్డదిడ్డంగా, అదేపనిగా రక్తంలోని తెల్లరక్తకణాలు పుట్టడానికి దోహదపడుతుంది. ఏదైనా ఉపాయంతో ఆ టైరోసిస్ కైనేజ్‌ను ఆపేస్తే? అప్పుడు తెల్లరక్తకణాలు పుట్టడమూ ఆగిపోతుంది. దాంతో రోగి ఎప్పటిలాగే ఆరోగ్యంగా, మామూలుగా ఉంటాడు. మన ఈ కథలో రోగి ... ఓ లేడిలాంటి చిన్నారి. టైరోసిస్ కైనేజ్ నక్క. తెల్లరక్తకణాలు పుట్టేలా చేసే అంశం రైతు. టార్గెట్ థెరపీలో ఇచ్చే 'ఇమాటనిబ్' లాంటి కొన్ని మందులు కాకిలాంటివి. ఇప్పుడు ఇమాటనిబ్ లాంటి ఆ మందులు లేడిలాంటి చిన్నారిలోకి ప్రవేశించి, టైరోసిస్ కైనేజ్ నక్కను, ఆ మాటకొస్తే రైతునూ కన్‌ఫ్యూజ్ చేస్తాయి. దాంతో ఇష్టమొచ్చిన రీతిలో, ఓ క్రమపద్ధతి లేకుండా తెల్ల రక్తకణాలను పుట్టించే ప్రక్రియ ఆగుతుంది. దాంతో చిన్నారి లేడికి లేచిందే పరుగులా పరుగెడుతూ మునపటిలాగే ఆరోగ్యంగా ఉంటుంది.

మరో కథ చూద్దామా!

ఒక చోట ధాన్యపు గింజలు చెల్లాచెదురుగా ఉండటం కొన్ని పావురాలు చూశాయి. అక్కడ పరచి ఉన్న వలను చూడకుండా చిక్కుకుపోయాయి. అవన్నీ ఓ ఉపాయం ఆలోచించాయి. సమష్టిగా ఎగిరిపోయి... ఓ ఎలుక సహాయంతో తమ

వలను ఛేదించుకున్నాయి. అంటే... ఇక్కడ పనికి వచ్చింది పావురాలూ-ఎలుకల మిత్రత్వం. అలాగే క్యాన్సర్‌ను ఎదుర్కోవాలంటే కొన్నింటితో స్నేహం చేయాలి. ముందుగా మనం స్నేహం చేయాల్సింది ఆరోగ్యకరమైన జీవనశైలితో, మంచి అలవాట్లతో. యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే కూరగాయలూ, తాజాపండ్ల వంటివి తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటివి చేస్తే... అవి రోగమనే వలను ఎలకల్లా కొరికేస్తాయి.

అటు తర్వాత ముందుగానే క్యాన్సర్‌ను తెలుసుకునే కొన్ని వైద్యపరీక్షలతోనూ మిత్రత్వం వహించాలి. మరో ముఖ్యమైన అంశమైన కుటుంబసభ్యుల తోడ్పాటూ, ఇంకో అంశమైన డాక్టర్ సహాయంతో క్రమం తప్పకుండా తీసుకునే చికిత్స ప్రక్రియలూ... వీటన్నింటి సహాయంతో రోగి ధైర్యం చిక్కబట్టుకుని పావురాల్లా ఎగిరితే... మందులూ, రేడియేషన్, సర్జరీ వంటి ప్రక్రియలు మూషిక మిత్రుల్లా జబ్బును కొరికి పేషెంట్‌ను రోగవిముక్తం చేస్తాయి.

అలాగే రోగి మరికొన్ని చికిత్స ప్రక్రియలతోనూ క్రమం తప్పకుండా స్నేహం చేయాలి. అవే... ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, బయాప్సీ వంటి పరీక్షలు. కొన్ని లక్షణాలు కనిపించినప్పుడు ఈ పరీక్షలతో వ్యాధిని అనుమానించాక... మరికొన్ని నిర్ధారణ పరీక్షలనూ చేయించాలి. అవే... నిర్దిష్టమైన కొన్ని రక్తపరీక్షలు, మల, మూత్రపరీక్షలు, సీటీ స్కాన్, పెట్ స్కాన్, ఎమ్మారై వంటివి చేస్తారు. సీటీస్కాన్, ఎమ్మారై పరీక్షలు కణితి ఉన్న ప్రదేశాన్ని, దాని పరిమాణాన్ని నిర్ధారణ చేయడానికి ఉపయోగపడే పరీక్షలు. ఇలాంటి పరీక్షలతో క్యాన్సర్ రోగి ఎప్పుడూ స్నేహం వహించి ఉండి, క్రమం తప్పకుండా చేయించుకుంటూ ఉంటే... వ్యాధి తగ్గాక కూడా తిరగబెట్టకుండా చూసుకుంటూ జీవితాంతం హాయిగా, అసలు ఒకప్పుడు వ్యాధి వచ్చిన దాఖలా కూడా లేకుండా పూర్తిగా నార్మల్ వ్యక్తిలాగే ఉండవచ్చు.

క్యాన్సర్ - మిత్రభేదం

ఓ దేశంలో శ్వేతకాష్టుడూ... మద్యముడూ అనే ఇద్దరు ఫ్రెండ్స్ ఉంటారు. శ్వేతకాష్టుడు పైకి తెల్లగా, అందంగా ఉంటాడు. నెత్తిచివర కాష్టంలా మండుతూ ఉంటాడు. ఇలా తెల్లగానూ, మండుతూనే ఉండటం వల్ల వాడికి శ్వేతకాష్టుడు అలియాస్ సిగరెట్టుడు అనే పేరూ ఉంది. వీడికీ ఫ్రెండ్స్ చాలామందే ఉంటారు. చుట్టా, బీడీ, జర్దా, ఖైనీ, గుట్కా, ముక్కుపొడి వీళ్లంతా శ్వేతకాష్టుడి క్లోజ్ ఫ్రెండ్స్. ఇక మద్యముడు కూడా బంగారు రంగున్న పానీయరూపంలోనే గాక రకరకాల రంగుల్లో ఆకర్షణీయంగా ఉంటాడు. ఈ ఇద్దరు మిత్రులంతా దేశంలోని ప్రజల దగ్గరికిపోయి... 'మిత్రులారా... మీరు స్ట్రెస్సాసురుడూ, టెన్షనుడు అనే రాక్షసుల బారిన పడి నలిగిపోతున్నారు. మమ్మల్ని ఆశ్రయించి... మీరు వారి నుంచి దూరం కావచ్చ'ని చెబుతుంటారు. అలా సదరు స్ట్రెస్సాసురుడూ, టెన్షనుల పీడవిరగడ చేస్తామంటూ...వీళ్లంతా ఆ దేశ అమాయక ప్రజల్ని క్యాన్సరాసురుడికి ఆహారంగా పంపుతుంటారు. అందుకే స్ట్రెస్సాసుర, టెన్షనులను వదిలించుకోవడం కోసం ఈ శ్వేతకాష్టుడు, మద్యములనే ఈ చెడుమిత్రుల స్నేహం నుంచి రక్షించుకోవాలి. ఇందుకోసం మనం రిలాక్సేషన్ ప్రక్రియలూ, యోగా వంటి మంచి మిత్రుల సహాయంతో మిత్రుల రూపంలోని ఆ శత్రువులకు దూరంగా ఉండాలని చెప్పే కథే... క్యాన్సర్-మిత్రభేదం చెప్పే మాట.

క్యాన్సర్ - సంధి



ఇక్కడ మన 'క్యాన్సర్ సంధి' గురించి కాస్త నేరుగానే తెలుసుకుందాం. కొన్ని క్యాన్సర్లలో అవి వచ్చాక పోరాటం చేయడం కంటే... అవి రాకముందే మనలోని కణాలను కొన్ని రకాల వ్యాక్సిన్లతో సంధి చేసుకునేలా చూడాలి. ఉదాహరణకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)కు కారణం మనకు కచ్చితంగా తెలుసు. అది హెచ్‌పీవీ అనే వైరస్‌తో వస్తుంది. అది రాకుండా అమ్మాయిలకు ఓ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. అమ్మాయిలందరూ ఆ వ్యాక్సిన్‌తో సంధి చేసుకోవాలి. అదెలాగంటే... తొమ్మిదేళ్ల వయసు నుంచి పెళ్లికాని అమ్మాయిలందరూ (అంటే శృంగార జీవితం ప్రారంభం కాకముందు) ఈ వ్యాక్సిన్ తీసుకుంటే ఈ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఈ వ్యాక్సిన్ అండాశయం, గొంతుక్యాన్సర్లు రాకుండా కూడా చేసే అవకాశముందనీ, 40 ఏళ్లు వచ్చే వరకు మహిళలు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చని డాక్టర్స్ సలహా ఇస్తుంటారు. అలాగే హెపటైటిస్-బి వస్తే... అది భవిష్యత్తులో కాలేయ క్యాన్సర్‌కు దారితీయవచ్చు. హెపటైటిస్-బి వైరస్ సోకకుండా వ్యాక్సిన్లు కూడా మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిని వేయించుకోవడం ద్వారా కాలేయ క్యాన్సర్‌ను నివారించుకోవచ్చు. ఇలా మనం సర్విక్స్, కాలేయ క్యాన్సర్‌లను నివారించడానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్, హెపటైటిస్ వ్యాక్సిన్‌లతో సంధి చేసుకోవడం ద్వారా... ఆ క్యాన్సర్లను నివారించుకోవచ్చు. ఇలాగే మనం సంధి చేసుకోవడం కోసం మరిన్ని వ్యాక్సిన్లను రూపొందించడానికి ప్రపంచవ్యాప్తంగా మన విజ్ఞానవేత్తలూ, వైద్యశాస్త్రజ్ఞులు ఇంకా పరిశోధనలు చేస్తున్నారు.

విగ్రహానికి బదులు నిగ్రహం...

పంచతంత్రంలోని విగ్రహానికి బదులు మనం 'నిగ్రహం' అనే మరో అంశాన్ని తెలుసుకుందాం. మనం కొన్ని అంశాల పట్ల నిగ్రహం పాటించాలి. ఉదాహరణకు పిజ్జాలు, బర్గర్‌లలాంటి బేకరీ ఐటమ్స్. ఇవన్నీ చాలా త్వరత్వరగా, రుచిగా తమను తినేయవచ్చంటూ మనల్ని ఊరిస్తుంటాయి. మరికొన్ని ఆహారాల్లోని కలరేటివ్స్ అనే ఆకర్షణీయమైన, అందమైన రంగులు మన కంటిని కట్టిపడేస్తుంటాయి. అప్పటికప్పుడు టెంప్ట్ అయి తినేసేలా మనల్ని ఆకర్షిస్తుంటాయి. ఇంకొన్ని ఆహారాలైతే రుచికరంగా ఉండేందుకూ, చాలాకాలం పాటు నిల్వ ఉండేందుకు కృత్రిమ నెయ్యి, ప్రిజర్వేటివ్స్ రూపంలో రారమ్మని పిలుస్తుంటాయి. అందుకే వాటి నుంచి నిగ్రహం పాటించాలి. మన ఈ పంచతంత్రలోని 'నిగ్రహం' శీర్షికలో మనం తెలుసుకోవాల్సిన అంశాలివి.

ఇలా ఈ తంత్రాలన్నింటి మనల్ని క్యాన్సర్‌ను దూరంగా ఉంచుతాయి. ఒకవేళ ఇన్ని జాగ్రత్తలూ పాటించినా, క్రమం తప్పకుండా క్యాన్సర్‌ను నివారించే మిత్రులకు దగ్గరగా ఉండి, క్యాన్సర్ కలిగించే వాటిని దూరంగా ఉండి, క్యాన్సర్ వ్యాక్సిన్ల సహాయంతో సంధి చేసుకుని, నిగ్రహం గా క్యాన్సర్‌ను కలగజేసే ఎన్నింటినుంచో దూరంగా ఉన్నప్పటికీ ఒక్కోసారి క్యాన్సర్ రావచ్చు. దురదృష్టవశాత్తూ అలా ఎవరికైనా వ్యాధి వచ్చినా... ఆందోళన పడకుండా మానసిక స్థైర్యం, ధైర్యం కలిగి, చికిత్స చేయించుకుని నిండునూరేళ్లూ జీవించడానికి తోడ్పడే తారకమంత్రాలే పైన చెప్పిన పంచతంత్రాల్లాంటి క్యాన్సర్ యుద్ధతంత్రాలు.

epaper.sakshi.com

అర్థమవుతోంది!

రష్మికా మందన్నా

'మీకు అర్థమవుతుందా' అంటూ 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో రష్మికా మందన్నా తెగ సందడి చేసింది. 'ఛలో'తో తెలుగు తెరపై కనిపించినప్పుడే ఈ కన్నడ బ్యూటీ ఇక్కడ టాప్ హీరోయిన్లలో ఒకటి అవుతుందని చాలామందికి అర్థమైంది. గీత గోవిందం, దేవదాస్, డియర్ కామ్రేడ్.. ఇలా వరుసగా సినిమాలు చేస్తూ మహేశ్‌తో చేసిన 'సరిలేరు నీకెవ్వరు'తో టాప్ లీగ్‌లోకి వెళ్లిపోయింది రష్మికా. నెక్స్ట్ అల్లు అర్జున్ సరసన కూడా సినిమా చేయబోతోంది. ప్రస్తుతం నితిన్‌తో 'భీష్మ' సినిమాలో నటిస్తోంది. ఇలా తెలుగులో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న రష్మికా ఈ ఏడాది తమిళ తెరకు కూడా పరిచయం కాబోతోంది. కార్తీ సరసన 'సుల్తాన్' అనే సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణలో ఉండగానే సూర్య సరసన ఓ సినిమాలో నటించే చాన్స్ కొట్టేసిందని టాక్. సూర్యతో 'సింగమ్' వంటి హిట్ సిరీస్ తీసిన హరి దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలో రష్మికా నటించనుందట. ఇటు తెలుగులో స్టార్ హీరోలతో చేస్తూ దూసుకెళుతోన్న రష్మికా అటు తమిళంలోనూ ఆ దూకుడు మీదే ఉన్నారని అర్థమవుతోంది కదూ.

శర్వానంద్, సమంత జంటగా నటించిన చిత్రం 'జాను'. తమిళంలో విజయవంతమైన '96' చిత్రానికి రీమేక్ ఇది. తమిళ సినిమాకి దర్శకత్వం వహించిన సి. ప్రేమ్‌కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'దిల్' రాజు విలేకరులతో మాట్లాడారు.

స్ట్రయిట్ సినిమా చేయడం ఈజీ

'దిల్' రాజు

- నేను నిర్మాతగా చేసిన మొదటి సినిమా నుండి స్క్రిప్ట్‌తో పాటు ట్రావెల్ చేయటం అలవాటు. అందుకే రీమేక్ చిత్రాలు తీయలేదు. అది మాత్రమే కాదు స్ట్రయిట్ సినిమా చేయటం ఈజీ. మధ్యలో 'ప్రేమమ్', 'బెంగుళూర్ డేస్' సినిమాలు చూసినప్పుడు ఎగ్జయిట్ అయ్యాను. 'బెంగుళూర్ డేస్' సినిమాకి చాలా వర్కవుట్ చేసి హీరోలుగా నాని, శర్వానంద్‌లను అనుకున్నాను. తర్వాత మూడో హీరో విషయంలో శాటిస్‌ఫై అవ్వలేదు. డ్రాప్ అయ్యాను. 'ప్రేమమ్' సినిమా చేద్దాం అనుకున్నప్పుడు సితార ఎంటర్‌టైన్‌మెంట్ నాగ వంశీ 'అన్నా.. ఈ సినిమాని నేను రీమేక్ చేస్తాను' అన్నాడు. 'సరే' అన్నాను.
- అనుకోకుండా ఈ ఏడాది మూడు రీమేక్ సినిమాలు చేస్తున్నాను. '96' తమిళ చిత్రాన్ని 'జాను' పేరుతో చేశాను. నాని హీరోగా తెలుగులో విజయం సాధించిన 'జెర్సీ' చిత్రాన్ని షాహిద్ కపూర్‌తో హిందీలో రీమేక్ చేస్తున్నా. బాలీవుడ్‌లో నిర్మాతగా నాకిది ఫస్ట్ సినిమా. అలాగే హిందీ 'పింక్'ను తెలుగులో పవన్ కల్యాణ్ హీరోగా చేస్తున్నాను. ఈ సినిమాను మే 15న రిలీజ్ చేయాలనుకుంటున్నాం.
- 'జాను' సినిమా విషయానికొస్తే '96' సినిమా ట్రైలర్ చూడగానే ఆసక్తిగా అనిపించింది. అప్పటినుండి దాన్ని ఫాలో అవుతూ వచ్చాను. నాకు తమిళ్ పెద్దగా అర్థం కాకపోయినా సినిమా టచ్ చేసింది. ఈ సినిమాలో అద్భుతమైన సన్నివేశాలతో పాటు చిన్నప్పటి ఫ్రెండ్స్, రీయూనియన్ అనగానే పాత రోజులకు వెళ్లిపోతాం. జనరల్‌గా పదో తరగతి ప్రేమలు సక్సెస్ కావు. ఈ సినిమాలోనూ అంతే. ఈ పాయింట్ తెలుగు ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుంది.
- అల్లు అర్జున్‌తో మేం చేసిన 'ఆర్య' సినిమాకి ఈ చిత్రదర్శకుడు ప్రేమ్‌కుమార్ అసిస్టెంట్ కెమెరామేన్‌గా చేశాడట. మాకు గుర్తు లేదు. '96' చూడ్డానికి కెమెరామేన్ విజయ్ చక్రవర్తితో వెళ్లినప్పుడు తను ఆ విషయం నాకు చెప్పాడు. మీకు ఆసక్తి ఉంటే తెలుగులో కూడా మీరే డైరెక్ట్ చెయ్యండని ప్రేమ్‌తో అంటే, సరే అన్నారు. తెలుగు ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ కథలో చిన్న మార్పులు చేశాం.
- నేను ఈ సినిమా చూస్తున్నప్పుడే త్రిష ప్లేస్‌లో సమంతను ఊహించుకున్నాను. ముందు సమంత ఈ సినిమాలో నటించటానికి భయపడింది. షూటింగ్ స్టార్ట్ అయిన రెండు రోజుల తర్వాత ప్రతి రోజూ మేజిక్ జరుగుతోంది, మీరు నన్ను ఒప్పించకుంటే మంచి సినిమా మిస్ అయ్యేదాన్ని అని మెసేజ్ పెట్టింది.
- విజయ్ సేతుపతి '96'లో అద్భుతంగా నటించాడు. అతనిలాంటి హీరో దొరుకుతాడా అనుకున్నాను కానీ, ఈ కథను ఓన్ చేసుకొని శర్వానంద్ అద్భుతంగా బ్యాలెన్స్ చేశాడని ప్రేమ్‌కుమార్ అన్నాడు.
- మా బేనర్‌లో నెక్స్ట్ మహేశ్‌బాబు హీరోగా సినిమా ఉంటుంది. దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నారు.

జనవరి 31.. ప్రేమికుల దినోత్సవం!

ప్రేమికుల దినోత్సవం ఎప్పుడంటే.. 'ఫిబ్రవరి 14' అని ఎవరైనా చెబుతారు. మరి.. జనవరి 31 అన్నారేంటి అనుకుంటున్నారా? కమల్ హాసన్‌కి మాత్రం ప్రేమికుల దినోత్సవం అంటే జనవరి 31. ఎందుకు అలా అంటున్నారంటే.. తన స్కూల్ మేట్స్‌ని ఆయన ఆ రోజునే కలుసుకున్నారు. చెన్నైలోని 'సార్ ఎం.సి.డి. ముత్తయ్య చెట్టియార్ బాయ్స్ హయర్ సెకండరీ స్కూల్'లో కమల్ చదువుకున్నారు. ఇటీవల రీయూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. కమల్ తన స్నేహితులందరినీ


కమల్‌హాసన్

క్లాస్‌మేట్స్‌తో కమల్‌హాసన్

కలిశారు. ఆ ఫొటోను షేర్ చేసి, ''జనవరి 31ని నేను 'లవర్స్ డే' అంటాను. ఎందుకంటే మా బ్యాచ్‌లో స్నేహాన్ని, లక్ష్యాలను, జ్ఞానాన్ని, దేవుళ్లను, విద్యను.. ఇలా పలు అంశాలను ప్రేమించేవాళ్లు ఉన్నారు. నేర్చుకోవడానికి హద్దు అంటూ ఏదీ లేదు. మనం (స్నేహితులను ఉద్దేశించి) ఇంకా నేర్చుకుంటూనే ఉందాం. మిమ్మల్ని కలవడం నాకెంతో ఆనందాన్నిచ్చింది'' అని పేర్కొన్నారు.

బాక్సింగ్‌కి రెడీ

వరుణ్‌తేజ్

బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టడానికి సిద్ధమయ్యారు వరుణ్‌తేజ్. ప్రత్యర్థితో ఫైట్ చేయడానికి కావాల్సిన శిక్షణను కూడా దాదాపు ముగించారట. వరుణ్‌తేజ్ హీరోగా నూతన దర్శకుడు కిరణ్ కొర్రపాటి బాక్సింగ్ నేపథ్యంలో ఓ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇందులో బాక్సర్‌గా వరుణ్‌తేజ్ కనిపిస్తారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల రెండోవారం నుంచి వైజాగ్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఇందులో వరుణ్ తేజ్ తల్లి పాత్రలో రమ్యకృష్ణ కనిపించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ఈ సినిమాను అల్లు బాబీ, సిద్ధూ ముద్ద నిర్మిస్తున్నారు.

నాకు హీరోలకన్నా విలన్స్ అంటేనే ఇష్టం

- రామ్‌గోపాల్ వర్మ

జీవా, రామ్‌గోపాల్ వర్మ, నట్టి క్రాంతి, శివ బాలాజీ, మధుమిత, నట్టి కరుణ, నట్టి కుమార్

''స్టాలిన్ అనేది నా ఫేవరెట్ పేరు. స్టాలిన్ రష్యన్ నియంత. 'స్టాలిన్' పేరుతో చిరంజీవి గారు సినిమా చేశారు. మళ్లీ చాలా సంవత్సరాల తర్వాత 'స్టాలిన్' అనే పేరుని వింటున్నాను. ఈ చిత్రం ట్రైలర్ చాలా బావుంది'' అని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అన్నారు. జీవా, రియా సుమన్, నవదీప్ ముఖ్య పాత్రల్లో రతిన శివ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'సీరు'. తెలుగులో 'స్టాలిన్' టైటిల్‌తో వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్, నట్టిస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, క్విట్టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు ఫిబ్రవరి 7న విడుదల చేస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ – ''జీవా చాలా ఈజ్‌తో నటించాడు. ఇందులో నవదీప్ లుక్ (నవదీప్‌ది విలన్ పాత్ర) విభిన్నంగా కనిపిస్తోంది. నాకు హీరోల కన్నా విలన్స్ అంటేనే ఇష్టం. దర్శకుడు సినిమాను బాగా హ్యాండిల్ చేశారు'' అన్నారు. ''జీవా తండ్రి ఆర్.బి. చౌదరిగారి బ్యానర్‌లో రాజశేఖర్‌గారు సింహరాశి, గోరింటాకు వంటి పెద్ద హిట్ సినిమాలు చేశారు. వాళ్ల నాన్నగారి పేరు నిలబెట్టాలని జీవా మంచి మంచి సినిమాలు చేస్తున్నాడు. 'రంగం' కంటే ఈ సినిమా ఇంకా పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు జీవితా రాజశేఖర్. ''మొదటి నుంచి తెలుగు ప్రేక్షకులతో నాకు మంచి అనుబంధం ఉంది. నన్ను 'రంగం' నుంచి సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. వర్మగారి సినిమాలంటే నాకు ఇష్టం. ఆయన దగ్గర డైరెక్షన్ నేర్చుకోవాలని అనుకున్నాను. త్వరలో స్ట్రయిట్ తెలుగు సినిమా చేయాలనుకుంటున్నాను'' అన్నారు జీవా. ''తెలుగు ప్రేక్షకులను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ సినిమా కథ రాశాను. మంచి సందేశం ఇవ్వబోతున్నాం'' అన్నారు రతిన శివ. ''తెలుగు ప్రేక్షకులకు తెలుగు, తమిళం అనే భేదాలు ఉండవు. అన్ని భాషల చిత్రాలను ఆదరిస్తారు. తొలిసారి ఇందులో పూర్తి స్థాయి విలన్ పాత్రలో నటించాను'' అన్నారు నవదీప్. ''నట్టి ఫ్యామిలీకి ఈ సినిమా మంచి విజయం తీసుకురావాలి'' అన్నారు టి. అంజయ్య. ''మంచి పాయింట్‌తో ఈ సినిమా తెరకెక్కింది. భారీ స్థాయిలో ఈ సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు నట్టికుమార్. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రియా సుమన్, నిర్మాతలు దామోదర ప్రసాద్, నట్టి కరుణ, నట్టి క్రాంతి, వేల్స్ శ్రవణ్, శివ బాలాజీ, మధుమిత పాల్గొన్నారు.

షకీలా కుటుంబ కథా చిత్రం

సంజయ్ వర్మ, గరిమా సింగ్

రొటీన్‌కు భిన్నంగా ఉంటుంది

సంజయ్ వర్మ, గరిమా సింగ్ హీరోహీరోయిన్లుగా సందీప్ చేగురి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఒక చిన్న విరామం'. 'బిగ్ బాస్' ఫేమ్ పునర్నవి భూపాళం, నవీన్ నేని ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ – ''థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ సినిమా రొటీన్ సినిమాలకు భిన్నంగా ఉంటుంది. అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు. ''సినిమా బాగా వచ్చింది. ఈ సీజన్‌లో రిలీజ్ అయ్యే సినిమాల్లో మా సినిమా భిన్నంగా ఉంటుంది'' అన్నారు సందీప్ చేగురి. ''కథలో ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను. మంచి కాన్సెప్ట్‌తో వస్తున్నాం'' అన్నారు పునర్నవి. ఈ సినిమాకు సంగీతం: భరత్ మాచిరాజు, కెమెరా: రోహిత్ బెచు.

షకీలా

షకీలా ప్రధాన పాత్రలో విక్రాంత్, పల్లవి ఘోష్ జంటగా నటించిన చిత్రం 'షకీలా రాసిన మొట్టమొదటి కుటుంబ కథా చిత్రం'. 24 క్రాఫ్ట్స్ బ్యానర్‌పై సీవీ రెడ్డి సమర్పణలో సీహెచ్ వెంకట్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సాయి రాం దాసరి దర్శకత్వ పర్యవేక్షణలో సతీష్ వి.ఎన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫస్ట్ గ్లిమ్స్ సందర్భంగా షకీలా మాట్లాడుతూ– ''నేను నిర్మించిన 'లేడీస్ నాట్ ఎలౌడ్' సినిమా పది నెలలుగా సెన్సార్ అవ్వటం లేదు. ప్రస్తుతం ట్రిబ్యునల్‌లో ఉంది. షకీలా అంటే వల్గారిటీ సినిమాలేనా, ఫ్యామిలీ సినిమాలు చేయదా? అనే విమర్శలున్నాయి. అన్ని రకాల కథలను చేస్తానని నిరూపించటం కోసం కుటుంబ కథా చిత్రంగా ఈ సినిమా చేస్తున్నాను. ఇది ప్యూర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్'' అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు సతీష్ వి.ఎన్, హీరో విక్రాంత్, సినిమాటోగ్రాఫర్ కరామ్‌తోత్ పాల్గొన్నారు.

హిందీలో ఖైదీ

గత ఏడాది దీపావళికి థియేటర్స్‌లో లక్ష్మీ బాంబ్‌లా పేలిన చిత్రం 'ఖైదీ'. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కార్తీ హీరోగా నటించారు. హీరోయిన్, పాటలు లేకుండా తెరకెక్కిన ఈ సినిమా భారీ వసూళ్లు సాధించింది. తెలుగు, తమిళ భాషల్లో సూపర్ హిట్ అయింది. తాజాగా 'ఖైదీ' సినిమాను హిందీలో రీమేక్ చేయబోతున్నట్టు ప్రకటించారు చిత్రనిర్మాత యస్ఆర్ ప్రభు. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలసి ఈ హిందీ రీమేక్‌ను నిర్మించనున్నారాయన. 'ఖైదీ' హిందీ రీమేక్ డైరెక్టర్, యాక్టర్స్ వివరాలను ప్రకటించలేదు.

ప్రొడక్షన్ టు డైరక్షన్

విశ్వనాథ్

సస్పెన్స్ థ్రిల్లర్ 'యమ్ 6' చిత్రాన్ని నిర్మించిన విశ్వనాథ్ తన్నీరు దర్శకుడిగా మారారు. విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఓ సినిమాకి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తున్నారు కూడా. ''సినిమా మీద ప్యాషన్‌తో ఇండస్ట్రీకి వచ్చాను.'యమ్ 6'తో నిర్మాతగా మారాను. దర్శకుడిని కావాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. మంచి కథ కుదిరింది. ఈ సినిమా ద్వారా ఓ సందేశం కూడా ఇస్తున్నాం. 'యమ్ 6'లో హీరోగా నటించిన ధృవ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. హైదరాబాద్, వైజాగ్, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు విశ్వనాథ్ తన్నీరు. ''రెండోసారి కూడా అవకాశం ఇచ్చిన విశ్వనాథ్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు ధృవ.

మ్యాచ్ వాయిదా


అజయ్ దేవగన్

'మైదాన్' సినిమా కోసం బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ఫుట్‌బాల్ కోచ్‌గా మారారు. ఆయన కోచింగ్‌లో తయారైన టీమ్ ఆడాల్సిన మ్యాచ్ వాయిదా పడిందని తెలిసింది. అమిత్ రవీంద్రనాథ్ శర్మ దర్శకత్వంలో అజయ్ దేవగన్ నటిస్తున్న చిత్రం 'మైదాన్'. ఈ సినిమాలో ఇండియా ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ పాత్రను పోషిస్తున్నారు అజయ్. తొలుత ఈ సినిమాను నవంబర్ 27న రిలీజ్ చేయాలనుకున్నారు. ఇప్పుడు డిసెంబర్ 11న విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది చిత్రబృందం. ఇందులో అజయ్ భార్యగా ప్రియమణి నటిస్తున్నారు.

వీళ్లకి టీవీయే కరెక్ట్ అని మాత్రం అనుకోరు

''త్రీ మంకీస్' సినిమా టైటిల్‌కి తగ్గట్టే ఈ సినిమాలో నేను, సుధీర్, గెటప్ శ్రీను కోతి చేష్టలు చేస్తుంటాము'' అన్నారు రాంప్రసాద్. 'జబర్దస్త్' ఫేమ్ సుధీర్, గెటప్ శ్రీను, రాంప్రసాద్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'త్రీ మంకీస్'. జి. అనిల్ కుమార్ దర్శకత్వంలో జి. నగేశ్ నిర్మించారు. ఈ నెల 7న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ – ''ఇండస్ట్రీకి రావాలనే కోరిక ఎప్పటినుంచో ఉంది. గలగల మాట్లాడుతూ, పంచ్‌లు వేస్తుంటే చుట్టుపక్కల వాళ్లు 'నువ్వు ఇండస్ట్రీలో ఉండాల్సినవాడివి' అనేవారు. దాంతో లగేజ్ సర్దుకుని హైదరాబాద్ వచ్చేశాను (నవ్వుతూ). కానీ ఇక్కడ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. ఎంతో స్ట్రగులయ్యాక 'జబర్దస్త్' టీవీ షో మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ షో ద్వారా 'ఆటో రాంప్రసాద్'గా పాపులరయ్యాను. 'త్రీ మంకీస్' కథ నచ్చి మేం సినిమా చేయాలనుకున్నాం. సరదాగా సాగిపోయే ముగ్గురు స్నేహితులకు ఒక సమస్య ఎదురవుతుంది. అందులో నుంచి ఎలా బయటపడ్డారు అన్నది కథాంశం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులను కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తాం. 'త్రీ మంకీస్' చూసి వీళ్లకి టీవీయే కరెక్ట్ అని మాత్రం అనుకోరని చెప్పగలను. టీవీని, సినిమాను బ్యాలెన్స్ చేస్తూ పని చేయాలనుకుంటున్నాను. దర్శకత్వం చేసే ఆలోచనలు కూడా ఉన్నాయి'' అన్నారు.

రాంప్రసాద్

సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 4-2-2020

సేంద్రియ వ్యవసాయం మనల్ని ప్రకృతికి తిరిగి చేరువ చేస్తుంది. మన రోజువారీ జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. మనల్ని వినియోగదారులుగానే కాక ఆహార ఉత్పత్తిలోకి తీసుకువస్తుంది.

– కీ.శే. వెంకట్, ప్రముఖ పర్మాకల్చరిస్టు

శ్రవణ కార్తె : ఫిబ్రవరి 5 వరకు ధనిష్ట కార్తె : ఫిబ్రవరి 6 నుంచి

కలిపి పంటలతోనే కలిమి!

రసాయనిక లేదా పారిశ్రామిక వ్యవసాయ విధానంలో ప్రధానంగా పొలం అంతా ఏదో ఒకే పంటను మాత్రమే పండించటం, అదే పొలంలో మళ్లీ మళ్లీ అవే పంట పండిస్తూ ఉండటం పరిపాటి అయ్యింది. జీవావరణపరంగా చూస్తే ఈ పంటల సాగు విధానం ప్రకృతికి వ్యతిరేకమైనది. ఫలితంగా ఈ పంటల విధానం వల్ల నేలలో పోషకాల లోపం, తెగుళ్లు, పురుగులు చెలరేగిపోవటం వంటి అనేక సమస్యలు రైతులకు ఎదురవుతాయి. ఇవి చాలా తీవ్రమైన సమస్యలు. రసాయనిక వ్యవసాయం సృష్టించే ఈ సమస్యలను పరిష్కరించటానికి ప్రకృతికి అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటల విధానం అవలంభించాల్సిన అవసరం ఉంది. పొలంలో ఒకే రకం పంట పండించకుండా.. కొన్ని రకాల పంటలను పక్కపక్కనే కలిపి పండించటం ఈ విధానంలో ముఖ్యమైన అంశం. ఇదే కలిపి పంటల సాగు (కంపానియన్ ప్లాంటేషన్). అయితే, ఒక పొలంలో ఏయే పంటలను పక్కపక్కనే సొళ్లుగా సాగు చేసుకోవచ్చు? అన్నది ఆసక్తికరమైన అంశం..

కంది (పప్పు జాతి) పంట మధ్యలో చిరుధాన్య (ధాన్యపు) పంట.. కలిపి పంటలకు ప్రబల ఉదాహరణ

సాగు భూముల్లో సూక్ష్మ పోషక పదార్థాల లోపం, పురుగుల సమస్యలకు మూలాలు సాగు పద్ధతిలో, పంటల సరళిలో ఉన్నాయి. రసాయనిక / పారిశ్రామిక వ్యవసాయం సృష్టించే ఈ సమస్యల పరిష్కారానికి విష రసాయనాలను విచ్చలవిడిగా వాడటమో మరొకటో పరిష్కారం కాదు. పొలంలో ఒకే పంట పండించటం మానుకోవడం తప్పనిసరి. సాంప్రదాయ, స్థానిక వ్యవసాయ పద్ధతులలో కొన్ని ప్రత్యామ్నాయాలను కనుగొనవచ్చు.ప్రకృతికి అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటల విధానాన్ని అనుసరించటమే ముఖ్యం.



పంటల మార్పిడి.. ఒక్కో సీజన్లో ఒక్కో పంట

ప్రత్యామ్నాయ పంటల విధానంలో మూడు ముఖ్యమైన అంశాలు ఇమిడి ఉంటాయి: 1. పంటల వైవిధ్యం 2. పంట మార్పిడి 3. మిశ్రమ పంటలు. నేలతల్లిని నమ్ముకొని వ్యవసాయమే వృత్తిగా జీవిస్తున్న రైతులు ఈ అంశాలను సరిగ్గా అర్థం చేసుకోవటం అవసరం.

పంటల వైవిధ్యం

ఒక భూమిలో సాధ్యమైనన్ని పంటలు, పంట రకాలు సాగు చేయాలి. దీనివల్ల పురుగుల సమస్య తగ్గుతుంది. మొత్తం పంట నష్టపోయే అవకాశం తగ్గుతుంది. పంటల వైవిధ్యం పాటించాలంటే భూమిని చిన్న మడులుగా చేసి.. పంటలు మారుస్తూ పండించాలి. ప్రతి మడిలోనూ ఒకసారి వేసిన పంటనే తిరిగి వెయ్యికూడదు.

పంట మార్పిడి

ఒకే భూమిలో పంటలను ఒకటి తరువాత ఒకటి మార్చి పండించటాన్ని పంట మార్పిడి అంటారు. దీని వల్ల భూమి సారం క్షీణించదు.

కలిపి పంటలు పండించేటప్పుడు గుర్తుంచుకోవలసిన అంశాలు:

- పోషకాలను తీసుకునే స్థాయి
- ధాన్యపు పంట, పప్పు జాతి పంట కలిపి సాగు చేస్తే భూసారాన్ని బాగా కాపాడుకోవచ్చు.
- ధాన్యపు పంటలు నేల నుంచి ఎక్కువ మోతాదులో పోషక పదార్థాలను తీసుకుంటాయి.
- పప్పుజాతి పంటలు నేల నుంచి తక్కువ పోషక పదార్థాలను తీసుకోవడమే కాకుండా నేలకు అదనంగా నత్రజనిని అందిస్తాయి.
- వేళ్ల లోతు
- లోతుగా పెరిగే వేళ్లు గల రెండు పంటలు పండిస్తే రెండింటికి మధ్య పోటీ ఏర్పడి సరిగా పెరగవు.
- అదేవిధంగా లోతు తక్కువగా పెరిగే వేళ్లు గల రెండు పంటలు కలిపి పండిస్తే అవి కూడా సరిగా పెరగవు.
- వేళ్లు లోతుగా పెరిగే పంటతో పాటు వేళ్లు తక్కువ లోతుకు పెరిగే పంటను సాగు చేయటం సరైన పద్ధతి.
- ఉదాహరణకు.. ఇంతకుముందు చెప్పుకున్న జొన్న, కంది. కంది మొక్క వేళ్లు బాగా లోతులకు వెళ్లి మట్టి లోపలి పొరలలోంచి పోషకాలను తీసుకుంటాయి.
- జొన్న వేళ్లు మట్టి పై పొరలలోంచి పోషకాలను తీసుకుంటాయి. ఈ రెండింటికి మధ్య పోటీ తక్కువగా ఉంటుంది.
- సాధారణంగా వేళ్ల లోతు తక్కువ గల పంటలు నిటారుగా పెరుగుతాయి. లోతు ఎక్కువగా గల పంటలు గుబురుగా పెరుగుతాయి.



పక్కపక్కనే మడుల్లో వేర్వేరు పంటలు

పురుగులను పారదోలే పంటలు

- ప్రత్యేకమైన వాసన కలిగి పురుగులను పారదోలే గుణమున్న కొన్ని పంటలు ఉన్నాయి.
- ఉదాహరణకు ఉల్లికి ఉన్న ప్రత్యేకమైన వాసనను సీతాకోకచిలుకలు ఇష్టపడవు. క్యాబేజీతో పాటు ఉల్లిపాయ కూడా కలిపి సాగుచేస్తే క్యాబేజిని ఆశించే పురుగులు తగ్గుతాయి.
- ఇలా ఉల్లిపాయ, క్యాబేజిలను కలిపి పండించటాన్ని సహపంటల విధానం అంటారు. పురుగులను నివారించటంలో ఈ సహపంటల విధానం బాగా పని చేస్తుంది.
- టమాటో/మిరప తోటల్లో బంతి మొక్కలు పెంచటం కూడా ఇందుకే. టమాటో, మిరప పంట మొక్కల వేర్లకు నులిపురుగుల బెడద ఎక్కువ. అయితే, బంతి మొక్కల వేర్లు మట్టిలోని సూక్ష్మజీవరాశి మనుగడ కోసం స్రవించే పోషక ద్రవాలు నులిపురుగులను సమర్థవంతంగా అరికట్టగలుగుతాయి. నులిపురుగుల సమస్య లేకపోతే టామాటో, మిరప పంటల దిగుబడి మరింత మెరుగ్గా ఉంటుంది,

నీడను తట్టుకోగలగటం

- కొన్ని పంటలు నీడలో బాగా పెరుగుతాయి. ఇటువంటి వాటిని నీడను ఇష్టపడే పంటలు అంటారు.
- ఈ పంటలను నీడ ఉన్న ప్రాంతంలో సాగు చేయడం ద్వారా నేలను బాగా ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు.. మామిడి తోటల్లో అల్లం సాగు.

ప్రకృతి వ్యవసాయం దృష్ట్యా పంటల వర్గీకరణ

ప్రకృతి వ్యవసాయం అనుసరించే రైతులు తగిన పంటల సాగు విధానాన్ని అనుసరించటానికి అసలు పంటల్లో ఎన్ని రకాలు ఉన్నాయో తెలుసుకోవాలి. అన్ని పంటలను వృక్షశాస్త్రపరంగా వర్గీకరించారుగానీ వాటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం రైతులకు లేదు. ప్రకృతి వ్యవసాయం దృష్ట్యా పంటల వర్గీకరణ విధానం గురించి తెలుసుకుందాం.

గింజ ధాన్యాలు (ఏక దళ పంటలు): వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ, కొర్ర మొదలైనవి. వీటిని ఏకదళ పంటల(మోనోకాట్స్) అని కూడా అంటారు. అంటే.. ఈ పంటల గింజ ఒక్కటిగానే ఉంటుంది, బద్దలు ఉండవు.

పప్పు ధాన్యాలు (ద్విదళ పంటలు): కంది, మినుము, పెసర, అలసంద, చిక్కుళ్లు, బఠాణి మొదలైనవి. వీటిని ద్విదళ పంటలు (డైకాట్స్) అని కూడా అంటారు. అంటే.. ఈ పంటల గింజలో రెండు బద్దలు ఉంటాయి.

ఆకుకూరలు : క్యాబేజి, కాలిఫ్లవర్, తోటకూర, బచ్చలికూర, పాలకూర మొదలైనవి.

వేరు పంటలు : ఆలుగడ్డలు, చికలడదుంపలు, కంద, చామ, ముల్లంగి, అల్లం మొదలైనవి.

కాయ చెట్లు : వంకాయ, టొమాటో, బెండకాయ, సొరకాయ, దోసకాయ మొదలైనవి.

సూక్ష్మ పోషక పదార్థాల లోపం ఏర్పడదు. పురుగులు, తెగుళ్లు సమస్యగా మారవు.

సరైన పంట మార్పిడిని అవలంబించటానికి ప్రతి ఒక్క పంట లక్షణాలనూ దృష్టిలోకి తీసుకోవాలి. ముఖ్యంగా దృష్టిలో ఉంచుకోవలసిన లక్షణాలు రెండున్నాయి.

1 మొదటి అంశం: భూమి నుంచి అధిక పోషక పదార్థాలను తొసుకునే పంట తరువాత తక్కువ పోషక పదార్థాలను తీసుకునే పంటను సాగు చేయటం మంచి పద్ధతి.

భూమి నుంచి పంట తీసుకునే పోషకాల స్థాయి (తక్కువ నుంచి ఎక్కువకి)

1. పప్పుజాతి పంటలు
2. దుంప జాతి పంటలు
3. ఆకు పంటలు
4. కాయ పంటలు
5. ధాన్యపు పంటలు

ధాన్యపు పంటలు అన్నిటికంటే ఎక్కువ పోషక పదార్థాలను భూమి నుంచి తీసుకుంటాయి. అన్నిటి కంటే తక్కువ పోషక పదార్థాలను పప్పుజాతి పంటలు తీసుకుంటాయి. అంతేకాదు పప్పుజాతి పంటలు నేలకు నత్రజనిని అందిస్తాయి. భూసారాన్ని కాపాడాలంటే పంటల మార్పిడిలో పప్పుజాతి పంటలను చేర్చాలి.



ధాన్యపు పంట మధ్యలో పప్పుజాతి పంట

2 దృష్టిలో ఉంచుకోవలసిన రెండో అంశం: చీడ, పీడలను నిరోధించే శక్తి. ఒక తెగులుగాని, పురుగాగానీ బాగా ఎక్కువైతే దానిని నిరోధించే పంటను (ఉదా: ధాన్యపు జాతి పంటను) సాగు చేయాలి.

చీడపీడలను తట్టుకునే శక్తి (ఎక్కువ నుంచి తక్కువకి)

1. ధాన్యపు పంటలు
2. దుంప పంటలు
3. పప్పుజాతి పంటలు
4. ఆకు పంటలు
5. కాయ పంటలు

చీడపీడలను ధాన్యపు పంటలు బాగా తట్టుకుంటాయి. కాయ పంటలు ఏమాత్రం తట్టుకోలేవు. ధాన్యపు పంటలు నేలను శుభ్రపరుస్తాయి. 'బాగు' చేస్తాయి. ఫలితంగా ఆ తరువాత చీడ, పీడల బాధ తక్కువగా ఉంటుంది. (గమనిక : ఇది కూరగాయలు పండించే నేలలకు మాత్రమే వర్తిస్తుంది. వరుసగా వరి మాదిరి ధాన్యపు పంటలు పండించే నేలలకు కాదు) కాబట్టి చీడ, పీడల సమస్యను తగ్గించాలంటే పంట మార్పిడిలో ధాన్యపు పంటలు చేర్చాలి.

మిశ్రమ పంటలు

ఇది పంటల వైవిధ్యతలో ఒక విధానం. ఇందులో ఒకే భూమిలో, ఒకే సమయంలో రకరకాల పంటలు పండిస్తారు. దీనినే 'కలిపి పంటలు' అని కూడా అంటారు. ఉదాహరణకు జొన్నతో పాటు కంది పండిచటం. జొన్న పొడవుగా ఉండి వేళ్లు పైపైనే ఉంటాయి. తొందరగా కోతకు వస్తుంది. ఇది ఎక్కువ పోషక పదార్థాలను నేల నుంచి తీసుకుంటుంది. కంది వేళ్లు భూమి లోతుల్లోకి వెళతాయి. తక్కువ పోషక పదార్థాలను తీసుకోవటమే కాక భూమికి నత్రజనిని అందిస్తుంది. జొన్న, కంది మధ్య ఎటువంటి పోటీ ఉండదు. కంది నేలకు అందించే నత్రజని జొన్న పంటలకు, ఆ తరువాత పంటలకు ఉపయోగపడుతుంది. కేవలం జొన్న లేదా కేవలం కంది పండించిన దానికంటే రెండూ కలిపి పండించి అధిక దిగుబడి సాధించవచ్చు. మిశ్రమ పంటల వల్ల నేల, సూర్యరశ్మి, వర్షపాతాన్ని బాగా వినియోగించుకోవటమే కాకుండా చీడ, పీడల సమస్యను తగ్గించుకోవచ్చు.

(జపాన్ రైతు శాస్త్రవేత్త షింపే మురాకామి రచించిన 'ప్రకృతి నేర్పిన పాఠాలు' పుస్తకం జీవావరణ వ్యవసాయానికి మార్గదర్శిని వంటిది. దీన్ని ఆంగ్లంలో 'పర్మనెంట్ గ్రీన్' ప్రచురించింది. కె.సురేష్ తెలుగులోకి అనువదించారు. 'మంచి పుస్తకం' ప్రచురించిన 'ప్రకృతి నేర్పిన పాఠాలు' సౌజన్యంతో..)

ఆ ఇల్లు.. పంటల పొదరిల్లు!

కాలుష్యం మధ్య జీవించే నగర జీవికి సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులోకి వస్తే ఆరోగ్యానికి కాసింత భరోసాగా ఉంటుంది. కానీ.. ఆర్గానిక్ పేరుతో బయట దొరికేవి అసలైనవో కాదో తెలీని అయోమయం. సమస్యలోనే పరిష్కారం ఉంటుందని నమ్మే ముత్యాల బాల కామేశ్వరరావు గత ఏడేళ్లుగా తమ ఇంటిపైనే సేంద్రియ ఇంటిపంటలు పండించుకుంటున్నారు. విశాఖ నగరంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం సమీపంలో నివసిస్తున్న కామేశ్వరరావు విశ్రాంత స్పెషల్ డిప్యూటీ

- **రాలిన ఆకులు, వంటింటి వ్యర్థాలతోనే ఎరువు తయారీ**
- **ఏడేళ్లుగా ఇంటిపంటల సాగులో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్**

కలెక్టర్ కావటం విశేషం. ఆయనకు ఆది నుంచీ మొక్కలంటే ప్రాణం. రిటైరైన తర్వాత ఏడేళ్లుగా మేడపైన ఖాళీలో సేంద్రియ కూరగాయలు, పూల మొక్కల పెంపకమే ముఖ్య వ్యాపకంగా మలచుకున్నారు.

ఆకులు అలములతోనే ఎరువు

మేడపై పండిస్తున్న పంటలను పూర్తిగా సేంద్రీయ పద్ధతిలోనే పెంచుతున్నారు కామేశ్వరరావు, రమాబాయి దంపతులు. మొక్కల నుంచి రాలిన ఆకులు, పూలు, కూరగాయల వ్యర్థాల వ్యర్థాలతోనే ఎరువును తయారు చేసి వాడుతున్నారు. పూలు, రాలిపోయిన ఆకులు, కూరగాయల వ్యర్థాలు, వాడేసిన టీ పొడి.. ఇలా ప్రతి వ్యర్థాన్ని ఎరువుగా మారుస్తుండటం విశేషం. మొక్కలకు పురుగు పట్టకుండా అల్లం, పచ్చిమిర్చి గ్రైండ్ చేసి పిచికారీ చేస్తుంటారు.

10 మొక్కలతో ప్రారంభమై..

10 మొక్కలతో ప్రారంభమైన ఆయన ఇంటి పంట.. ఇప్పుడు 220కి చేరుకుంది. పుదీనా, కొత్తిమీర, కరివేపాకు నిత్యం ఉంటాయి. అదే మాదిరిగా తోటకూర, పాలకూర, మెంతికూర, గోంగూర, చుక్కకూర, ముల్లంగి, ఉల్లికాడలు తదితర ఆకుకూరలను సాగు చేస్తున్నారు. వంకాయ, టమాటా, మునగ, కాలిఫ్లవర్, చిక్కుడు, మిరప, అల్లం, మామిడి అల్లం, రాయ్‌పూర్ బరబాటీ మొదలైన కూరగాయలు పండిస్తున్నారు. ఇలా అన్ని పంటలూ పండించుకుంటూ ఏడేళ్లుగా ఒక్క కూరగాయ, ఆకుకూర కూడా బయట కొనలేదని కామేశ్వరరావు చెబుతున్నారు. కామేశ్వరరావు పూలు, పండ్ల, ఔషధ మొక్కలు, బంతి, చేమంతి, బంతి, మల్లె, జాజిమల్లి, మందారం, ముద్దమందారం, ముద్ద బంతితో పాటు వివిధ రకాల క్రోటన్స్, డెకరేషన్ ఫ్లవర్స్, కాక్టస్ మొక్కలను కూడా పెంచుతున్నారు. జామ, నిమ్మ, నేరేడు, దానిమ్మ, కర్బూజా మొదలైన పండ్ల మొక్కల్నీ పెంచుతున్నారు. తులసి, వాము, లెమన్ గ్రాస్ వంటి ఔషధ మొక్కలూ ఆయన ఇంటిపంటలో ఉన్నాయి.

థర్మాకోల్ డబ్బాలు, వాటర్ క్యాన్లు, కారు టైర్లు.. కాదేదీ మొక్కలు పెంచేందుకు అనర్హమంటూ ప్రతి దాంట్లోనూ కామేశ్వరరావు చేపట్టిన మొక్కల పెంపకం చూస్తే ఔరా అనక మానరు. సిమెంట్, ప్లాస్టిక్, మట్టి కుండీల్లోనూ మొక్కలు పెంచుతూ టెర్రస్‌నే ఓ ఆహార వనంగా మార్చేసి నగరవాసులకు ఆదర్శంగా నిలుస్తున్నారు కామేశ్వరరావు, రమాబాయి దంపతులు.

– కరుకోల గోపీ కిశోర్ రాజా,
సాక్షి, విశాఖపట్నం
ఫొటోలు: పీఎల్ మోహన్‌రావు

ఏడేళ్లుగా మా ఇంటిపంటల్నే తింటున్నాం!

సేంద్రియ ఇంటి పంటల సాగుపై అందరూ అవగాహన పెంచుకోవాలి. మన ఇంటిలో ఉత్పత్తైన చెత్తను మనమే ఎరువుగా మార్చుకొని కూరగాయలు పెంచుకుంటే పర్యావరణానికి ఎంతో మేలు చేకూర్చినవారమవుతాం. భవిష్యత్తు తరాలకు ఆహార లభ్యత మరింత కష్టతరమైపోతుంది. అందుకే మన ఆహారాన్ని సాధ్యమైనంత వరకు మనమే పండించుకోవాలి. ఏడేళ్లుగా మేం పండించుకున్న కూరగాయలు, ఆకుకూరలే తింటున్నాం. పిల్లలకూ ఇంటిపంటల సాగు మెలకువలు నేర్పించాలి. పెద్దయ్యాక వాళ్లు మంచి ఆహారం కోసం బయటెక్కడో వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు.

– ముత్యాల బాల కామేశ్వరరావు
(99661 18236),
విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

రసాయనాలతో కలుషితమైన పాలతో ముప్పు

ప్రపంచంలోని 15% పశుసంపద మన దేశంలోనే ఉంది. ఇప్పటికి 99% రైతులు సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ, తమ పశువులను బయట మేపుదల చేయిస్తున్నారు. ఆధునిక నాగరికతకు చిహ్నంగా మేపు వనరులు తగ్గిపోతూ ఉండటం వలన, పశుగ్రాసాల సాగుకు ప్రాముఖ్యత వచ్చింది. పశుగ్రాసాల సాగులో కూడా రసాయనాలు వాడుతున్నారు. రసాయనాల వాడకం వల్ల రెండు నష్టాలు ఉన్నాయి: 1. నాణ్యత తగ్గిపోతుంది. 2. ముఖ్యంగా పప్పు జాతి పశుగ్రాసాల వేర్లకు బుడిపెలు ఉంటాయి. ఇందులో ఉన్న రైజోబియమ్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకొని మొక్కలకు అందిస్తుంది. రసాయనాల వాడకం వల్ల ఈ సామర్థ్యం నశిస్తుంది.

కీడు చేసే బ్యాక్టీరియా రసాయనిక ప్రక్రియ వలన పశుగ్రాసాలలో అఫ్లాటాక్సిన్స్, జీరాలినోన్స్, వామిటాక్సిన్స్ వంటి శిలీంధ్రాలు పెరుగుతాయి. అటువంటి పశుగ్రాసాన్ని మేస్తే పశువుల ఆరోగ్యం దెబ్బతింటుంది. శరీరంలోని ముఖ్య అవయవాలు పాడవటం, పశువుల ఉత్పాదకత తగ్గిపోవటం, ఎక్కువగా వ్యాధి బారిన పడటం వంటివి కూడా జరుగుతాయి.

- పశువుల శరీరంలోకి రసాయనాలు అనేక మార్గాల ద్వారా ప్రవేశిస్తాయి. బాహ్య పరాన్న జీవులను నియంత్రించడానికి రసాయనాలను పశువుల శరీరంపై పిచికారీ చేస్తారు. ప్రమాద వశాత్తూ వాటిని నాకడం వలన శరీరంలోకి ప్రవేశిస్తాయి.
- ముందుగానే రసాయనాలతో సాగైన దాణా పదార్థాల – పత్తి గింజల చెక్క, ధాన్యాలు, తవుడు, పప్పుదినుసులు, వాటి ఉప ఉత్పత్తుల – వాడకం ద్వారా రసాయనిక అవశేషాలు పశువు దేహంలోకి చేరుతాయి.

- స్థానిక మార్కెట్లలో లభ్యమైన కూరగాయల వృథా పదార్థాలను మేయడం ద్వారా రసాయనిక అవశేషాలు పశువు దేహంలోకి చేరుతాయి.
- శిలీంధ్రాలతో కలుషితమైన మేత తిన్న పశువుల పాలతో అప్రమత్తంగా ఉండాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం పాలలో శిలీంధ్రాలు 0.5 మైక్రోగ్రామ్స్ కన్నా ఎక్కువ ఉండకూడదు. భారతీయ ఆహార భద్రతా సంస్థ వారు నిర్వహించిన సర్వేలో చాలా పాల నమూనాలలో శిలీంధ్రాల మోతాదు ఎక్కువగా ఉన్నట్లు కనుగొన్నారు. ఇవి కాలేయాన్ని దెబ్బ తీస్తాయని, కేన్సర్‌కు కారణభూతమవుతాయి. పాలను ఎంతసేపు మరగబెట్టినా శిలీంధ్రాలు నాశనం కావు. అందుకే దీని నివారణకు పశుగ్రాసం, దాణా దినుసుల సాగులో రసాయనాలు వాడకుండా సేంద్రియంగా సాగు చేస్తే మేలు.

– డా. ఎం.వీ.ఏ.ఎన్. సూర్యనారాయణ
(99485 90506), ప్రొఫెసర్ అండ్ హెడ్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్,
కాలేజ్ ఆఫ్ వెటరినరీ సైన్స్, తిరుపతి

7-9 తేదీల్లో విశాఖ ఆర్గానిక్ మేళా

ఆం.ప్ర. ప్రభుత్వ ఉద్యాన శాఖ సహకారంతో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఈ నెల 7 నుంచి 9 వతేదీ వరకు విశాఖపట్నం యమ్.వి.పి.కాలనీలోని ఆళ్వార్‌దాస్ గ్రౌండ్ (ఎ.యస్.రాజాగ్రౌండ్స్)లో విశాఖ ఆర్గానిక్ మేళా నిర్వహించనుందని ఆహ్వాన సమితి కన్వీనర్ యుగంధర్, నేత కుమారస్వామి తెలిపారు. 7వ తేదీ ఉ. 10 గంటలకు రైతు సమ్మేళనం జరుగుతుంది. వేలాదిగా రైతులు పాల్గొనే ఈ సమ్మేళనంలో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, రసాయనాలు లేని ఆహారం ప్రాధాన్యంపై రైతు శాస్త్రవేత్తలు, శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పిస్తారు. 8వ తేదీ ఉ. 10 గంటలకు సేంద్రియ ఇంటిపంటలపై అవగాహన కల్పిస్తారు. 9వ తేదీ ఉ. 10 గంటలకు ఆరోగ్య సదస్సులో స్వతంత్ర శాస్త్రవేత్త డా. ఖాదర్ వలి తదితరులు అవగాహన కల్పిస్తారు. వివరాలకు.. 86862 24466, 81251 77871.

9న కొర్నెపాడులో సుందరరామన్ శిక్షణ

నేలలో సేంద్రియ కర్బనం పెంచుకోవటం, వివిధ పంటల సేంద్రియ సాగులో మెలకువలపై తమిళనాడుకు చెందిన ప్రసిద్ధ సేంద్రియ రైతు సుందరరామన్ ఈ నెల 9(ఆదివారం)న గుంటూరు జిల్లా పుల్లడిగుంట సమీపంలోని కొర్నెపాడులో రైతులకు ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు డా.వై.వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలకు. 97053 83666, 0863-2286255.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్వర్థయా వర్ధతే విద్య
మంగళవారం
4-2-2020



జేఈఈ మెయిన్ 2020

దేశంలో లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడే పరీక్ష జేఈఈ మెయిన్! తెలుగు రాష్ట్రాల్లో చాలామంది విద్యార్థులు స్కూలు స్థాయి నుంచే జేఈఈ లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. దీన్ని బట్టే మన విద్యార్థులకు జేఈఈ ఎంత ప్రత్యేకమైందో చెప్పాచ్చు. అలాంటి కీలకమైన జేఈఈ మెయిన్-2020 తొలి సెషన్(జనవరి) ఫలితాలను ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జేఈఈ జనవరి సెషన్ ఫలితాల సరళి.. విజేతలు అనుసరించిన ప్రిపరేషన్ వ్యూహాలు, కటాఫ్ మార్కుల అంచనాతోపాటు.. ఏప్రిల్ సెషన్‌కు అనుసరించాల్సిన ప్రిపరేషన్ ప్రణాళికపై ప్రత్యేక కథనం...!

ఇన్‌స్టిట్యూట్‌లు-సీట్లు

జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 31 ఎన్ఐటీలు, 28 ఐఐఐటీలు, 28 సీఎఫ్‌టీఐలలో ప్రవేశాలు కల్పిస్తారు.

ఇన్‌స్టిట్యూట్	సీట్లు
ఐఐటీలు	13,376
ఎన్ఐటీలు	17,967
ఐఐఐటీలు	4,023
సీఎఫ్‌టీఐలు	4,683

జేఈఈ మెయిన్ 2019 కటాఫ్

కేటగిరీ	కటాఫ్ స్కోర్ (పేపర్ 1)
కామన్ ర్యాంక్ లిస్ట్(సీఆర్ఎల్)	89.75
జనరల్(ఈడబ్ల్యూఎస్)	78.21
ఓబీసీ(ఎన్‌సీఎల్)	74.31
ఎస్సీ	54.01
ఎస్టీ	44.33

జేఈఈ మెయిన్ 2020 కటాఫ్ అంచనా

కామన్ ర్యాంక్ లిస్ట్(సీఆర్ఎల్)	88-91
జనరల్(ఈడబ్ల్యూఎస్)	77-80
ఓబీసీ(ఎన్‌సీఎల్)	73-76
ఎస్సీ	53-56
ఎస్టీ	43-46

ఏప్రిల్ సెషన్‌లో.. రాణించేదెలా..?

» 98 పర్సంటైల్ దాటితే సీటు దక్కే అవకాశం
» అంతకంటే తక్కువ వస్తే మళ్లీ రాయడం మేలంటున్న నిపుణులు

జేఈఈ మెయిన్

ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్‌టీఐల్లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలతోపాటు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హులను ఎంపిక చేసే పరీక్షే.. జేఈఈ మెయిన్. దీన్ని ఎన్‌టీఏ ఏటా రెండు సార్లు నిర్వహిస్తోంది. రెండు సెషన్స్‌లో అభ్యర్థి పొందిన అత్యుత్తమ స్కోరు ఆధారంగా జేఈఈ మెయిన్ తుది ర్యాంకును ప్రకటిస్తారు. ఒక సెషన్‌లో మాత్రమే పాల్గొన్న వారికి సదరు స్కోరు ఆధారంగా ర్యాంకు కేటాయిస్తారు. తొలి సెషన్‌కు(బీటెక్/బీఈ) మొత్తం 9,21,261 మంది దరఖాస్తు చేసుకోగా... పరీక్షకు 8,69,010 మంది హాజరయ్యారు. కాగా, తాజా ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అనేక మంది మంచి పర్సంటైల్ సాధించారు.

కటాఫ్ మార్కులు

ఎన్‌టీఏ ఏప్రిల్ సెషన్ ఫలితాలతోపాటు జేఈఈ మెయిన్-2020 క్వాలిఫయింగ్ కటాఫ్ మార్కులను వెల్లడిస్తుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యేందుకు పొందాల్సిన కనీస మార్కులను క్వాలిఫయింగ్ కటాఫ్ మార్కులుగా పేర్కొంటే... పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్స్(ఎన్ఐటీ, జీఎఫ్ఐటీ)లల్లో ప్రవేశానికి పొందాల్సిన కనీస మార్కులను అడ్మిషన్ కటాఫ్ మార్కులుగా పేర్కొంటారు. ప్రతి రౌండ్(సీట్ల కేటాయింపు) అనంతరం జోసా అడ్మిషన్ కటాఫ్ మార్కులను ప్రకటిస్తుంది.

కటాఫ్ నిర్ణయించే అంశాలు

- అందుబాటులో ఉన్న మొత్తం సీట్లు
- పరీక్ష క్లిష్టత స్థాయి
- పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య
- సదరు కోర్సుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య

క్లిష్టత మధ్యస్తంగా

- అన్ని సెషన్లను పరిశీలిస్తే పేపర్ 1 సరళి జేఈఈ మెయిన్ జనవరి సెషన్ క్లిష్టత మధ్యస్థంగా ఉంది.
- విద్యార్థులు, నిపుణుల అభిప్రాయంలో ఫిజిక్స్ విభాగం కఠినంగా ఉంది. మ్యాథ్స్, కెమిస్ట్రీల క్లిష్టత మధ్యస్థంగా ఉంది. ఫిజిక్స్‌లో వీట్‌స్టోన్ బ్రిడ్జ్, రెసిస్టెన్స్, రే ఆప్టిక్స్, వేవ్స్ నుంచి ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్‌లో ఫార్ములా బేస్డ్ ప్రశ్నలు అడిగారు.
- మ్యాథ్స్‌లో ట్రిగనోమెట్రీ, ఆల్‌జీబ్రా అండ్ కంటిన్యుటీ, డిఫ్రెన్షియబిలిటీ, ఇంటిగ్రేషన్, కోఆర్డినేట్ జామెట్రీ నుంచి ప్రశ్నలు వచ్చాయి. క్యాల్కులస్ నుంచి అడిగిన ప్రశ్నలు సులభంగా ఉండగా, ఆల్‌జీబ్రా ప్రశ్నలు క్లిష్టంగా ఉన్నాయి.
- కెమిస్ట్రీ విభాగం సులభంగా ఉంది. మార్కోనికోవ్, యాంటీ మార్కోనికోవ్ రియాక్షన్,ఐడియల్ గ్యాస్ ఈక్వేషన్స్, థర్మల్ ఎక్స్‌పాన్షన్, కోఆర్డినేట్ కాంపౌండ్స్ నుంచి ప్రశ్నలు వచ్చాయి.
- ఎన్‌సీఈఆర్‌టీ ఇంటర్ పుస్తకాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. ప్రత్యేకించి ఎన్‌సీఈఆర్‌టీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిలబస్‌కు ప్రాధాన్యత లభించింది.

పరీక్ష రోజు పారపాట్లు

- జేఈఈ మెయిన్ పరంగా అనేక మంది విద్యార్థులు పరీక్ష హాల్లోకి వెళ్లే ముందు ప్రశ్నలు, ఫార్ములాలు, కాన్సెప్టులను డిస్కస్ చేస్తుంటారు. ఈ సంవత్సరం కూడా అనేక మంది ఇదే తరహా పొరపాటు చేశారు. ఫలితంగా అనవసర ఆందోళనకు గురై పరీక్షలో కొన్ని తప్పిదాలు చేసినట్లు తెలుస్తోంది.
- పరీక్షలో చాలా మంది పేపర్‌ను ఆసాంతం చదివి... ఆ తర్వాత తక్కువ పదాలు ఉన్న ప్రశ్నలనే మొదటగా అటెంప్ట్ చేస్తున్నారు. లాంగ్ క్వశ్చన్స్ కష్టంగా ఉంటాయనే భావనే దీనికి ప్రధాన కారణంగా ఉంది..! అయితే లాంగ్ క్వశ్చన్స్ అన్నీ కష్టంగా ఉండాలనే రూలేమీ లేదు. కొన్ని ప్రశ్నలు సులభంగా ఉంటాయి. వాస్తవానికి షార్ట్ క్వశ్చన్స్‌నే ట్రిక్కీగా అడుగుతారు. కాబట్టి విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి.. తదనుగుణంగా వ్యవహరించాలి.
- పరీక్ష జరుగుతుండగా కొంతమంది విద్యార్థులు రెండుమూడుసార్లు వాష్‌రూమ్‌కు వెళ్తుంటారు. దీనివల్ల ఐదు నుంచి ఆరు ప్రశ్నలు అటెంప్ట్ చేసే సమయం వృథా అవుతుంది. కాబట్టి సదరు అలవాట్లు ఉన్న అభ్యర్థులు పరీక్షకు ముందు డ్రైఫ్రూట్స్ తీసుకోవడం మంచిది.

ఏప్రిల్ సెషన్

ఏప్రిల్ సెషన్‌కు హాజరవ్వాలనుకుంటున్న అభ్యర్థులు ముందుగా జనవరి సెషన్‌లో చేసిన పొరపాట్లను విశ్లేషించుకోవాలి. ఆ తప్పులు మళ్లీ జరక్కుండా ఉండేందుకు మాక్ టెస్టులు, గత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. ప్రధానంగా కాన్సెప్ట్ అవగాహన లేని టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

బేసిక్స్‌పై పట్టు

జేఈఈ తొలి సెషన్ ప్రశ్నపత్రాలు, ఫలితాల సరళిని చూసినా లేదా టాపర్స్‌గా నిలిచిన వారు పేర్కొంటన్న అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నా... జేఈఈ మొదటి సెషన్(జనవరి)లో బేసిక్స్ కీలకంగా వ్యవహరించాయని తెలుస్తోంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్‌కు సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను క్షుణ్ణంగా చదివిన వారు మెరుగైన ర్యాంకులు సొంతం చేసుకున్నారు. కాబట్టి ఏప్రిల్ సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించి బేసిక్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే జేఈఈ మెయిన్‌కి సంబంధించి కేవలం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదివితేనో... రిఫరెన్స్‌గా తీసుకుంటేనో ఆశించిన విజయం లభిస్తుందనే గ్యారంటీ లేదు. కాబట్టి వాటితోపాటు ప్రామాణిక పుస్తకాలను ఫాలో అవ్వాలి. అలాగే కాన్సెప్టుల పట్ల అవగాహన కలిగుండాలి.

రోజుకు పది గంటలు!

జేఈఈ సిలబస్ విస్తృతంగా ఉంటుంది. కాబట్టి విద్యార్థులు రోజుకు 10 నుంచి 12 గంటల పాటు ప్రిపరేషన్ సాగించాలి. ప్రిపరేషన్ సమయంలో మంచినీళ్లు ఎక్కువగా తాగాలి. అలాగే రోజూ వ్యాయామం చేయడం వల్ల మెదడుకు చురుకుదనంతోపాటు వెన్నెముక సమస్యలు తలెత్తకుండా ఉంటాయి.

ఎక్కువ మంది చదివినవి

జనవరి సెషన్‌లో మంచి ర్యాంకులు సొంతం చేసుకున్నవారిలో ఎక్కువ మంది చదివిన పుస్తకాల వివరాలు..

- **ఫిజిక్స్:** హెచ్.సీ వెర్మ,
- **మ్యాథమెటిక్స్:** కాలేజ్ మెటీరియెల్స్, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు
- **ఆర్గానిక్ కెమిస్ట్రీ:** చిత్తరంజన్ భక్త, ప్రభాత్‌కుమార్ పుస్తకాలు.

పైన పేర్కొన్న వాటితోపాటు తరగతులకు హాజరవడం, ఎన్‌సీఆర్‌టీ ఇంటర్మీడియెట్ పుస్తకాలను చదవడం చేయాలి.

98 పర్సంటైల్ దాటితే...!

"ఏప్రిల్ సెషన్ రాయడం మంచిదేనా...? ఏ స్కోరు వచ్చిన వారు జేఈఈ అడ్వాన్స్‌కు ప్రిపరేషన్ ప్రారంభించొచ్చు...? అనే సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. జనవరి సెషన్‌లో 98 పర్సంటైల్ కంటే తక్కువ వచ్చిన వారికి కోరుకున్న నిట్‌లో నచ్చిన స్పెషలైజేషన్‌లో సీటు దక్కే అవకాశాలు తక్కువ...! కాబట్టి ఆయా విద్యార్థులు ఏప్రిల్ సెషన్‌కు సన్నద్ధం కావడంపై దృష్టిపెట్టాలి. అలాగే 98 పర్సంటైల్ కంటే ఎక్కువ వచ్చిన అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్‌ను కొనసాగించాలి. బోర్డు పరీక్షలను బ్యాలెన్స్ చేస్తూ జేఈఈ పరీక్షలకు సన్నద్ధమడంపై విద్యార్థుల విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.

ఆర్.కేదారేశ్వర్, విజన్ 40

యువ శాస్త్రవేత్తలకు ఆహ్వానం

● పాఠశాల విద్యార్థుల కోసం ఇస్రో ప్రత్యేక కార్యక్రమం

ఉన్నత పాఠశాల విద్యార్థులను బావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించింది. అంతరిక్షంలోకి పంపే ఉపగ్రహాలు, సూర్యచంద్రులపై జరిగే పరిశోధనలతోపాటు, విశ్వరహస్యాలను తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న స్కూల్ విద్యార్థుల కోసం గత రెండేళ్లుగా యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్(యువిక) నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి విద్యార్థులను అంతరిక్ష పరిశోధనల వైపు ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన యువిక ప్రోగ్రామ్‌కు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో 'యువిక' వివరాలు..

యువిక

అంతరిక్ష సాంకేతిక, వైజ్ఞానిక అంశాలు, పరిశోధనలు, ఇస్రో చేస్తున్న ఉపగ్రహ ప్రయోగాలపైన పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి యువిక (యువ విజ్ఞాన్ కార్యక్రమ్) అనే ప్రత్యేక ప్రోగ్రామ్‌కు ఇస్రో శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ 'జై విజ్ఞాన్, జై అనుసంధాన్ నినాదంలో భాగంగా ఇస్రో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. అంతరిక్ష విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి.. వారిలో దాగి ఉన్న ప్రతిభకు మరింత పదును పెట్టడం యువిక ప్రధాన ఉద్దేశం.

అర్హతలు

- ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు 9వ తరగతి పూర్తి చేసుకొని పదోతరగతి ప్రవేశానికి సిద్ధమవుతున్నవారై ఉండాలి.
- ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ముగ్గురి చొప్పున ఎంపిక చేస్తారు.
- సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ చదివే విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

ఎంపిక విధానం

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 8వ తరగతిలో కనబర్చిన ప్రతిభతోపాటు, సైన్స్ లేదా స్పేస్ క్లబ్‌లో మెంబర్‌షిప్, స్కౌట్స్ అండ్ గైడ్స్/ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ సభ్యత్వం, స్కూల్ స్థాయిలో ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్‌లో ప్రతిభ, స్పోర్ట్స్‌లో విజేతలు, గ్రామీణ పాఠశాలల్లో విద్యాభ్యాసం తదితర అంశాలకు నిర్దేశిత వెయిటేజీ కేటాయించి.. ప్రొవిజినల్ జాబితా ప్రకటిస్తారు. ఇలా ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

ప్రోగ్రాం ఇలా

ఎంపికైన విద్యార్థులకు దేశంలోని నాలుగు ఇస్రో కేంద్రాలు అహ్మదాబాద్, షిల్లాంగ్, బెంగళూర్, తిరువనంతపురంలలో రెండు వారాలపాటు శిక్షణ ఇస్తారు. ల్యాబ్ విజిట్, ఆయా విభాగాల్లోని శాస్త్రవేత్తలు, నిపుణులతో చర్చ కార్యక్రమాలు, ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్స్ నిర్వహిస్తారు. కోర్సులో భాగంగా మెటీరియల్‌తోపాటు, దూర ప్రాంతాల్లో నుంచి వచ్చే విద్యార్థులకు ప్రయాణ ఛార్జీలు, ఉచిత భోజన, వసతి సదుపాయాన్ని కల్పిస్తారు.

ముఖ్యమైన తేదీలు

- **రిజిస్ట్రేషన్ ప్రారంభతేదీ:** ఫిబ్రవరి 03, 2020
- **రిజిస్ట్రేషన్ ముగింపు తేదీ:** ఫిబ్రవరి 24, 2020
- **ప్రొవిజినల్ లిస్ట్ వెల్లడి:** మార్చి 02, 2020
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 23, 2020
- **ఫైనల్ లిస్ట్:** మార్చి 30, 2020
- **శిక్షణ ప్రారంభం:** మే,2020
- **దరఖాస్తు ఇలా:** ఆసక్తి గల విద్యార్థులు ఇస్రో అధికారిక వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- **వెబ్‌సైట్ : https//yuvika,isro.gov.in/yuvika/register.jsp**

ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాలు-2020
❖ స్టడీ మెటీరియల్, బిట్‌బ్యాంక్, జీకే, మాక్ టెస్టులు, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్, మోడల్ పేపర్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించేందుకు కావల్సిన అర్హతలను అందించే పరీక్ష... సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు (సీటెట్). దీన్ని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా సీబీఎస్ఈ సీటెట్ 2020 జూలై సెషన్‌కు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు ఉపయోగపడేలా సీటెట్ దరఖాస్తు ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రయోజనాలపై కథనం...

నోటిఫికేషన్

టీచర్ కొలువుకు మార్గం.. సీటెట్

ప్రయోజనాలు

- కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ స్కూళ్లతోపాటు రాష్ట్రస్థాయి పాఠశాలలో టీచర్ ఉద్యోగాల దరఖాస్తుకు అవసరమైన అర్హత లభిస్తుంది.
- సీటెట్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించిన వారిని ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. ఉత్తీర్ణులకు ఏడేళ్ల గుర్తింపుతో సర్టిఫికెట్ జారీ చేస్తారు.
- సీటెట్ హాజరుకు సంబంధించి ఎలాంటి పరిమితిలేదు.

అభ్యర్థులు ఎన్నిసార్లయినా సీటెట్‌కు హాజరవ్వొచ్చు. తద్వారా ఎక్కువ స్కోర్ వచ్చిన సీటెట్‌ను ఉపయోగించుకొనే వీలుంటుంది.

ప్రైమరీ స్టేజ్(1-5 తరగతులు)

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్, రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు లేదా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్, రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు(ఎన్‌సీటీఈ రెగ్యులేషన్స్ 2002 ప్రకారం) లేదా కనీసం 50 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈఎల్ఈడీ) పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు లేదా కనీసం 50 శాతం మార్కులతో సీనియర్ సెంకండరీ, రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు లేదా కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. అయితే బీఈడీ ఉత్తీర్ణులు అదనంగా ఆరు నెలల బ్రిడ్జ్ కోర్సు చేసుండాలి.

ఎలిమెంటరీ స్టేజ్ (6-8 తరగతులు)

- **అర్హత:** డిగ్రీ, రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులు/చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు లేదా కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, ఏడాది వ్యవధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న లేదా కనీసం ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం 45 శాతం మార్కులతో డిగ్రీ, ఏడాది వ్యవధిగల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న లేదా కనీసం 50 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ, నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న లేదా కనీసం 50 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ, నాలుగేళ్ల బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ కోర్సు పూర్తి చేసిన/చివరి సంవత్సరం చదువుతున్న లేదా కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్, ఏడాది వ్యవధిగల బీఈడీ (స్పెషలెడ్యుకేషన్) పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు కనీస విద్యార్హతలో 5 శాతం ఉత్తీర్ణతా సడలింపు ఉంటుంది.

రెండు పేపర్లు

సీటెట్‌ను ఆన్‌లైన్ విధానంలో రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ఒకటి నుంచి ఐదు తరగతుల బోధనకు సంబంధించి పేపర్ 1 నిర్వహిస్తారు. 6-8 తరగతుల బోధనకు సంబంధించి పేపర్ 2 నిర్వహిస్తారు.

- **పేపర్ 1:** ఉదయం 9.30-మధ్యాహ్నం 12 గంటల వరకు.
- **పేపర్ 2:** మధ్యాహ్నం 2-4.30 గంటల వరకు.

పేపర్ 1.. 150 మార్కులకు

ఇది ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు చదువుతున్న పిల్లల బోధనకు సంబంధించిన పేపర్. ప్రశ్నపత్రం మల్టిపుల్ చాయిస్ విధానంలో ఇంగ్లిష్/హిందీ మాధ్యమాల్లో ఉంటుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ	30	30
లాంగ్వేజ్ 1 (తప్పనిసరి)	30	30
లాంగ్వేజ్ 2 (తప్పనిసరి)	30	30
మ్యాథమెటిక్స్	30	30
ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్	30	30
మొత్తం	**150**	**150**

- **లాంగ్వేజ్ 1:** బోధనా భాషపై పట్టును పరీక్షిస్తారు.
- **లాంగ్వేజ్ 2:** భాషాంశాలతోపాటు కమ్యూనికేషన్ అండ్ కాంప్రహెన్షన్ సామర్థ్యాలను పరీక్షిస్తారు. అభ్యర్థులు లాంగ్వేజ్ 1, 2లను వేర్వేరుగా ఎంచుకోవాల్సి ఉంటుంది.

పేపర్ 2.. 6-8 తరగతులు

6-8 తరగతులకు బోధించాలనుకొనే అభ్యర్థులు పేపర్ 2కు హాజరవ్వాల్సి ఉంటుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ	30	30
లాంగ్వేజ్ 1(తప్పనిసరి)	30	30
లాంగ్వేజ్ 2(తప్పనిసరి)	30	30
మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ లేదా సోషల్ స్టడీస్	60	60
మొత్తం	**150**	**150**

ముఖ్యసమాచారం

- » **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 24, 2020
- » **ఫీజు చెల్లించేందుకు చివరితేదీ:** ఫిబ్రవరి 27, 2020
- » **హాల్ టికెట్ల జారీ:** జూన్ మూడో వారం నుంచి
- » **పరీక్ష తేదీ:** జూలై 5, 2020
- » **ఫలితాల వెల్లడి:** పరీక్ష జరిగిన ఆరు వారాల్లోగా..
- » **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ(ఎన్‌సీఎల్)-పేపర్ 1/పేపర్ 2 రూ.1000. రెండు పేపర్లు కలిపి రూ.1200; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ పేపర్ 1/పేపర్ 2 రూ.500. రెండు పేపర్లు కలిపి రూ.600.
- » **పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్
- » **వెబ్‌సైట్: www.ctet.nic.in**

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
4-2-2020

9 భారత్, పాకిస్తాన్ మధ్య అండర్-19 ప్రపంచకప్‌లో మొత్తం 9 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 4 గెలిచి, 5 ఓడింది. అయితే గత మూడు సమరాల్లో మనదే పైచేయి (1988, 2002, 2004, 2006, 2010లలో పాకిస్తాన్ గెలిస్తే... 1998, 2012, 2014, 2018లలో భారత్ నెగ్గింది)

2018 ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత్ 203 పరుగుల భారీ తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. నాటి మ్యాచ్‌లో ఆడిన రొహైల్ నజీర్ ఒక్కడే ప్రస్తుతం పాక్ టీమ్ తరఫున ఈ మ్యాచ్‌లోనూ బరిలోకి (కెప్టెన్‌గా) దిగుతున్నాడు.

ఇరు జట్లు చివరి సారిగా గత ఏడాది సెప్టెంబరులో అండర్-19 ఆసియా కప్‌లో తలపడ్డాయి. ఈ పోరులో పాక్ 60 పరుగులతో గెలిచింది.

కుర్రాళ్ల సమరం

అండర్-19 ప్రపంచ కప్ సెమీఫైనల్లో నేడు భారత్, పాకిస్తాన్ మధ్య పోరు

అమితోత్సాహంతో ఇరు జట్లు ● లీగ్ దశలో ఓటమి లేకుండా సెమీస్‌కు

మధ్యాహ్నం గం. 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-3లో ప్రత్యక్ష ప్రసారం



ప్రాక్టీస్ సెషన్‌లో పాకిస్తాన్, భారత జట్ల ఆటగాళ్లు

వాళ్లంతా టీనేజ్ దాటని కుర్రాళ్లే. కానీ ప్రత్యర్థితో సీరియస్‌గా వ్యవహరించడంలో సీనియర్లకంటే మిన్నగానే కనిపిస్తున్నారు. సరదా పలకరింపులు లేవు, హ్యాండ్‌షేక్‌లు అసలే కనిపించడం లేదు, అలా పక్క నుంచి 'ఆ' జట్టు ఆటగాడు వెళుతున్నాడంటే తమ సంభాషణ కూడా ఆపేస్తున్నారు. భోజనం క్యూలో అవతలి జట్టు ఆటగాడి వెనుక మరొకరు నిల్చోవాల్సి వచ్చినప్పుడు అక్కడ కూడా కాస్త మొహంపై చిరునవ్వు చూపించడం కష్టంగా మారిపోయింది. ఇరు జట్ల క్రికెటర్లంతా వీర గంభీరంగా కనిపిస్తున్నారు.

సరిగ్గా చెప్పాలంటే సరిహద్దుకు ఆవల, ఇవతల అన్న ట్లుగా యువ ఆటగాళ్లు వ్యవహరించడం ఇరు జట్ల ప్రాక్టీస్‌లో స్పష్టంగా కనిపించింది. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ సమరం అంటే దశాబ్దాలుగా ఎంతటి ఆసక్తి, మ్యాచ్‌కు ముందు ఎలాంటి వాతావరణం ఉంటుందో అందరికీ తెలుసు. వేదిక, స్థాయి ఏదైనా అది ఎక్కడా తగ్గలేదు. ఇప్పుడు మరోసారి దాయాదుల మధ్య సమరానికి రంగం సిద్ధమైంది. యువ ప్రపంచకప్ సెమీస్‌లో తలపడుతున్న వీరిలో ముందంజ వేసేది ఎవరనేది ఆసక్తికరం.

పాచెఫ్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ మధ్య మరి కొన్ని గంటల్లో మెగా క్రికెట్ సమరం జరగనుంది. ఈసారి ఈ పోరులో కుర్రాళ్లు తలపడుతున్నారు. అండర్-19 ప్రపంచ కప్‌లో భాగంగా నేడు జరిగే తొలి సెమీఫైనల్లో ఇరు జట్లు హోరాహోరీ పోరుకు 'సై' అంటున్నాయి. భారత్ గతంలో నాలుగు సార్లు ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంటే... పాక్ రెండు సార్లు విజేతగా నిలిచింది. తాజా టోర్నీలో ప్రదర్శనను బట్టి చూస్తే మాత్రం ఇరు జట్లు సమఉజ్జీలుగా కనిపిస్తున్నాయి కాబట్టి విజేతను అంచనా వేయడం అంత సులువు కాదు. టోర్నీలో భారత్ అత్యధిక స్కోరు 297 కాగా పాక్ 294 పరుగులు చేసింది. బౌలింగ్‌లో భారత్ మొత్తం 40 వికెట్లు పడగొట్టగా, పాక్ 39 వికెట్లు తీసింది.

ప్రియమ్ గార్గ్

రొహైల్ నజీర్

యశస్వి మినహా...

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగితున్న భారత జట్టు ఇప్పటి వరకు కనిపించని బ్యాటింగ్ లోపాన్ని సరిదిద్దుకోవాల్సి ఉంది. లీగ్ దశలో మన టీమ్ 3 మ్యాచ్‌లూ గెలిచి అజేయంగా నిలిచింది. ఇందులో ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఒక్కడే 3 అర్ధసెంచరీలు సహా 207 పరుగులతో మెరిశాడు. అతనికి, రెండో స్థానంలో ఉన్న దివ్యాంశ్ సక్సేనా (89 పరుగులు) మధ్య ఉన్న తేడా చూస్తేనే పరిస్థితి అర్థమవుతోంది. తక్కువ స్కోర్లు ఛేదించాల్సి రావడం వాస్తవమే అయినా ఒక వన్డే మ్యాచ్‌లో భారత్ స్థాయికి తగ్గ బ్యాటింగ్ ప్రదర్శన మాత్రం రాలేదు. ఆస్ట్రేలియాతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అది కనిపించింది. ఇతర ప్రధాన బ్యాట్స్‌మెన్ సిద్ధేశ్ వీర్, జురేన్, కెప్టెన్ ప్రియమ్ గార్గ్ కూడా చెలరేగితే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. హైదరాబాదీ ఠాకూర్ తిలక్ వర్మ కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడితే అతనికి ఈ మ్యాచ్ చిరకాలం గుర్తుండిపోతుంది. మన బౌలింగ్ మాతర్ం చక్కగా రాణిస్తుండటం చెప్పుకోదగ్గ అంశం. లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్ 11 వికెట్లు పడగొట్టగా, పేసర్ కార్తీక్ త్యాగి 9 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఆకాశ్ సింగ్, అథర్వ అంకోలేకర్ కూడా ఇప్పటికే తమ సత్తా చాటారు.

పాక్ కూడా...

పాకిస్తాన్ పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు. ఆ జట్టు కూడా బ్యాటింగ్‌కంటే బౌలింగ్ పైనే ఎక్కువగా ఆధారపడుతోంది. టీమ్ తరఫున మొహమ్మద్ హారిస్ ఒక్కడే మొత్తం స్కోరు వంద పరుగులు దాటగా (110) ఒక మ్యాచ్ రద్దు కారణంగా ఎక్కువ మంది బ్యాట్స్‌మెన్‌కు పెద్దగా ఆడే అవకాశం రాలేదు. ఖాసిమ్ అక్రమ్, హైదర్ అలీ, కెప్టెన్ రొహైల్ నజీర్, ఇర్ఫాన్ ఖాన్, ఫహద్ మునీర్ ఇతర ప్రధాన బ్యాట్స్‌మెన్. గత మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన మొహమ్మద్ హురైరా తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో మాత్రం అబ్బాస్ అఫ్రిది (9 వికెట్లు), ఆమిర్ ఖాన్, తాహిర్ హుస్సేన్ (చెరో 7 వికెట్లు) ప్రత్యర్థిపై ఆధిక్యం ప్రదర్శిస్తూ చెలరేగారు. ఈ ముగ్గురు పేస్ బౌలర్లు ఇప్పుడు భారత టాపార్డర్‌ను దెబ్బ తీయడమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. అయితే నాణ్యమైన స్పిన్నర్ లేకపోవడం పాక్ జట్టులో ప్రధానంగా కనిపిస్తున్న లోటు.

రోహిత్ శర్మ అవుట్

● గాయం కారణంగా కివీస్‌తో వన్డే, టెస్టు సిరీస్‌లకు దూరం

● టెస్టుల్లో గిల్, వన్డేల్లో మయాంక్‌కు చోటు!

ముంబై: న్యూజిలాండ్‌తో టి20 సిరీస్‌ను 5-0తో క్లీన్ స్వీప్ చేసిన ఉత్సాహంలో ఉన్న భారత జట్టుకు ఎదురు దెబ్బ తగిలింది. కాలి పిక్క గాయం కారణంగా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ మిగిలిన పర్యటన నుంచి తప్పుకున్నాడు. బుధవారం నుంచి జరిగే వన్డే సిరీస్‌తో పాటు ఆ తర్వాత జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు కూడా రోహిత్ దూరమయ్యాడు. మౌంట్ మాంగనీలో ఆదివారం జరిగిన చివరి టి20 మ్యాచ్‌లో 60 పరుగులు చేసిన అనంతరం కాలి పిక్క గాయంతో అతను రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత పరీక్షల్లో దాని తీవ్రత ఎక్కువని తేలింది. 'రోహిత్ గాయం చిన్నదేమీ కాదు. ఫిజియో దీనిని పర్యవేక్షిస్తున్నాడు. అయితే న్యూజిలాండ్‌తో మిగిలిన సిరీస్‌లో మాత్రం ఆడే అవకాశం లేదని తేలిపోయింది. అతను ఈ పర్యటన నుంచి తప్పుకుంటున్నాడు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు.

ఓపెనర్‌గా భారత జట్టుకు తిరుగులేని విజయాలు అందిస్తున్న రోహిత్ శర్మ లేకపోవడం వన్డేల్లో టీమిండియాను బలహీనం చేస్తుందనడంలో సందేహం లేదు. గత ఏడాది టెస్టుల్లో కూడా ఓపెనర్‌గా బరిలోకి దిగిన తర్వాత రోహిత్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. విశాఖపట్నంలో తొలి టెస్టులోనే రెండు సెంచరీలు చేసిన అతను ఆ తర్వాత రాంచీలో డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఇప్పుడు విదేశీ గడ్డపై సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న తరుణంలో గాయం అతని జోరుకు బ్రేక్ వేసింది.

పృథ్వీ షాకు నో!

రోహిత్ శర్మ స్థానంలో న్యూజిలాండ్‌లోనే భారత 'ఎ' జట్టు తరఫున ఆడుతున్న శుబ్‌మన్ గిల్, మయాంక్ అగర్వాల్‌లకు టెస్టు, వన్డే జట్లలో స్థానం లభించనున్నట్లు సమాచారం. అయితే బీసీసీఐ నుంచి దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. తొలి అనధికారిక టెస్టులో డబుల్ సెంచరీ చేయడం గిల్ స్థానాన్ని అవకాశాలను పటిష్టం చేయగా... విండీస్ వన్డే సిరీస్‌కు జట్టులో భాగంగా ఉన్న మయాంక్‌కు ఇప్పుడు మరో అవకాశం లభించింది. రాహుల్ కూడా అందుబాటులో ఉన్న కారణంగా... ప్రస్తుతం వన్డే జట్టులోకి ఎంపికైన పృథ్వీ షాను ఇంకా టెస్టుల్లోకి పరిశీలించలేదని తెలుస్తోంది.

రోహిత్ శర్మ

బీసీసీఐ తమాషా!

రహానే, పుజారా, సాహా... ముగ్గురు టెస్టు స్పెషలిస్ట్‌లు న్యూజిలాండ్ పర్యటనకు బయల్దేరుతున్నట్లు బ్యాగ్‌లు సర్దుతున్న ఫొటోలు పెట్టారు. నిజానికి ఇప్పటి వరకు బీసీసీఐ అధికారికంగా టెస్టు జట్టును ప్రకటించనే లేదు. కానీ ఆటగాళ్లు మాత్రం బయల్దేరి పోయారు. రోహిత్ స్థానంలో శుబ్‌మన్ గిల్‌ను ఎంపిక చేస్తున్నట్లు అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ స్వయంగా వెల్లడించాడు. సరిగ్గా చూస్తే భారత్ ఆడిన చివరి టెస్టు సిరీస్‌లో (బంగ్లాదేశ్‌తో) గిల్ సభ్యుడిగా ఉన్నాడు. మరి అలాంటి ఆటగాడు మరొకరి స్థానాన్ని భర్తీ చేయడం ఏమిటి! అంటే అంతర్గతంగా జట్టు ఎంపిక పూర్తయిపోయింది. ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఆ జాబితాను బోర్డుకు అందించింది కూడా. అందులో గిల్‌పై వేటు పడింది. ఒకవేళ టెస్టు జట్టు ఎంపిక పూర్తయిపోతే దానిని ప్రకటించడంలో సమస్య ఏముంటుంది. సెలక్షన్ కమిటీ కన్వీనర్, బోర్డు కార్యదర్శి జై షా బిజీ అనే మాట వినిపిస్తోంది కానీ ఆఫీస్ బాయ్ నుంచి అధ్యక్షుడి పని వరకు అన్నీ తానై వ్యవహరిస్తున్న గంగూలీ ప్రకటిస్తే నష్టమేమైనా జరుగుతుందా! కోశాధికారి అరుణ్ ధుమాల్‌తో కలిసి జై షా కూడా న్యూజిలాండ్ వెళుతున్నట్లు సమాచారం. అక్కడ వీరిద్దరు విమానం దిగిన తర్వాతే టెస్టు టీమ్‌ను, కొత్త ఆటగాళ్లను ప్రకటిస్తారేమో!

జై షా, గంగూలీ, అరుణ్ ధుమాల్ (ఫైల్)

భారత జట్టుకు మళ్లీ జరిమానా

దుబాయ్: న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 'స్లో ఓవర్ రేట్' జరిమానాను ఎదుర్కొంది. న్యూజిలాండ్‌తో ఆదివారం ముగిసిన ఐదో టి20లో నిర్ణీత సమయానికి ఒక ఓవర్ తక్కువగా వేసినందుకు... జట్టు సభ్యులకు మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్ 20 శాతం జరిమానా విధించారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధన 2.22 ప్రకారం... నిర్ణీత సమయం అనంతరం వేసే ప్రతీ ఓవర్‌కు 20 శాతం చొప్పున జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో కోత విధిస్తారు. తాత్కాలిక సారథి రోహిత్ శర్మ మ్యాచ్ ఫీజులో కోతకు సమ్మతించడంతో విచారణ చేయలేదు. నాలుగో టి20లోనూ భారత్ 2 ఓవర్లు ఆలస్యంగా వేయడంతో... మ్యాచ్ రిఫరీ భారత ఆటగాళ్లకు 40 శాతం జరిమానా విధించారు.

తదుపరి లక్ష్యం ఫెడరర్ రికార్డు

ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ వ్యాఖ్య

మెల్‌బోర్న్: స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ పేరిట ఉన్న అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ రికార్డును అధిగమించడమే తన తదుపరి లక్ష్యమని సెర్బియా స్టార్ జొకోవిచ్ తెలిపాడు. రికార్డుస్థాయిలో ఎనిమిదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన 32 ఏళ్ల జొకోవిచ్ సోమవారం విడుదల చేసిన ఏటీపీ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. జొకోవిచ్ కెరీర్‌లో ఇది 17వ గ్రాండ్‌స్లామ్ టైటిల్. 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో ఫెడరర్ అగ్రస్థానంలో... 19 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో స్పెయిన్ స్టార్ నాదల్ రెండో స్థానంలో ఉన్నారు. 'నా జీవితంలోని ఈ దశలో గ్రాండ్‌స్లామ్ టోర్నీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. ఈ మెగా టోర్నీల కోసమే నేను పూర్తి సీజన్‌లో ఆడుతున్నాను. ఫెడరర్ రికార్డును అందుకోవడం, దానిని అధిగమించడమే నా తదుపరి లక్ష్యం. గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో సీజన్‌ను ప్రారంభించినందుకు అమితానందంతో ఉన్నాను. ఇదే ఉత్సాహంతో మిగిలిన సీజన్‌లో మంచి ఫలితాలు సాధిస్తాను' అని జొకోవిచ్ వ్యాఖ్యానించాడు.

సుమీత్, రామ్ ఓటమి

సుమీత్ నాగల్

పుణే: టాటా ఓపెన్ మహారాష్ట్ర ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లు సుమీత్ నాగల్, రామ్‌కుమార్ తొలి రౌండ్‌లోనే పరాజయం చవిచూశారు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సుమీత్ 2-6, 7-6 (7/4), 1-6తో విక్టర్ ట్రయెస్కీ (సెర్బియా) చేతిలో... రామ్‌కుమార్ 6-3, 4-6, 5-7తో ఏడో సీడ్ సాల్వటోర్ కరూసో (ఇటలీ) చేతిలో ఓడిపోయారు.

భారత బాక్సర్ల పసిడి పంచ్

బోరస్ (స్వీడన్): గోల్డెన్ గర్ల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ మహిళా బాక్సర్లు ఆరు స్వర్ణ పతకాలతో సహా మొత్తం 14 పతకాలను సాధించి అదరగొట్టారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో ఐదు పసిడి పతకాలు, మూడు రజతాలు, ఒక కాంస్య పతకం సాధించగా... యూత్ విభాగంలో ఒక స్వర్ణం, నాలుగు కాంస్య పతకాలను గెలుచుకుంది. జూనియర్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రాచీ (50 కేజీలు) 'బెస్ట్ బాక్సర్' అవార్డును కైవసం చేసుకుంది. ఆమెతో పాటు నివేదిత (48 కేజీలు), ఎథోయ్‌బి చాను వాంజమ్ (54 కేజీలు), లశు యాదవ్ (66 కేజీలు), మహి (80 కేజీలు) బంగారు పతకాలను గెల్చుకోగా... యూత్ విభాగంలో ముస్కాన్ (54 కేజీలు) స్వర్ణాన్ని సాధించింది. సాన్యా (57 కేజీలు), దీపిక (64 కేజీలు), ముస్కాన్ (69 కేజీలు), సాక్షి (75 కేజీలు) కాంస్యాలు గెలిచారు. జూనియర్ విభాగంలో జాన్వీ (46 కేజీలు), రూడీ లాల్‌మింగ్ మువాని (66 కేజీలు), తనిష్కా (80 కేజీలు) రజతాలు... దియా(60 కేజీలు) కాంస్యం సాధించింది.

సెమీస్‌లో పుణే సెవెన్ ఏసెస్

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ ఐదో సీజన్

సాక్షి, హైదరాబాద్: మరో అద్భుత ప్రదర్శనతో నాలుగో విజయం నమోదు చేసుకున్న పుణే సెవెన్ ఏసెస్ జట్టు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) ఐదో సీజన్‌లో సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఇక్కడి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో పుణే 4-1తో అవధ్ వారియర్స్‌పై గెలుపొందింది. తద్వారా 18 పాయింట్లను ఖాతాలో వేసుకున్న పుణే... పాయింట్ల పట్టికలో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌తో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఇప్పటికే చెన్నై సూపర్ స్టార్స్, నార్త్ ఈస్టర్న్ వారియర్స్ సెమీస్‌లోకి అడుగుపెట్టాయి. మిగిలిన మరో బెర్త్ కోసం నాలుగు జట్లు పోటీపడుతున్నాయి. పురుషుల డబుల్స్‌లో కొ సుంగ్ హ్యూన్-షిన్ బేక్ (అవధ్ వారియర్స్) జోడీ 6-15, 15-9, 15-12తో చిరాగ్ శెట్టి-సెతియావన్ (పుణే) జంటపై గెలుపొంది అవధ్ వారియర్స్‌కు శుభారంభం ఇచ్చింది. అయితే అనంతరం జరిగిన మహిళల సింగిల్స్‌లో 'ట్రంప్ కార్డు'తో ఆడిన అవధ్ వారియర్స్ ప్లేయర్ బీవెన్ జాంగ్ 13-15, 12-15తో రితుపర్ణ (పుణే) చేతిలో ఓడటంతో... అవధ్ వారియర్స్‌కు ఒక పాయింట్ పెనాల్టీ పడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో క్రిస్టీనా పెడర్సన్-సాజొనోవ్ (అవధ్ వారియర్స్) జంట 6-15, 9-15తో క్రిస్-గాబ్రియెల్ (పుణే) ద్వయం చేతిలో ఓడింది. దాంతో పుణే 2-0తో ఆధిక్యంలోకెళ్లింది. పురుషుల తొలి సింగిల్స్‌లో 'ట్రంప్ కార్డు'తో ఆడిన కీన్ యా లోహ్ (పుణే) 15-12, 15-14తో శుభాంకర్ డే (అవధ్ వారియర్స్)పై గెలిచాడు. చివరగా జరిగిన పురుషుల రెండో సింగిల్స్‌లో కజుమస సకాయ్ (పుణే) 15-6, 10-15, 13-15తో అజయ్ జయరామ్ (అవధ్ వారియర్స్) చేతిలో ఓడాడు. నేటి మ్యాచ్‌ల్లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌తో చెన్నై సూపర్ స్టార్స్; బెంగళూరు రాప్టర్స్‌తో ముంబై రాకెట్స్ తలపడతాయి.

రితుపర్ణ

SPL
SAKSHI PREMIER LEAGUE

6న సాక్షి ప్రీమియర్ లీగ్ ఫైనల్స్

సాక్షి, హైదరాబాద్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జరుగుతోన్న 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ తుది అంకానికి చేరుకుంది. లీగ్ మ్యాచ్‌లను విజయవంతంగా ముగించుకున్న ఎస్‌పీఎల్ ఫైనల్ సమరానికి సిద్ధమైంది. గురువారం జరుగనున్న ఈ టైటిల్ పోరు బహుమతి ప్రదాన కార్యక్రమం సైనిక్‌పురిలోని భవన్స్ క్రికెట్ అకాడమీలో అట్టహాసంగా జరుగనుంది. ఈ వేడుకకు నగరంలోని అన్ని కాలేజీల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఆసక్తి గలవారు తమ కాలేజి ఐడీ కార్డులతో రావాల్సిందిగా నిర్వాహకులు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్/సంయుక్త కలెక్టర్/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

ఫారం-7
(చట్టం-320/2013 లోని సెక్షన్ 19(1) లోని సబ్‌రూల్-1 25 ప్రకారం
రూఢీ ప్రకటన

కలెక్టర్ ఫైల్ నం.ఎ/2483/2019 తేది: 24/01/2020
ఫైల్ నెం.పి/1395/2017 తేది: /01/2020
గెజిట్ నెం. 11/2020 తేది: 24/01/2020

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్ యాదాద్రి-భువనగిరి గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్టపరచిన యాదాద్రి-భువనగిరి జిల్లాలో, గుండాల మండలము వెల్మకాల మరియు అనంతారం గ్రామములో విస్తీర్ణము ఎ.9-00) గుంటల ప్రజా ప్రయోజనం నిమిత్తము అనగా 1ఎల్ ఆఫ్ ఎల్ 6 డిస్ట్రిబ్యూటరీ ఆఫ్ మైనర్ కెనాల్ ఆఫ్ నకిరేకల్ రిజర్వాయర్ కి.మీ. 0.55 నుండి 4.050 (టి.ఇ.) వెడల్పు చేయుటకు గాను దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని నిర్ణయించినారు.

ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయబడిన విస్తీర్ణము వెల్మకాల మరియు అనంతారం గ్రామములో ఎ.9-00 గుంటలలో, అనంతారం గ్రామములో విస్తీర్ణము ఎ.2-13 గుంటల భూమిని భూయజమానులు అంగీకారముతో RFCT in LA RR (TA)Act.2013 ప్రకారము బహిరంగ భూసేకరణ గావించబడినది.

మిగిలిన అనంతారం ఎ.6-27 గుంటల భూమిని భూయజమానులు DLNC ప్రతిపాదించిన ధరకు ఇచ్చుటకు నిరాకరించినందున ఇట్టి అనంతారం ఎ.6-27 గుంటల భూమి RFCT in LA RR (TA) Act.2013 ప్రకారము భూసేకరణ చేయుటకు నిర్ణయించబడినది.

కావున యాదాద్రి-భువనగిరి జిల్లాలో గుండాల మండలం, వెల్మకాల గ్రామం విస్తీర్ణము ఎ.6-27 గుంటల గల భూమి అనగా దేవాదుల ఎత్తిపోతల పథకము క్రింద కాలువను వెడల్పు చేయుటకు భూమి అవసరమైనందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రకటన (డిక్లరేషన్) జారీచేయబడినది.

గ్రామము : వెల్మకాల మండలము : గుండాల జిల్లా : జనగాం
కెనాల్ 1.6 డిస్ట్రిబ్యూటరీ ఆఫ్ మైనర్ కెనాల్ ఆఫ్ నకిరేకల్ రిజర్వాయర్ కి.మీ 0.550 నుండి 4.050 (TE)

క్రమ సంఖ్య	సర్వే నెం.	విస్తీర్ణము	భూమి రకం (ఖుష్కి/తరి)	భూ సేకరణ చేయు విస్తీర్ణం	పట్టా దారుని పేరు/ అనుభవదారు పేరు	పరి హద్దులు
1	250	పట్టా	ఖుష్కి	0-23 1/2	ఉడుల పెద్ద అయిలయ్య, తండ్రి:ఎల్లయ్య	ఉ: రోడ్
					ఉడుల పెద్దాపురం, తండ్రి: రామయ్య	ద: 251
					ఉడుల రామచంద్రు తండ్రి: రామయ్య	తూ: 249
					పాడి ప్రకారం	ప: 248
					ఉడుల రాజయ్య తండ్రి: రాజయ్య (ఎ.0-231/2)	
2	203	పట్టా	ఖుష్కి	0-07	అలువాల వెంకటమ్మ, భర్త: కృష్ణారెడ్డి	ఉ: 202
					తిరుమల సర్వారెడ్డి, తండ్రి: రాంరెడ్డి	ద: 204
					కోల జ్యోతి, భర్త: ప్రభాకర్	తూ: 205
					మొగ్గల రామయ్య, తండ్రి:ఎల్లయ్య	ప: రోడ్
					నిమ్మల వెంకటలక్ష్మి, భర్త:మధుసూదన్‌రెడ్డి,	
					నిమ్మల సర్వారెడ్డి, తండ్రి:సంజీవరెడ్డి	
					నిమ్మల సంజీవ రెడ్డి, తండ్రి:చంద్రారెడ్డి	
					పాడి ప్రకారం	
					మొగ్గల చిన్న రామయ్య, తండ్రి: ఎల్లయ్య (ఎ.0-07)	
3	204	పట్టా	ఖుష్కి	0-05	నిమ్మల సోమిరెడ్డి, తండ్రి:పెద్ద చంద్రారెడ్డి	ఉ: 201
					కోల సుభద్ర, తండ్రి: మల్లయ్య	ద: 199
					కోల జ్యోతి, భర్త: ప్రభాకర్	తూ:196
					మాతె సరళాదేవి, భర్త: వెన్నారెడ్డి	ప: 205
					పాడి ప్రకారం	
					మాతె చెన్న కృష్ణారెడ్డి (ఎ.0-05)	
4	151	పట్టా	ఖుష్కి	1-351/2	వడ్లకొండ వీరయ్య, తండ్రి:పుల్లయ్య	ఉ: 150
					జోలం యాదయ్య, తండ్రి:వెంకటయ్య	ద: 152
					వేముల సత్యమూర్తి, తండ్రి: రాజలింగం	తూ: 7
					దుంబాల దయాకర్ రెడ్డి, తండ్రి: వర్రింహారెడ్డి	ప: 7
					పాడి ప్రకారం	
					వేముల సత్యమూర్తి, తండ్రి:రాజలింగం(ఎ.0-17 1/2)	
					వేముల సత్యమూర్తి, తండ్రి:రాజలింగం(ఎ.1-18)	108 హైమిడి చెట్టు
5	152	పట్టా	ఖుష్కి	1-07	వడ్లకొండ జ్యోతి, భర్త: శ్రీరాములు	ఉ: 153
					వడ్లకొండ లక్ష్మణ్, తండ్రిం శ్రీరాములు	ద: 161
					వడ్లకొండ వీరయ్య, తండ్రి: పుల్లయ్య	తూ: 7
					బండి సత్తెమ్మ, భర్త:జగన్నాథం	ప: 151
					చిర్రావురి సాయిచరణ్, తండ్రి: రామకృష్ణ	
					అలువాల మల్లారెడ్డి, తండ్రి:చంద్రారెడ్డి	
					బందారపు సోమయ్య, తండ్రి:రామయ్య	
					ఆనంతుల మల్లేశం, తండ్రి:వెంకటయ్య	
					ఆనంతుల రామయంద్రయ్య, తండ్రి: వెంకటయ్య	
					ఆనంతుల రమేష్, తండ్రి:రామచంద్రయ్య	
					ఆనంతుల సర్వయ్య, తండ్రి: బుగ్గయ్య	
					అల్వాల వెంకటరెడ్డి, తండ్రి: రాంరెడ్డి	
					పాడి ప్రకారం	
					తమ్మాజీ & సురేష్ (ఎ.0-07)	
6	153	పట్టా	ఖుష్కి	2-16	సంగి సర్వయ్య, తండ్రి:ఎల్లయ్య	ఉ: 155
					చిర్రావురి సాయిచరణ్, తండ్రి:రామకృష్ణ	ద: 159
					కారుముడి చంద్రిక, తండ్రి:సుబ్బారావు	తూ:160
					వేముల గురుమూర్తి, తండ్రి:రాజలింగం	ప: 150
					పాడి ప్రకారం	
					రవి, తమ్మాజీ - గురుమూర్తి (ఎ.2-16)	
7	159	పట్టా	ఖుష్కి	0-07 1/2	గోపాల శ్రీరాములు, తండ్రి:సిద్దిరాజు	ఉ: 158
					గోపాల్ కుమార్, తండ్రి:సిద్దిరాజు	ద: 179
					సంగి సర్వయ్య, తండ్రి: ఎల్లయ్య	తూ:167
					చిరవురి సాయిచరణ్ తండ్రి: రామకృష్ణ	ప: 153
					పాడి ప్రకారం	
					రవి, (ఎ.0-07 1/2)	
8	7	అసైన్డ్ భూమి	ఖుష్కి	1-05 1/2	కొమ్మగల్ల సర్వయ్య, తండ్రి: లక్ష్మయ్య	ఉ: రోడ్
					జేరిపోతుల సుధాకర్, భర్త:సత్యనారాయణ	ద: 223
					కొమ్మగల్ల యాదమ్మ, భర్త: అయిలయ్య	తూ:220
					జేరిపోతుల కుమార్, తండ్రి: మల్లయ్య	ప: 219
					జోలం రాజు, తండ్రి:భద్రయ్య	
					కోల రాములు: తండ్రి:సాయిలు	
					యలగందుల సత్తయ్య, తండ్రి:రామయ్య	
					పంజాల కొమలమ్మ, భర్త: యల్లయ్య	
					గుర్రు శిష్టమ్

సాక్షి బిజినెస్
మంగళవారం
4-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
137	46
39,872	11,708

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	9,274	133
డోజోన్స్	28,420	165
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,326	40
డాక్స్	13,045	63
షాంఘై	2,747	300
నికాయ్	22,972	233

అమెరికా, బ్రిటన్, జర్మనీ, చైనా, జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.71	72.35
బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.06	95.32
యూరో	ఎస్‌బీఐ	77.43	80.31
జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	64.39	66.81
ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	46.99	49.16
సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.63	53.41
సౌదీ రియాల్	ఫామ్‌కుక్	18.24	19.84
యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుక్	18.97	19.96
చైనా యువాన్	ఫామ్‌కుక్	9.54	10.94

కార్ల సందడి రెడీ!!

ఈ నెల 7 నుంచి 12 వరకూ ఆటోఎక్స్‌పో... ● ఎలక్ట్రిక్ వాహనాలపైనే అత్యధికంగా దృష్టి...

ఆర్థిక మందగమనం వాహన రంగాన్ని బాగా దెబ్బతీస్తోంది. గత ఏడాది అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వాహన రంగ రికవరీ ఆటో ఎక్స్‌పోతో ఆరంభం కాగలదని వాహన కంపెనీలు ఆశిస్తున్నాయి. 1986లో మొదలై ప్రతి రెండేళ్లకొకసారి జరిగే ఈ ఆటో ఎక్స్‌పోలో దేశీ, విదేశీ కంపెనీలు తమ వాహనాలను డిస్ప్లే చేయనున్నాయి. కొత్త మోడళ్ల ఆవిష్కరణలకు, మార్కెట్లో ప్రవేశపెట్టడానికి ఆటో ఎక్స్‌పో వేదికగా పలు వాహన కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బీఎస్ 6 ప్రమాణాలు అమల్లోకి రానుండటంతో ఈ ఆటో షో ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే అమ్మకాలు తగ్గుతుండటం, బీఎస్ 6 నిబంధనలు అమల్లోకి రానుండటం తదితర కారణాల వల్ల పలు కంపెనీలు ఈ ఆటో ఎక్స్‌పోలో పాల్గొనడం లేదు. కాగా, చైనాకు చెందిన గ్రేట్ వాల్‌మోటార్స్, ఫా హైమ ఆటోమొబైల్ కంపెనీలు ఈ ఆటో ఎక్స్‌పో ద్వారా భారత మార్కెట్లోకి ప్రవేశిస్తున్నాయి. 2018లో జరిగిన ఆటో ఎక్స్‌పోకు సుమారుగా 6 లక్షల మంది సందర్శకులు వచ్చారు. ఈ ఏడాది ఆటో ఎక్స్‌పోకు కూడా ఇదే స్థాయిలో సందర్శకులు వస్తారనేది నిర్వాహకుల అంచనా.

రెండేళ్లకొకసారి జరిగే వాహన పండుగకు రంగం సిద్ధమైంది. పర్యావరణ స్పృహ బాగా పెరిగిన నేపథ్యంలో ఈసారి ఈ ఆటో ఎక్స్‌పోలో ఎలక్ట్రిక్ వాహనాల జోరు బాగా ఉండగలదని నిపుణులు భావిస్తున్నారు. మందగమనం కారణంగా వాహన విక్రయాలు కుదేలయ్యాయని, ఆ ఆటో ఎక్స్‌పో వినియోగదారుల సెంటిమెంట్‌కు జోష్‌నివ్వగలదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ శుక్రవారం (ఈ నెల 7వ తేదీ) నుంచి ఆరంభం కానున్న ఆటో ఎక్స్‌పోకు సంబంధించిన వివరాలు, పాల్గొనే కంపెనీలు, అవి ఆవిష్కరించే మోడళ్లు తదితర అంశాల సమాహారం సాక్షి పాఠకుల కోసం ప్రత్యేకం...

ఎప్పుడు: ఈ నెల 7-12 తేదీల్లో
ఎక్కడ: ఢిల్లీ సమీపంలోని గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్‌లో
ఇది ఎన్నవ సారి: 15వ సారి
పాల్గొనే కంపెనీల సంఖ్య: 30కి పైగా
ఆవిష్కరణలు: కొత్త మోడళ్లు, వేరియంట్లు కలుపుకొని 100కు పైగా
సందర్శకుల సంఖ్య: 6 లక్షలకు పైగా (అంచనా)

2020 AUTO EXPO THE MOTOR SHOW

ఎవరు నిర్వహిస్తున్నారు: ఏసీఎమ్‌ఏ (ఆటోమోటివ్ కాంపొనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్) సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్); కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ)

మారుతీ సుజుకి....

ఈ ఆటో ఎక్స్‌పోలో మారుతీ సుజుకీ కూపే స్టైల్ ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ కారు 'ఫ్యూచరో-ఈ' ను ఆవిష్కరించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన భారత కారుగా ఈ కాన్సెప్ట్ కారు నేటి యువత ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉంటుందని మారుతీ పేర్కొంది. దీంతో బీఎస్-6 పెట్రోల్ విటారా బ్రెజా, ఇగ్నిస్ మోడల్‌లో అప్‌గ్రేడెడ్ వేరియంట్‌ను, స్విఫ్ట్ హైబ్రిడ్ వేరియంట్‌ను, మరో 14 ఇతర మోడళ్లను ప్రదర్శించనున్నది.

టాటా మోటార్స్

పలు ఎస్‌యూవీ మోడళ్లను టాటా మోటార్స్ కంపెనీ ఈ ఆటో ఎక్స్‌పోలో డిస్ప్లే చేయనున్నది. ఏడు సీట్ల ఎస్‌యూవీ గ్రావిటాస్ మోడల్‌ను ఇక్కడే ఆవిష్కరించనున్నది. ఆల్ట్రోజ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని, హెచ్2ఎక్స్ కాన్సెప్ట్ కారును, హారియర్ మోడల్‌లో కొత్త వేరియంట్‌ను ప్రదర్శించడానికి సిద్ధమవుతోంది.

స్కోడా, ఫోక్స్‌వ్యాగన్

స్కోడా, ఫోక్స్‌వ్యాగన్‌లు విలీనమై ఏర్పాటైన స్కోడా ఆటో ఫోక్స్ వ్యాగన్ ఇండియా పలు మోడళ్లను ఈ ఆటో ఎక్స్‌పో కోసం సిద్ధం చేస్తోంది. టిగుయాన్ ఆల్‌స్పేస్, టీ-రోక్ ఎస్‌యూవీ, విజన్ ఇన్, ఆక్టేవియా ఆర్ఎస్245, సూపర్బ్‌లో కొత్త వేరియంట్, కోడియాక్ టీఎస్ఐ, కరోక్ ఎస్‌యూవీలను తెస్తోంది.

మహీంద్రా అండ్ మహీంద్రా

ఎస్‌యూవీల్లో కొత్త వేరియంట్లతో పాటు ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలను కూడా డిస్ప్లే చేయనున్నది. ఎక్స్‌యూవీ300, కేయూవీ100 మోడళ్లలో ఎలక్ట్రిక్ వేరియంట్లను కలుపుకొని మొత్తం నాలుగు ఎస్‌యూవీ ఈవీలను సిద్ధం చేస్తోంది. బీఎస్-6 ప్రమాణాలతో కూడిన అల్టురాస్, ఎక్స్‌యూవీ300, మారాజో వేరియంట్లను ప్రదర్శించనున్నది.

వందకు పైగా ఆవిష్కరణలు...

దాదాపు 31 కంపెనీలు ఈ ఆటో ఎక్స్‌పోలో పాలుపంచుకోనున్నాయి. దాదాపు వందకు పైగా కొత్త మోడళ్లు, వేరియంట్ల ఆవిష్కరణ జరగనున్నది. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన 30కి పైగా స్టార్టప్‌లు కూడా తమ తమ టెక్నాలజీలను, ఉత్పత్తులను డిస్ప్లే చేయనున్నాయి. కాగా కరోనా వైరస్ కారణంగా చైనా ప్రతినిధులు తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. చైనా కంపెనీలు ఆ ఆటో ఎక్స్‌పోలో పాల్గొంటాయని, ఇక్కడి ఉన్నతాధికారులే వస్తారని, చైనా నుంచి పెద్ద అధికారులెవరూ రారని సమాచారం. కాగా, ఈ ఆటో ఎక్స్‌పో వినియోగదారుల సెంటిమెంట్‌కు జోష్‌నివ్వగలదని సియామ్ (సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ మీనన్ ఆశాభావం వ్యక్తంచేశారు.

హ్యుందాయ్....

క్రెటా మోడల్‌లో కొత్త వేరియంట్‌ను ఆవిష్కరించనున్నది. ఎలంత్ర, ట్యూసన్, ఐ30ఎన్ హ్యాచ్‌బాక్‌లతో పాటు నెక్స్ట్ ఫ్యూయల్ సెల్ ఎస్‌యూవీని కూడా ప్రదర్శించనున్నది.

ఎమ్‌జీ మోటార్స్

చైనాకు చెందిన ఈ కంపెనీ పలు ఎస్‌యూవీలను ఆ ఆటో ఎక్స్‌పోలో డిస్ప్లే చేయనున్నది. ఐ-విజన్ కాన్సెప్ట్, మాక్సస్ డి90, 6 సీట్ల హెక్టర్, ఎమ్‌జీ 6 హ్యాచ్‌బ్యాక్, ఎమ్‌జీ 360 సెడాన్‌లను సిద్ధం చేస్తోంది.

కియా మోటార్స్

ఈ కంపెనీ కార్నివాల్ ఎమ్‌పీవీ(మల్టీ పర్పస్ వెహికల్)ను, క్యూవైఐ ఎస్‌యూవీని, సోల్ ఈవీ, స్ట్రింజర్ జీటీ, స్పోర్టేజ్ క్రాసోవర్, నిరో హ్యాచ్‌బ్యాక్ తదితర కార్లను ప్రదర్శించనున్నది.

రెనో

ఈ కంపెనీ మొత్తం 12 కార్లను డిస్ప్లే చేయనున్నది. హెచ్‌బీసీ ఎస్‌యూవీ, జో ఈవీ హ్యాచ్‌బాక్, ట్రైబర్ ఏఎమ్‌టీ, ట్రైబర్ పెట్రోల్ కార్లను ఆవిష్కరించనున్నది.

గ్రేట్ వాల్ మోటార్స్

చైనాకు చెందిన ఈ కంపెనీ హావల్, ఓరా బ్రాండ్ ఎస్‌యూవీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించనున్నది. హెచ్9, హెచ్6, హెచ్1 ఎస్‌యూవీలతో పాటు హెచ్, విజన్ 2025 కాన్సెప్ట్ కార్లను డిస్ప్లే చేయనుంది.

మెర్సిడెస్ బెంజ్

కొత్త ఏ-క్లాస్ లిమోసిన్, 2020 జీఎల్ఏ, ఈక్యూసీ ఎడిషన్ 1886- ఈ మూడు కార్లను ఆవిష్కరించనుంది. ఏఎమ్‌జీ జీటీ 63 ఎస్ 4మ్యాటిక్ 4 డోర్ల కూపే కారుతో పాటు వి-క్లాస్ మార్కోపోలో కార్లను తీసుకొస్తోంది.

బీదర్ విమానాశ్రయ నిర్వహణ జీఎంఆర్‌కు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శంషాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్.. ఇక నుంచి ఉత్తర కర్నాటకలోని బీదర్ ఎయిర్‌పోర్టును సైతం నిర్వహించనుంది. ఈ మేరకు కన్సెషన్ ఒప్పందం చేసుకుంది. ఈ వారమే కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. తొలుత ఈ ఎయిర్‌పోర్టు నుంచి ప్రతిరోజు బెంగళూరుకు సర్వీసును నడుపుతారు.

కేజీ-డీ6 బ్లాక్‌లో గ్యాస్ ఉత్పత్తి నిలిపివేత

న్యూఢిల్లీ: కేజీ-డీ6 బ్లాక్‌లోని డీ1/డీ3 గ్యాస్ క్షేత్రాల నుంచి ఉత్పత్తి పూర్తిగా నిల్చిపోయింది. ఈ క్షేత్రాల్లోని మొత్తం 18 బావుల్లో 3 మాత్రమే ఇప్పటిదాకా పనిచేశాయని, సోమవారం వాటిలోనూ ఉత్పత్తి నిల్చిపోయిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను.. బ్లాక్‌లోని మిగతా క్షేత్రాల్లో ఉపయోగించనున్నట్లు వివరించాయి. కృష్ణా-గోదావరి బేసిన్‌లోని కేజీ-డీ6 బ్లాక్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటిదాకా 19 చమురు, గ్యాస్ నిక్షేపాలను కనుగొంది. 2009 ఏప్రిల్‌లో డీ1, డీ3 నుంచి గ్యాస్ ఉత్పత్తి ప్రారంభమైంది. ఒక దశలో రోజుకు 61 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల (ఎంసీఎండీ) గ్యాస్ ఉత్పత్తి చేసినప్పటికీ.. వివిధ కారణాలతో ఆ తర్వాత 1.5 ఎంసీఎండీ స్థాయికి పడింది. రిలయన్స్ , దాని భాగస్వామ్య సంస్థ బీపీ బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులతో ఈ క్షేత్రాల జీవితకాలాన్ని నాలుగేళ్లుగా పొడిగిస్తూ వచ్చాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...
- ఈ 40 షేర్లకు బడ్జెట్ బూస్ట్!
- ఏప్రిల్‌కు ముందే డివిడెండ్స్ పండుగ?!
- డిపాజిట్ ఇన్సూరెన్స్ పెంపుతో బ్యాంకులకు భారం!
- నిఫ్టీ పొజిషన్ హెడ్జింగ్‌కు పుట్ బటర్‌ఫ్లై వ్యూహం!

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్.. సమగ్ర బడ్జెట్ వివరాలు, విశ్లేషణలు, మార్కెట్ అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
WWW.BUSINESS.SAKSHI.COM

ఉద్యోగుల ప్రయోజనాలూ పరిరక్షిస్తాం

- అడ్డగోలుగా తీసివేయడం కుదరదు
- ఎయిరిండియా, బీపీసీఎల్ విక్రయాలపై కేంద్రం వివరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎయిరిండియా, బీపీసీఎల్‌లో వాటాలను విక్రయించినప్పటికీ.. ఉద్యోగుల ప్రయోజనాలను కూడా పరిరక్షించే విధంగా షేర్ల విక్రయ ఒప్పందాల్లో నిబంధనలు ఉంటాయని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత తెలిపారు. కొనుగోలు చేసిన సంస్థలు.. అడ్డగోలుగా ఉద్యోగులను తొలగించేందుకు ఉండబోదని పేర్కొన్నారు. ఎయిరిండియా, బీపీసీఎల్ బిడ్డింగ్ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని చెప్పారు. నష్టాలు, రుణాల భారంతో కుంగుతున్న ఎయిరిండియాలో, చమురు రంగ దిగ్గజం బీపీసీఎల్‌లో మొత్తం 53.29 శాతం వాటాలను కేంద్రం విక్రయించే ప్రయత్నాల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఎయిరిండియాకు సంబంధించి ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలను (ఈవోఐ) ఆహ్వానించింది. దీనికి మార్చి 17 ఆఖరు తేది. బీపీసీఎల్ ఈవోఐలను మరికొన్ని రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది.

టీసీఎస్‌కు రూ.10,650 కోట్ల కాంట్రాక్ట్

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టీసీఎస్ రూ. 10,650 కోట్ల భారీ డీల్‌ను సాధించింది. ఫార్మా కంపెనీ వాల్‌గ్రీన్స్ బూట్స్ అలయెన్స్(డబ్ల్యూబీఏ) నుంచి ఈ కాంట్రాక్ట్‌ను పొందామని టీసీఎస్ తెలిపింది. కాంట్రాక్ట్ కాలపరిమితి పదేళ్లని పేర్కొంది. డీల్‌లో భాగంగా డబ్ల్యూబీఏకు ఐటీ సర్వీసులను అందిస్తామని వివరించింది. వేగంగా విస్తరిస్తున్న వ్యాపార అవసరాలను సమర్థవంతంగా అందిపుచ్చుకునేందుకు టీసీఎస్‌తో డీల్ తోడ్పడుతుందని డబ్ల్యూబీఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్కో టింటో చెప్పారు.

ఆర్‌బీఐ వైపు అందరి చూపు..!

- నేటి నుంచీ 'పాలసీ' సమావేశం
- ఆర్థిక సంవత్సరం చివరి భేటీ
- రేట్లకోతకు ద్రవ్యోల్బణం గండి..

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. 6వ తేదీ వరకూ ఈ సమావేశం జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-2020) చివరి, ఆరవ ద్వైమాసిక ఆర్‌బీఐ పాలసీ సమావేశం ఇది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు మందగమనం, ద్రవ్యోల్బణం కట్టుతప్పడం వంటి ప్రతికూలతల నేపథ్యంలో తాజా సమావేశం జరుగుతోంది. ధరలూ సామాన్యునిపై భారాన్ని మోపుతున్నాయి. మొత్తంగా గణాంకాలు దేశంలో మందగమన పరిస్థితులను ప్రతిబింబిస్తుండగా, నిత్యావసరాల ధరలు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి.

కట్టుతప్పిన ద్రవ్యోల్బణం

రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం ఉండాలన్నది ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశం. అయితే, దీనికి 'ప్లస్ 2' లేదా 'మైనస్ 2' శాతాన్ని తగిన స్థాయిగా పరిగణనలోకి తీసుకుంటారు. కాగా ఉల్లి తదితర కూరగాయల రేట్లు ఆకాశాన్నంటడంతో డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా ఎగిసింది. ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న స్థాయిని దాటేసి.. ఏకంగా 7.35 శాతంగా నమోదైంది. ఇది అయిదున్నరేళ్ల గరిష్ట స్థాయి. 2018 డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.11 శాతంగా ఉండగా, 2019 నవంబర్‌లో 5.54 శాతంగాను, డిసెంబర్‌లో 7.35 శాతంగాను నమోదైంది. చివరిసారిగా 2014 జూలైలో తొలిసారిగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు.. రిటైల్ ద్రవ్యోల్బణం 7.39 శాతం. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయిని డిసెంబర్‌లో తాకడం ఇదే ప్రథమం. ఆర్‌బీఐ పాలసీ విధానానికి రిటైల్ ద్రవ్యోల్బణమే ప్రాతిపదిక. ఇక దేశంలో మందగమన పరిస్థితులను ప్రతిబింబిస్తూ, డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 2.59 శాతంగా నమోదైంది. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ పాలసీ నిర్ణయం ఏమిటన్నది వేచిచూడాల్సి ఉంది.

ఆరు సార్లలో ఐదు సార్లు తగ్గింపు...

ఫిబ్రవరి 7వ తేదీతో మొదలుకొని డిసెంబర్ 5 మధ్య జరిగిన ఆరు ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షా సమావేశాల సందర్భంగా చివరిసారి మినహా అంతకుముందు వరుసగా ఐదుసార్లు బ్యాంకులకు తానిచ్చే వసూలు చేసే వడ్డీరేటు-రెపోను 135 బేసిస్ పాయింట్లమేర ఆర్‌బీఐ తగ్గించింది. దీనితో ఈ రేటు 5.15 శాతానికి దిగివచ్చింది. ధరల పెరుగుదల రేటు అదుపులో ఉండడంతో వృద్ధే లక్ష్యంగా రేటు కోత నిర్ణయాలు తీసుకోగలిగిన ఆర్‌బీఐ, ద్రవ్యోల్బణం భయాలతోనే చివరి సమావేశంలో ఈ దిశలో నిర్ణయం తీసుకోలేకపోయింది.

డిజిన్వెస్ట్‌మెంట్ నిధులు.. ఇన్‌ఫ్రాకే

ఫిక్కీ సదస్సులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా సమీకరించిన నిధులను మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసమే వినియోగిస్తామని.. ద్రవ్య లోటును భర్తీ చేసుకునేందుకు కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థపై ఇది అనేక రకాలుగా సానుకూల ప్రభావం చూపగలదని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె చెప్పారు. 'సమీకరించిన నిధులను ఏం చేయబోతున్నామన్నది స్పష్టంగా చెబుతున్నాం. మీ పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలను తదనుగుణంగా రూపొందించుకోవడానికి దీనితో వెసులుబాటు లభిస్తుంది. ప్రైవేట్ రంగం ప్రభుత్వానికి తోడ్పడాలి. దానికి సమానంగా ప్రభుత్వం కూడా ప్రైవేట్ రంగానికి తోడ్పాటు అందిస్తుంది' అని ఆమె చెప్పారు. ఉదాహరణకు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై విధించే సుంకాల ద్వారా వచ్చే నిధులను.. మైరుగైన వైద్య సదుపాయాల కల్పనకు వినియోగించనున్నట్లు మంత్రి వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎకానమీకి ఊతమిచ్చేందుకు నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించుకుందన్నారు.

రూ. 1.13 లక్షల కోట్ల మోసాలు..

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో ఏకంగా రూ. 1,13,374 కోట్ల మోసాలు చోటు చేసుకున్నా యని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు రాతపూర్వక సమాధానంలో చెప్పారు. ప్రభుత్వ బ్యాంకుల్లో భారీ మోసాలను సత్వరం గుర్తించేందుకు, నివారించేందుకు 2015లో ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆమె పేర్కొన్నారు. మరోవైపు, సమస్యల గుర్తింపు, పరిష్కారం, అదనపు మూలధనం అందించడం, సంస్కరణలు వంటి చర్యలతో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్థూల మొండిబాకీలు గతేడాది సెప్టెంబర్ 30 నాటికి రూ.1.68 లక్షల కోట్ల మేర తగ్గి రూ.7.27 లక్షల కోట్లకు చేరాయని మంత్రి వివరించారు.

ఎల్ఐసీ పాలసీదారుల ప్రయోజనాలు కాపాడతాం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీలో వాటాల విక్రయ అంశంలో పాలసీదారుల ప్రయోజనాలను కచ్చితంగా పరిరక్షిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. లిస్టింగ్ వల్ల ఎల్ఐసీలో పారదర్శకత మరింత పెరుగుతుందని ఆయన చెప్పారు. వాటాలు ఎంత మేర విక్రయించవచ్చన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఎల్ఐసీ చట్టాన్ని సవరించిన తర్వాత అన్ని వివరాలు వెల్లడవుతాయని చెప్పారు. ఎల్ఐసీలో కేంద్రానికి 100% వాటా ఉంది.

లిథియం బ్యాటరీల సరఫరాలో బీపీసీఎల్

కైనెటిక్, ఐఐటీ మద్రాస్‌లతో జట్టు

చెన్నై: ప్రభుత్వ రంగ చమురు తయారీ దిగ్గజం బీపీసీఎల్ తాజాగా ఎలక్ట్రిక్ ఆటో రిక్షాల కోసం లిథియం అయాన్ బ్యాటరీల సరఫరా కార్యకలాపాలు ప్రారంభించింది. ఇందుకోసం ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్, ఐఐటీ మద్రాస్ (సాంకేతిక సహకారం)తో జట్టు కట్టింది. తొలి దశలో కొచి, లక్నోలోని తమ రిటైల్ అవుట్‌లెట్స్‌లో లిథియం అయాన్ బ్యాటరీలను అందుబాటులోకి తెచ్చింది. ఈ రెండు నగరాల్లో కైనెటిక్ గ్రీన్ సంస్థ ఈ-రిక్షాలు నిర్వహిస్తోంది. వాహనాలు వాడుకున్నందుకు గాను డ్రైవర్లు కొంత మొత్తం అద్దె చెల్లిస్తారు. అలాగే, చార్జింగ్ సదుపాయం కోసం బీపీసీఎల్‌కు కొంత చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంలో గంటల కొద్దీ చార్జింగ్ బాదరబందీ లేకుండా ఈ-రిక్షా డ్రైవర్లు.. బీపీసీఎల్ అవుట్‌లెట్స్‌లో పూర్తి చార్జింగ్ ఉన్న బ్యాటరీలకు బదులుగా తమ బ్యాటరీలను మార్చుకోవచ్చు. తదుపరి దశలో మరో 7 నగరాల్లో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కైనెటిక్, బీపీసీఎల్ ప్రయత్నిస్తున్నాయి.

చిన్న మొత్తాల పొదుపుపై వడ్డీ రేటుకు కోత!

- వచ్చే త్రైమాసికంలో నిర్ణయానికి అవకాశం
- కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి చక్రవర్తి వెల్లడి

న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపుపై వడ్డీ రేట్లను మార్కెట్‌కు అనుసంధానిస్తూ.. వచ్చే త్రైమాసికంలో సవరించే అవకాశాలు ఉన్నాయని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి అతనూ చక్రవర్తి సూచనప్రాయంగా తెలిపారు. తద్వారా రిజర్వ్ బ్యాంక్ కీలక పాలసీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలు మరింత వేగంగా లబ్ధిదారులకు చేరగలవని ఆయన పేర్కొన్నారు. 'ప్రస్తుతం బ్యాంకుల్లో డిపాజిట్లు రూ. 114 లక్షల కోట్ల పైగా ఉండగా.. చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో కేవలం రూ. 12 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయి. అయినప్పటికీ వీటిపై అధిక వడ్డీ రేట్ల కారణంగానే తాము ఆర్‌బీఐ నిర్ణయాలకు అనుగుణంగా వడ్డీ రేట్లను తగ్గించలేకపోతున్నామని బ్యాంకులు చెబుతుంటాయి. అవి చెప్పేది చూస్తుంటే.. కుక్కను తోక ఆడించినట్లుగా ఉంటుంది. చిన్న మొత్తాల పొదుపు రేట్లకూ ఒక మార్కెట్ ఆధారిత రేటు ప్రామాణికంగా ఉండాలి. దానికి అనుగుణంగానే చర్యలు ఉండగలవు' చక్రవర్తి చెప్పారు. ఏడాది కాల వ్యవధి డిపాజిట్లకు సంబంధించి ప్రస్తుతం బ్యాంకులు, చిన్న మొత్తాల పొదుపు రేట్ల మధ్య సుమారు 100 బేసిస్ పాయింట్ల వ్యత్యాసం ఉంది.

నేటి బోర్డ్ మీటింగ్స్...

భారతీ ఎయిర్‌టెల్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, టీవీఎస్ మోటార్ కంపెనీ, టైటాన్ కంపెనీ, టాటా గ్లోబల్ బేవరేజేస్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పోర్ట్స్, అవంతి ఫీడ్స్, థెర్మాక్స్, పిరామల్ ఎంటర్‌ప్రైజెస్, సీఎస్‌బీ బ్యాంక్, ధనలక్ష్మీ బ్యాంక్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, గతి, జిందాల్ సా, త్రివేణి ఇంజినీరింగ్ అండ్ ఇండస్ట్రీస్.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	41,790
బంగారం (99.5, 10గ్రా)	39,800
వెండి (కిలో)	50,300
హైదరాబాద్/చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	40,770
బంగారం (22 క్యారెట్లు)	38,830
వెండి (కిలో)	50,300
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	40,950
బంగారం (22 క్యారెట్లు)	37,780
వెండి (కిలో)	47,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	42,050
బంగారం (22 క్యారెట్లు)	39,110
వెండి (కిలో)	49,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	42,120
బంగారం (22 క్యారెట్లు)	38,940
వెండి (కిలో)	47,600

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	50.61 రాత్రి 11.30కు	$ 51.56 శుక్రవారం ముగింపు
బ్రెంట్	55.05 రాత్రి 11.30కు	$ 56.62 శుక్రవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 4-2-2020

విశాఖ	375-00
చిత్తూరు	393-00
వరంగల్	348-00
విజయవాడ	340-00
గోదావరి	340-00
3-2-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	345-00

తయారీ రంగ గణాంకాలతో రికవరీ

- ఎనిమిదేళ్ల గరిష్టానికి తయారీ రంగం పీఎమ్ఐ
- మూడు రోజులు నష్టాలకు బ్రేక్
- 137 పాయింట్లు పెరిగి 39,872కు సెన్సెక్స్
- 46 పాయింట్ల లాభంతో 11,708కు నిఫ్టీ



బడ్జెట్ నష్టాల నుంచి సోమవారం స్టాక్ మార్కెట్ కోలుకుంది. కొత్త ఆర్డర్ల జోరుతో తయారీ రంగం గత నెలలో ఎనిమిదేళ్ల గరిష్ట స్థాయికి ఎగసిందన్న గణాంకాలతో సెన్సెక్స్, నిఫ్టీలు లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 137 పాయింట్లు ఎగసి 39,872 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 46 పాయింట్లు పెరిగి 11,708 వద్ద ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్ప స్థాయిలో నష్టపోయినా, మన మార్కెట్ లాభపడింది. ముడి చమురు ధరలు 0.8 శాతం మేర పతనం కావడం ఒకింత సానుకూల ప్రభావం చూపించింది.

452 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్.....

ఆర్థిక మంత్రి శనివారం ప్రవేశపెట్టిన వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ స్టాక్ మార్కెట్‌ను మెప్పించలేకపోవడం, ప్రత్యేకంగా జరిగిన శనివారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు భారీగా పతనమవడం తెలిసిందే. శనివారం నాటి నష్టాలు సోమవారం ఆరంభంలో కూడా కొనసాగాయి. ఐహెచ్ఎస్ మార్కిట్ ఇండియా తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎమ్ఐ) గత నెలలో 55.3కు ఎగసింది. ఇది ఎనిమిదేళ్ల గరిష్ట స్థాయి. ఈ గణాంకాలు వెల్లడైన తర్వాత మార్కెట్లో లాభాలు కొనసాగాయి. బడ్జెట్ అయిపోవడంతో ఇక మార్కెట్ దృష్టి కంపెనీల క్యూ3 ఫలితాలు, ఆర్‌బీఐ పాలసీపై ఉంటుందని నిపుణులంటున్నారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	1,856
ఎన్ఎస్ఈ	43,449
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	13,32,560
ఎఫ్ఐఐ	- 1200
డీఐఐ	1,287

నాలుగు ఐపీఓలకు సెబీ ఓకే

న్యూఢిల్లీ: పర్యాటక సంస్థ, ఈజ్‌మైట్రిప్ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం లభించింది. ఈ కంపెనీ ఐపీఓతో పాటు మరో మూడు కంపెనీల ఐపీఓలకు కూడా సెబీ పచ్చజెండా ఊపింది. ఆ కంపెనీలు-రియల్టీ సంస్థ, పురానిక్ బిల్డర్స్, నిర్మాణ రంగ సంస్థ, మోంటోకార్లో, ఫార్మాస్యూటికల్స్ కెమికల్స్ తయారు చేసే కెమ్‌కాన్ స్పెషాల్టీ కెమికల్స్.

షాంఘై సూచీ 8 శాతం డౌన్...

కరోనా వైరస్ భయాలతో గత వారం ప్రపంచ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. కాగా కొత్త సంవత్సరం సెలవుల కారణంగా జనవరి 24 నుంచి పనిచేయని చైనా మార్కెట్ సోమవారం ఆరంభంలోనే భారీగా నష్టపోయింది. షాంఘై సూచీ 8 శాతం(242 పాయింట్లు) క్షీణించింది. దాదాపు 2,600కు పైగా షేర్లు 10 శాతం మేర నష్టపోయాయి. పర్యాటక సంబంధిత షేర్లు నష్టపోగా, వైద్య సంబంధిత షేర్లు పెరిగాయి. ఆర్థిక వ్యవస్థలోకి 17,400 కోట్ల డాలర్లు విడుదల చేయాలని చైనా కేంద్ర బ్యాంక్ నిర్ణయం తీసుకోవడంతో నష్టాలు తగ్గాయి. హాంగ్‌కాంగ్ సూచీ లాభాలతో గట్టెక్కగా, జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

బ్యాంకింగ్ రుణ వృద్ధి 7.21 శాతం

ఆర్‌బీఐ గణాంకాల 'నిరాశే'

ముంబై: బ్యాంకింగ్ రుణ వృద్ధి 2020 జనవరి 17తో ముగిసిన పక్షం రోజులకు 7.21 శాతంగా నమోదయ్యింది. అంటే 2019 ఇదే కాలానికి నమోదయిన లెక్కలతో పోల్చితే 7.21 శాతం వృద్ధి నమోదయ్యిందన్న మాట. విలువలో ఇది రూ.93.32 లక్షల కోట్ల నుంచి రూ.100.05 లక్షల కోట్లకు పెరిగింది. ఆర్‌బీఐ ఈ మేరకు శుక్రవారం తాజా గణాంకాలను విడుదల చేసింది. ఇక ఇదే కాలంలో డిపాజిట్లు 9.51 శాతం పెరుగుదలతో 119.85 లక్షల కోట్ల నుంచి రూ.131.26 లక్షల కోట్లకు చేరాయి.

ఏ రంగంలోనూ వృద్ధి స్పీడ్ లేదు...

గణాంకాల ప్రకారం- ఆహారేతర బ్యాంకింగ్ రుణ వృద్ధి రేటు 2018 డిసెంబర్‌లో 12.8 శాతం ఉంటే, 2019 డిసెంబర్‌లో ఈ రేటు 7 శాతానికి తగ్గింది. సేవల రంగంలో కూడా రుణ వృద్ధి 23.2 శాతం నుంచి ఏకంగా 7 శాతానికి కుదేలయ్యింది. వ్యవసాయం, అనుబంధ విభాగాల విషయానికి వచ్చినా ఈ రేటు 8.4 శాతం నుంచి 5.3 శాతానికి పడిపోయింది. వ్యక్తిగత రుణాలకు సంబంధించి వృద్ధి రేటు కూడా 17 శాతం నుంచి 15.9 శాతానికి దిగివచ్చింది. ఇక పరిశ్రమల్లోనూ నిరాశే. ఈ రంగంలో రుణ వృద్ధిరేటు 4.4 శాతం నుంచి ఏకంగా 1.6 శాతానికి పడిపోయింది.

హెచ్ఏఎల్ సీఈఓగా అమితాబ్ భట్

బెంగళూరు: ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఈఓ)గా అమితాబ్ భట్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు సంస్థకు చెందిన లైట్ యుటిలిటీ హెలికాప్టర్ (ఎల్‌యూహెచ్) ప్రాజెక్ట్‌కు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా ఆయన సేవలందించారు. రక్షణ రంగానికి కామోవ్ కేపీ- 226టీ హెలికాప్టర్లను అందించడం కోసం కంపెనీ ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ ఇండో రష్యన్ హెలికాప్టర్స్ లిమిటెడ్‌కు ఈయన డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. సంస్థతో 32 ఏళ్ల అనుబంధం ఉన్న ఈయన హయాంలోనే ఓఎన్‌జీసీ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, జార్ఖండ్ ప్రభుత్వానికి హెలికాప్టర్లను అందించడంతో పాటు నేపాల్, మారిషస్ వంటి దేశాలకు ఎగుమతులు జరిగినట్లు హెచ్ఏఎల్ వెల్లడించింది.

ఇంటి వద్దనే వీసా ప్రాసెసింగ్ సేవలు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రణవ్ సిన్హా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇక నుంచి వీసా సంబంధింత సేవలన్నీ ఇంటి వద్దనే పొందొచ్చు. దుబాయ్‌కు చెందిన వీసా ప్రాసెసింగ్ సర్వీసెస్ కంపెనీ వీఎఫ్ఎస్ గ్లోబల్ ఈ తరహా సేవలను ప్రారంభించింది. వీసా అప్లికేషన్ సెంటర్ల వద్దకు రాలేని సీనియర్ సిటీజన్స్ లేదా విద్యార్థులు, ఉద్యోగుల ఈ సేవలను అందిస్తామని ఇండియా రీజినల్ హెడ్ ప్రణవ్ సిన్హా తెలిపారు. వీసా ప్రాసెసింగ్ విధానాల మీద అవగాహన కల్పించే 'సే నో టు ఫ్రాడ్ క్యాంపెయిన్'లో భాగంగా హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందిన బృందం వ్యక్తిగత లేదా గ్రూప్ సభ్యుల ఇంటికి చేరుకొని.. సంబంధిత పూర్తి సమాచారాన్ని బయోమెట్రిక్ డేటా రూపంలో నమోదు చేసుకుంటారని.. ఆస్ట్రియా, బెల్జియం, డెన్మార్క్, ఫిన్‌ల్యాండ్, హంగేరీ, స్విట్జర్లాండ్, ఇటలీ, పోర్చుగల్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి 18 దేశాల వీసాలకు అందిస్తున్నామని తెలిపారు. ''ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాల నుంచి ఎక్కువగా బ్యాంకింగ్, ఆతిథ్యం, విద్య, పర్యాటక రంగాల్లో వీసా సంబంధిత మోసపూరిత కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడాలకు ఎక్కువ శాతం తప్పుడు వాగ్దానాలతో పంపుతున్నారని'' వివరించారు. తగ్గిన విమాన చార్జీలు, థర్డ్ పార్టీ ట్రావెల్ అగ్రిగేటర్స్, మెరుగైన కనెక్టివిటీ, సులువైన దరఖాస్తు విధానం వంటి వాటితో ఏటేటా మన దేశం నుంచి వీసా అప్లికేషన్ల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. వీఎఫ్ఎస్ గ్లోబల్ ప్రపంచవ్యాప్తంగా 64 ప్రభుత్వాలకు వీసా ప్రాసెసింగ్ సేవలందిస్తుంది. ఇప్పటివరకు 151 దేశాల్లో 3,425 అప్లికేషన్ కేంద్రాల ద్వారా 21.9 కోట్ల దరఖాస్తులను ప్రాసెస్ చేసింది.

గోద్రేజ్ ప్రాపర్టీస్ లాభం 9 శాతం అప్

రూ.517 కోట్లకు పెరిగిన ఆదాయం

న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ, గోద్రేజ్ ప్రాపర్టీస్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) మూడో త్రైమాసిక కాలంలో 9 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) క్యూ3లో రూ.42 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.45 కోట్లకు పెరిగిందని గోద్రేజ్ ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పిరోజ్‌షా గోద్రేజ్ తెలిపారు. మొత్తం ఆదాయం రూ.431 కోట్ల నుంచి రూ.517 కోట్లకు తగ్గిందని పేర్కొన్నారు. సేల్స్ బుకింగ్‌లు రూ.1,528 కోట్ల నుంచి 22 శాతం క్షీణించి రూ.1,189 కోట్లకు తగ్గాయని వివరించారు. ఈ క్యూ3లో నాలుగు కొత్త ప్రాజెక్ట్‌లు ప్రారంభించామని, వీటిల్లో మూడు జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌లని పేర్కొన్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ స్థితిగతులు సమస్యాత్మకంగా ఉన్నాయని పిరోజ్‌షా గోద్రేజ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతమున్న కన్సాలిడేషన్ కారణంగా రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్‌లో తమ కంపెనీ మార్కెట్ వాటాను పెంచుకోవడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.

గ్లాక్సోస్మిత్‌లైన్ ఫార్మా నష్టాలు రూ.661 కోట్లు

న్యూఢిల్లీ: గ్లాక్సోస్మిత్‌లైన్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీకి 2019, డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసిక కాలానికి రూ.661 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. జినెట్యాక్ ఔషధం రీకాల్ కారణంగా ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని గ్లాక్సోస్మిత్‌లైన్ ఫార్మా వెల్లడించింది. 2018, డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.114 కోట్ల నికర లాభం సాధించామని పేర్కొంది. ఆదాయం రూ.825 కోట్ల నుంచి రూ.779 కోట్లకు తగ్గిందని తెలిపింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో గ్లాక్సోస్మిత్‌లైన్ షేర్ 0.6 శాతం లాభంతో రూ.1,648 వద్ద ముగిసింది.

దుబాయ్‌కి రాంకీ ఎన్విరో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌కు చెందిన పర్యావరణ నిర్వహణ సేవల సంస్థ రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ (ఆర్ఈఈఎల్) దుబాయ్ మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చింది. దుబాయ్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్ కంపెనీ ఇమ్‌దాద్‌తో కలిసి కృత్రిమ మేధస్సుతో కూడిన అత్యాధునిక మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్)ని ఫర్జ్ పేరుతో ఏర్పాటు చేసింది. మున్సిపల్, వాణిజ్య, పారిశ్రామిక వ్యర్థాలను వేరు చేస్తుందని కంపెనీ ఎండీ గౌతమ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 45,322 చ.మీ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎంఆర్ఎఫ్ సామర్థ్యం రోజుకు 1,200 టన్నుల వ్యర్థాలను రీసైకిల్ చేస్తుందని పేర్కొన్నారు.

ఎన్‌సీసీకి రూ.530 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ కంపెనీ ఎన్‌సీసీ రూ.530 కోట్ల విలువైన మూడు ఆర్డర్లను జనవరిలో దక్కించుకుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీటిని పొందినట్టు కంపెనీ తెలిపింది. సంస్థకు చెందిన బిల్డింగ్స్ విభాగం ఈ ఆర్డర్లను చేజిక్కించుకుంది.

25 శాతం పెరిగిన అమరరాజా లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్యూ3లో అమరరాజా బ్యాటరీస్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 25% అధికమై రూ.164 కోట్లకు ఎగసింది. టర్నోవరు రూ.1,695 కోట్ల నుంచి రూ.1,748 కోట్లకు చేరుకుంది. ఈపీఎస్ రూ.9.63 ఉంది. సోమవారం కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 5.75% పెరిగి రూ.785.85 వద్ద స్థిరపడింది.

రాష్ట్రీయం

మడావి కన్నీబాయి

ఆదివాసీ బిడ్డకు అరుదైన గౌరవం

అడ్వెంచర్ బ్రాండ్ అంబాసిడర్‌గా కన్నీబాయి

కెరమెరి (ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం భీమన్‌గొంది గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ మడావి కన్నీబాయిని అడ్వెంచర్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు అందాయి. ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్లో జరిగే సాహస క్రీడలు, పలు రాష్ట్రాల్లోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేక కార్యక్రమం జరగనుంది. కన్నీబాయి మౌంటేనీర్, రెండవ ప్రపంచ కప్ వాటర్ రాఫిల్లింగ్ గోల్డ్ మెడల్ సాధించడంతోపాటు ఆదిమ గిరిజన సలహా సంఘంలో సూపర్ వైజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈమెకు రాష్ట్రం నుంచి 95వ ఫౌండేషన్ కోర్స్ ఏఐఎస్, సీసీఎస్ (ఐఏఎస్, ఐపీఎస్, ఐఐఏఎస్) ఐస్ బ్రేకింగ్ సెషన్‌లో పరిశీలకురాలిగా ప్రత్యేక ఆహ్వానం అందింది.

ఉద్యోగం ఆశ చూపి..

మహిళలను లొంగదీసిన కేటుగాడు

- రెండు వేల మందికిపైగా మహిళల సమాచార సేకరణ
- మందమర్రి పోలీసుల అదుపులో నిందితుడు.. కేసు నమోదు

నిందితుడు కునమల్ల శ్రీనివాస్

సాక్షి, మంచిర్యాల: నిరుద్యోగ యువతులు, కాంట్రాక్టు ఉద్యోగాలు చేసే మహిళలను టార్గెట్‌గా చేసుకొని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఓ యువకుడిని మందమర్రి పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షాంపూర్‌కు చెందిన కునమల్ల శ్రీనివాస్ (29) నిరుద్యోగ యువతులకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, కాంట్రాక్ట్ ఉద్యోగులైతే జాబ్‌ను పర్మినెంట్ చేయిస్తానని ఆశ చూపి, నెమ్మదిగా వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేవాడు. అలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా దాదాపు రెండు వేల మందికిపైగా మహిళల వ్యక్తిగత సమాచారం సేకరించి పెద్ద డేటా బ్యాంకునే సంపాదించాడు. 3 నెలలుగా మందమర్రి పట్టణంలో పలువురు మహిళలను లైంగికంగా వేధించసాగాడు. దీంతో మహిళా సంఘాల సభ్యులు స్థానిక షీ టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కొన్ని రోజులుగా శ్రీనివాస్‌పై నిఘా ఉంచగా.. అతని అసలు బండారం బయటపడింది. విచారణ సందర్భంగా అనేక మంది మహిళల మార్ఫింగ్ చేసిన ఫొటోలు, నగ్నంగా, అర్ధనగ్నంగా ఉన్న ప్రైవేట్ ఫొటోలు, వాట్సాప్, ఫేస్‌బుక్‌కు షేర్ చేసిన సమాచారాన్నంతా సేకరించారు.

పర్మినెంట్ చేయిస్తానని ఆశ చూపి..

కునమల్ల శ్రీనివాస్ డిగ్రీ పూర్తి చేసి ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో సెక్యూరిటీగా విధులు నిర్వర్తించాడు. అక్కడ ఏపీడీవో నిధుల్లో దుర్వినియోగం కేసు నమోదు కావడంతో ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి ఆడవాళ్ల ఫొటోలను ఫేస్‌బుక్, టిక్‌టాక్ వీడియోలను డౌన్‌లోడ్ చేస్తూ వారితో అసభ్యకరంగా చాటింగ్‌లు చేస్తూ, అనేక మందిని ఇబ్బంది పెడుతున్నాడు. వారిని తన వలలో పడవేసేందుకు తాను కలెక్టర్ సీసీనని, కమిషనర్ల వద్ద సీసీనని, ఉన్నతాధికారులు తనకు తెలుసని, ఇలా అనేక అవతారాలెత్తాడు. వివిధ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేసే ఆడవాళ్లను టార్గెట్ చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో వారి వాట్సాప్ గ్రూపుల్లో చేరి అందరి నంబర్లను సేకరించి.. వారితో వ్యక్తిగతంగా చాటింగ్ చేస్తున్నాడు. ముఖ్యంగా ఆరోగ్య శాఖలో పనిచేసే ఆయాలు, మహిళా సిబ్బందిని ఏఎన్ఎం జాబ్ ఇప్పిస్తానని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని నమ్మించి, వారి వ్యక్తిగత సమాచారాన్ని పూర్తిగా సేకరించాడు. ఆ తరువాత నగ్నంగా, అర్ధనగ్నంగా ఉన్న ఫొటోలను పంపించమని కోరుతూ లైంగిక వేధింపులకు గురిచేశాడు. వారిలో కొంతమంది నమ్మి అతని వలలో చిక్కారు. మరి కొంత మంది విసిగిపోయి చాటింగ్ మానేస్తే.. తన వక్రబుద్ధిని బయట పెట్టి.. 'నా వద్ద మీ ఫొటోలు, వీడియోలు ఉన్నాయి. సోషల్ మీడియాలో పెడుతా' అంటూ బెదిరించాడు.

చిక్కాడిలా..

నాలుగైదు నెలల నుంచి లైంగికంగా వేధిస్తుండటంతో మందమర్రి పట్టణానికి చెందిన కొంతమంది మహిళలు ధైర్యం చేసి సీఐ ఎడ్ల మహేశ్‌ను సంప్రదించారు. విచారణ చేపట్టిన ఆయన నిందితుడి ఫోన్ నంబర్లు, సిమ్ కార్డులు, వాట్సాప్ కాల్‌డేటా, అన్నింటినీ కూపీ లాగారు. నిందితుడి వద్ద దాదాపు రెండు వేలకు పైగా మహిళల ఫోన్ నంబర్లు, వందలాది మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో నిందితుడిని సోమవారం అరెస్టు చేశారు. అతడి నుంచి మార్ఫింగ్ చేసిన మహిళల ఫొటోలు, వీడియోలను స్వాధీనం చేసుకుని.. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

గురుకుల ప్రిన్స్‌పాల్‌పై కేసు

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

మద్దూర్: కామారెడ్డి జిల్లా మద్దూర్ మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ అదే పాఠశాలలో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్న సునీత సోమవారం మద్దూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గత సంవత్సరం నుంచి తనను వేధిస్తూ లొంగదీసుకోవడానికి ప్రయత్నాలు చేశాడని, తాను ప్రతిఘటించడంతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించింది. గతంలో తనను హైదరాబాద్ వరకు లిఫ్ట్ ఇస్తానని చెప్పి కారులో తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొంది. తనతో పాటు అక్కడ పని చేస్తున్న మహిళా సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నా భయంతో బయటకు చెప్పుకోలేకపోతున్నారని వివరించింది. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భైంసా బాధితులకు బాసట

జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి

భైంసాటౌన్: భైంసా బాధితులను ఆదుకుంటామని జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి తాల్లోజు అన్నారు. సోమవారం ఆయన నిర్మల్ జిల్లా భైంసాలోని అల్లర్ల ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. భైంసాలో జరిగిన మూకదాడులతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారని తెలిపారు. అల్లర్లతో చాలామంది ఇళ్లు కోల్పోయారని, వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లేదా, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వారి స్థలాల్లోనే డబుల్‌బెడ్ రూమ్స్ నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే.. బీసీ కమిషన్ చైర్మన్‌తో మాట్లాడి బాధితులకు నష్ట పరిహారం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి ఉన్నారు.

'సహకారం'..భద్రాద్రిలో ప్రత్యేకం

సంఘంలో 40 మందే ఓటర్లు • రాష్ట్ర విభజనతో ఈ పరిస్థితి

చుంచుపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం సహకార సంఘానికి ప్రత్యేకత ఉండేది. అత్యధిక మంది ఓటర్లతో పాటు సంఘం పరిధిలో అత్యధిక గ్రామాలు ఉండేవి. అలాంటి ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్).. 2014లో రాష్ట్ర విభజన తర్వాత కుదేలైంది. విభజన సమయంలో భద్రాచలం పట్టణం మినహా మండలం పూర్తిగా ఏపీలోకి వెళ్లింది. దీంతో 71 గ్రామాలు ఉన్న సంఘం.. నేడు ఒక్క భద్రాచలానికే పరిమితమైంది. నాడు 12 వేల మంది రైతులు సభ్యులు, 1340 మంది ఓటర్లు ఉండేవారు. ప్రస్తుతం 2,692 మంది సభ్యులు, 40 మంది ఓటర్లు మాత్రమే మిగిలారు. ఇప్పుడు రాష్ట్రంలో అతి తక్కువ మంది ఓటర్లు ఉన్న పీఏసీఎస్‌గా భద్రాద్రి సహకార సంఘం నిలిచింది. ఇక్కడ 13 డైరెక్టర్ పదవులకు బ్యాలెట్ పద్ధతిలో కాకుండా ఓటర్లు చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహించనున్నారు. ఇక భద్రాచలం సహకార సంఘం 2014 నుంచి ఇప్పటి వరకు డీసీసీబీకి రూ.2.50 కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఈ సంఘం పరిధిలో రైతులు రూ.6.70 కోట్ల మేర రుణాల చెల్లించాల్సి ఉంది. సంఘం నిబంధనల మేరకు ఇది డిఫాల్టర్ జాబితాలో ఉంది. దీంతో ఇక్కడ అధ్యక్షుడిగా ఎన్నికైన వారికి డీసీసీబీలో ఓటు వేసే అవకాశం ఉండదు. ఇక్కడ ప్రత్యక్ష ఎన్నికలు లేనందున దీనికి ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేసి చేతులెత్తే పద్ధతిన ఓటింగ్ నిర్వహిస్తామని, ఇందుకోసం ఎన్నికల అథారిటీ అనుమతి కోరామని జిల్లా సహకార అధికారి మైకేల్ బోస్ తెలిపారు.

విద్యార్థిని కంటి నుంచి రాళ్లు

కంటిలో వచ్చిన రాళ్లు (ఇన్‌సెట్‌లో రాజేశ్వరి)

మాక్లూర్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మదన్‌పల్లికి చెందిన విద్యార్థిని గాజుల రాజేశ్వరికి ఎడమ కంటిలో నుంచి రాళ్లు వస్తున్నాయి. గాజుల విజయ, శ్రీనివాస్‌ల కూతురు రాజేశ్వరి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆమె ఎడమ కంటిలో నుంచి రెండు రోజులుగా రాళ్లు వస్తున్నాయి. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని కంటి ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు ఆమెను హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

నేటి నుంచి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న పూర్వగిరి (పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటలకు స్వస్తివాచనం, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. 10వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

అవార్డు అందుకుంటున్న వేముల తిరుపతిరెడ్డి

కవి తిరుపతిరెడ్డికి అంతర్జాతీయ అవార్డు

హుస్నాబాద్ రూరల్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన కవి, రచయిత వేముల తిరుపతిరెడ్డికి ఆదివారం హైదరాబాద్‌లో వీవ్ ఫౌండేషన్ అంతర్జాతీయ అవార్డును ప్ర

హీరా కేసులో సుప్రీంకు సీసీఎస్!

- కేసులు ఎస్ఎఫ్ఐఓకు అప్పగించాలన్న హైకోర్టు తీర్పుపై పిటిషన్
- ఈ మేరకు అనుమతి మంజూరు చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: స్కీముల పేరుతో రూ. వేల కోట్ల స్కామ్‌కు పాల్పడిన హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కేసులో నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నారు. ఈ స్కామ్‌కు సంబంధించిన కేసులన్నింటినీ సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ)కు అప్పగించాల్సిందిగా ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం అనుమతి మంజూరు చేయడంతో సీసీఎస్ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో కొన్ని చిన్న చిన్న వ్యాపారాలు చేసిన నౌహీరా షేక్ 2010-11లో హీరా ఇస్లామిక్ బిజినెస్ గ్రూప్ పేరుతో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్‌లో ఉన్న 15 సంస్థలకూ నౌహీరానే నేతృత్వం వహిస్తున్నారు. తన సంస్థల వ్యాపార లావాదేవీలకు సంబంధించి నౌహీరా షేక్ ఏ విభాగానికీ సరైన రికార్డులు సమర్పించలేదు. అయినా ఈమెపై నమోదైన కేసు దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు అనేక మార్గాల్లో కీలక సమాచారం సేకరించారు. దీని ప్రకారం హీరా గ్రూప్ వార్షిక టర్నోవర్ ఆరేళ్లలో వందల రెట్లు పెరిగిందని గుర్తించారు.

సర్కార్ గ్రీన్‌సిగ్నల్...

నౌహీరాను 2018లో అరెస్టు చేసిన సందర్భంలో పోలీసులు ఆమెతో పాటు గ్రూప్‌నకు సంబంధించిన 160 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. వీటిలో 130 ఖాతాల వివరాలు సేకరించగా... వాటిలో రూ.25 కోట్లు మాత్రమే ఉన్నట్లు తేలింది. హీరా గ్రూప్ భారీ స్థాయిలో డిపాజిట్లు సేకరించి మోసం చేసినట్లు, ఆ నిధుల్ని సొంత అవసరాలకు విని యోగించుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తేల్చారు. ఈ గ్రూప్‌పై మొత్తం 8 కేసులు నమోదయ్యాయి. గతంలో దాఖలైన ఓ పిటిషన్‌ను విచారించిన రాష్ట్ర హైకోర్టు హీరా గ్రూప్‌పై నమోదైన కేసుల్ని ఎస్ఎఫ్ఐఓకు బదిలీ చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇది ఆ విభాగానికి సంబంధించిన కేసు కాదన్నది సీసీఎస్ వాదన. ఎస్ఎఫ్ఐఓ కంపెనీ లా ప్రకారం నమోదైన కేసుల్ని మాత్రమే దర్యాప్తు చేయగలదు. అయితే హీరా కేసుల్లో ఐపీసీతో పాటు డిపాజిటర్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌లోని సెక్షన్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని ఎస్ఎఫ్ఐఓ దర్యాప్తు చేయలేదని, ఇప్పటికే తాము దర్యాప్తు పూర్తి చేసిన 7 కేసుల్లో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని సీసీఎస్ పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులను సుప్రీం కోర్టులో సవాల్ చేయడానికి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీన్ని పరిశీలించిన సర్కారు ఈ మేరకు సోమవారం అనుమతి మంజూరు చేసింది.

SI & కానిస్టేబుల్స్
గత పరుస SI & PC రిక్రూట్‌మెంట్స్‌లలో తెలుగు రాష్ట్రాలలో అత్యధిక సెలక్షన్స్ సాధించిన భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్ మల్టీపుల్ షాప్ గైడెన్స్‌లో సెప్టెంబర్ 5 నుండి న్యూ బ్యాచెస్ ప్రారంభం.
BIP భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్ చైతన్యపురి, DSNR, Hyd
040-66338639, 9398051215

SI & కానిస్టేబుల్స్ న్యూ బ్యాచ్: 11-02-2020 ఉ. 10 గంటలకు
TM & EM వరు నేరు బ్యాచ్‌లు
ప్రతి ఆదివారం ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ టెస్టులు OMR షీట్‌తో EM & TMలో నిర్వహించబడును. అతంతరం టెస్ట్ వివరం కలదు.
శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ H.O: కాకినాడ - 98482 56254 B.O: హైదరాబాద్ - 88926 21234

YVRAO - HYD
NEET
90 Days Batch (15 Students Spl.)
Batch Starts from : 05-02-2020
9100060601,602

సింహం సింగిల్‌గా వస్తుంది.. ఆ వస్తే.. వస్తే ఏంటట..

ఓ సినిమాలో డైలాగ్..
పందులే గుంపుగా వస్తాయి.. సింహం సింగిల్‌గా వస్తుంది అని..
ఈ సింహం దాన్ని బాగా నమ్మేసినట్లు ఉంది..
సింగిల్‌గానే వెళ్లింది..
అప్పుడు ఏం జరిగిందంటే..

మొన్నీమధ్యే..
కెన్యాలోని లేక్ నకురు నేషనల్ పార్కులో
ఊసుపోని సింహం ఒకటి ఊరి మీదకు
బయల్దేరింది
ఇలా ఇంటి మలుపు తిరిగిందో లేదో..
అడవి గేదెల గుంపు ఒకటి ఎదురైంది..
అసలే సింహం.. ఆపై కామన్‌సెన్స్ తక్కువ..
పైగా.. ఎక్కడ నెగ్గాలో..
ఎక్కడ తగ్గాలో తెలియదు..
దాంతో ఏయ్ అన్నట్లు చూసింది..
అవి పోపోవోయ్ అన్నాయి..
ఇది గుర్రుమంది.. అంతే.. వాటికి కాలింది..
పాత కక్షలు ఏమైనా ఉన్నాయో ఏమో తెలియదు గానీ..
ఒక్కసారిగా మీదకు ఉరికాయి.. సింహానికి తత్వం బోధపడింది..
కస్సుమన్నది కాస్త.. కాలికి పనిచెప్పింది.. చేసేదిలేక ఇలా చెట్టెక్కి
కూర్చుంది..
సింహం కళ్లలో భయం చూశాక.. గేదెల ఈగో శాటిస్‌ఫై అయినట్లుంది..
దీంతో పోనీలే అని వార్నింగులు గట్రా ఇచ్చేసి.. దాన్ని వదిలేసి..
ఇంటి దారి పట్టాయి.

(ఈ చిత్రాలను ముంబైకి చెందిన ఫొటోగ్రాఫర్ నీలోత్పల్ బారువా తీశారు)

– సాక్షి సెంట్రల్ డెస్క్

నర్సింగ్ కోర్సులకు ఐఎన్‌సీ గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సులకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) గుర్తింపునిచ్చింది. ఈ మేరకు సోమవారం ఆరోగ్య వర్సిటీకి లేఖ పంపింది. ఇప్పటి వరకు కాళోజీ వర్సిటీ నిర్వహిస్తున్న ఈ కోర్సులకు ఐఎన్‌సీ గుర్తింపు లభించలేదు. దీంతో ఆ కోర్సులు చేసిన విద్యార్థుల డిగ్రీలు రిజిస్ట్రేషన్ కాలేదు. దీంతో వారు ఉద్యోగావకాశాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. తాజాగా ఐఎన్‌సీ గుర్తింపు లభించడంతో ఇక నుంచి సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

ఇగ్నో ప్రవేశాల తుది గడువు పొడిగింపు

హైదరాబాద్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అందజేసే పలు రకాల కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుందని ఇగ్నో ప్రాంతీయ డైరెక్టర్ ఎస్.ఫయాజ్ అహ్మద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం నాంపల్లిలోని ఇగ్నో కార్యాలయంలో గానీ 9492451812, 040-23117550 ఫోన్ నంబర్లలో గానీ సంప్రదించవచ్చన్నారు.

కేవీల్లో 178 పోస్టులు ఖాళీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని 35 కేంద్రీయ విద్యాలయ (కేవీ) పాఠశాలల్లో మంజూరైన 1,293 పోస్టులకు గాను 178 ఖాళీగా ఉన్నాయని, వాటిలో 6 ప్రిన్సిపల్ పోస్టులు, 3 వైస్ ప్రిన్సిపల్ పోస్టులు కూడా ఉన్నాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ తెలిపారు. సోమవారం టీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గోల్కొండ-1, గోల్కొండ-2, ఉప్పల్-1, ఉప్పల్-2, పికెట్ వంటి జంట నగరాల్లోని పాఠశాలల్లో కూడా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గణాంకాల ప్రకారం స్పష్టమవుతోంది.

జీఎస్ఐ డైరెక్టర్ జనరల్‌గా శ్రీధర్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: భారతీయ భూ వైజ్ఞానిక సర్వేక్షణ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా-జీఎస్ఐ) డైరెక్టర్ జనరల్‌గా ఎం.శ్రీధర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఖనిజాల అన్వేషణలో మెరుగైన ఫలితాల సాధన, క్షేత్ర స్థాయి కార్యకలాపాల పెంపు, ప్రయోగశాలలకు పునరుత్తేజాన్ని ఇవ్వడం వంటి వాటితో పాటు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు అధిక ప్రాధాన్యాన్ని ఇస్తామని శ్రీధర్ తెలిపారు. ఆయన ఇప్పటివరకు జీఎస్ఐ దక్షిణ ప్రాంతం అదనపు డైరెక్టర్ జనరల్‌గా సేవలందించారు. 1986లో జీఎస్ఐలో చేరిన శ్రీధర్ హిమాలయాలు మొదలుకొని దక్షిణ భారత ద్వీపకల్పం వరకు భూవైజ్ఞానిక రంగంలో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించారు. వజ్రాల అన్వేషణ రంగంలో అసాధారణ తోడ్పాటు అందించినందుకు కేంద్రం నేషనల్ జియో సైన్స్ అవార్డును శ్రీధర్‌కు ప్రదానం చేసింది.

బాంబు అనుకుని తెరిస్తే బంగారం..

బంగారు ప్లేట్లపై ఇనుపపూత

శంషాబాద్: అనుమానిత వస్తువుగా భావించిన ఓ బ్యాగులో బంగారం బయటపడిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. విమానాశ్రయంలోని అంతర్జాతీయ అరైవల్‌లో బ్యాగులు తీసుకొచ్చే బెల్టుపై ఆదివారం రాత్రి ఓ బ్యాగు మిగిలిపోయింది. ప్రయాణికులు ఎవరూ దాన్ని తీసుకోకపోవడంతో సీసీ కెమెరాల్లో పరిశీలించిన అధికారులు వెంటనే సీఐఎస్ఎఫ్ బలగాలను అప్రమత్తం చేశారు. బ్యాగ్‌లో బాంబు ఉండొచ్చని అనుమానించిన అధికారులు వెంటనే బాంబు స్క్వాడ్ బృందాన్ని రంగంలోకి దింపారు. బ్యాగ్‌ను పరిశీలించిన అధికారులు అందులో పేలుడు పదార్థాలేమీ లేవని నిర్ధారించారు. స్కానింగ్ ద్వారా బ్యాగ్‌లో ఓ అనుమానిత వస్తువు ఉన్నట్లు గుర్తించారు. అందులో ఉన్న ఓ ఎలక్ట్రానిక్ మోటర్‌ను బయటికి తీశారు. దాన్ని బద్దలు చేసి చూడగా.. బంగారు ప్లేట్లకు ఇనుప పూతపూసి మోటారులో పెట్టినట్లు గుర్తించారు. ఈ బంగారు ప్లేట్ల బరువు దాదాపు 1.5 కేజీలు ఉన్నట్లు తెలిపారు. ఈ బంగారం ఎవరనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

42 సంవత్సరాల సహారా ఇండియా పరివార్

ప్రస్తుత పరిస్థితి

నా గౌరవనీయులైన పెట్టుబడిదారీ సహోద్యోగులకు,

ఈ 42 సంవత్సరాలలో, గౌరవనీయులైన డిపాజిటర్లు/పెట్టుబడిదారుల ప్రేమ మరియు నమ్మకాలను ఈ కుటుంబం సంపాదించింది. వారి సేవలు, నమ్మకానికి గాను సహారా ఇండియా కుటుంబ పెద్దగా నా కుటుంబం తరపు నుండి నేను పెద్దలకు వందనం, తోటి వారికి అభినందనలు మరియు అనుచరులకు ఆశీర్వాదాలు అందిస్తున్నాను. నా గుండె లోతుల్లో నుండి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

చెల్లింపులో జాప్యం:

సహారా ఇండియా పరివార్ ఎల్లప్పుడూ గౌరవనీయులైన పెట్టుబడిదారులకు సమయానికి చెల్లింపులు చేసే తన సుస్థిరమైన సంప్రదాయాన్ని నిర్వహిస్తుంది మరియు తన సేవా తత్పరతను ఉత్తమంగా నిర్వహిస్తుంది. అయితే, గత 7 సంవత్సరాల నుండి కొన్ని అవాంఛనీయ పరిస్థితుల వలన సహారా వారి సుస్థిరమైన సంప్రదాయానికి విరుద్ధంగా కొన్ని చోట్ల చెల్లింపులలో జాప్యం జరిగింది. గౌరవనీయమైన సుప్రీం కోర్టు ఆంక్షల వలన (ఎంబార్గో) మన ఆస్తులను విక్రయించడం ద్వారా గాని ఉమ్మడి వ్యాపారాల నుండి మరియు ఆస్తులు తాకట్టు పెట్టడం లేదా అమ్మడం ద్వారా సేకరించిన నిధులను గౌరవనీయమైన సుప్రీం కోర్టు ఆదేశంతో ఆమొత్తం సహారా-సెబీ ఖాతాలో జమ చేయబడతాయి. దానిలో ఒక్క రూపాయి కూడా సంస్థాపరమైన పని కోసం ఉపయోగించలేము తుదకు గౌరవనీయులైన పెట్టుబడిదారులకు చెల్లించడానికి కూడా ఉపయోగించబడదు.

వాస్తవానికి, సహారా ఆస్తులు తన మొత్తం అప్పుల కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయి.

మూడు రెట్లు ఎక్కువ ఆస్తులు ఉన్నా కూడా సమస్యకు కారణం

ఇప్పుడు చర్చించాల్సిన విషయం ఏమంటే సహారాకు ఎన్నో ఆస్తులు ఉన్నప్పుడు, వాటిని విక్రయించి సంక్షోభం నుండి ఎందుకు బయటపడకూడదు. ప్రస్తుత పరిస్థితిలో ప్రతీది మాకు అందుబాటులో ఉన్నా గౌరవనీయమైన సుప్రీం కోర్టు ఆంక్షల అర్థంకి వలన ఏదీ కూడా మాకు అందుబాటులో లేదు. ఈ సమయంలో మాకు నిర్మాణ రంగంలో వ్యాపారం చేయడానికి చిన్న మార్గం లభించినా ప్రతీది మెరుగ్గా ఉంటుంది.

నిజానికి మా వేలాది ఎకరాల భూమి పూర్తి భారతదేశంలో నలుదిశలా విస్తరించి ఉంది, ఇవి అన్నీ భారీ వైశాల్యంలో అనగా 100-200-300 ఎకరాల్లో ఉన్నాయి. ఒక్క అంబీ వేలీకి 9000 ఎకరాల వైశాల్యం ఉంది. ఇప్పుడున్న సమస్య ఏమంటే పెద్ద స్థలాల కొనుగోలుదారులు భారతదేశంలో లేరు. ఎందుకంటే రియల్ ఎస్టేట్ మందకొడిగా ఉంది. ఇటువంటి పరిస్థితిలో, ఒకరు లేదా ఇద్దరు కొనుగోలుదారులు ముందుకు వచ్చినా కూడా వారు స్థలాలను దాని విలువకు నాలిగింట ఒక వంతు లేదా అంతకంటే తక్కువగా తీసుకోవాలని కోరుకుంటారు. గౌరవనీయమైన సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అలాంటి తక్కువ ధరకు చర్చలు జరపడం మాకు సాధ్యం కాదు. ఎందుకంటే ప్రభుత్వం వారి సర్కిల్ రేట్‌కు 90 శాతంకు తక్కువగా అమ్మడానికి మాకు అనుమతి లేదు.

పెద్ద స్థలాలలో టౌన్‌షిప్‌ను (కాలనీ) అభివృద్ధి చేయాలని మీరు కోరుకుంటే, రెండు పరిస్థితులు తలెత్తుతాయి. మొదటిది, స్థలాన్ని అంతర్గతంగా అభివృద్ధి చేయడం మరియు మౌలిక సదుపాయాలకు నిధులు లేకపోవడం, అనగా రోడ్డు లేదా ఇతర సదుపాయాలు వంటివి, రెండవది ఇళ్లు అభివృద్ధి చేయడానికి కేటాయింపుదారుల (అలాటీలు) నుండి మేము అడ్వాన్స్ (బుక్కింగ్ మొత్తం) తీసుకుంటే దాని నుండి వచ్చే సొమ్మును ఇలాంటి విపరీతమైన పరిస్థితులలో గౌరవనీయమైన సుప్రీం కోర్టు ఆదేశం మేరకు సహారా-సెబీ ఖాతాలో డిపాజిట్ చేయాలి. మరి ఇలాంటి స్థితిలో ఇళ్ల అభివృద్ధి వ్యాపారం ఎలా పురోగమిస్తుంది? భారతదేశంలో మాకు భూములు అయితే ఉన్నాయి కానీ వాటిని అభివృద్ధి చేయలేము మరియు వాటితో వ్యాపారం చేయలేము. నేడు నిర్వహించబడుతున్న ప్రాజెక్టులు కూడా ఆగిపోయాయి. ఎందుకంటే నగదు ప్రవాహం ఆగిపోయింది.

శుభ పరిణామం

పేరుపొందిన రెండు విదేశీ పెట్టుబడి సంస్థలు పెద్ద మొత్తంతో మాతో పాటు రియల్ ఎస్టేట్ మరియు పట్టణాభివృద్ధి వ్యాపారానికి వస్తున్నాయి. గౌరవనీయమైన సుప్రీం కోర్టు సూచనల్ని దృష్టిలో పెట్టుకొని కొన్ని అలాంటి ఒప్పందాలు పై సంతకాలు జరిగాయి. ఇవి ఇదే సంవత్సరం అనగా 2020లో సహారా సమస్యల్ని పరిష్కరిస్తాయి.

ఈ నేపథ్యంలో ఎలాంటి అపార్థాలు, సందేహాలు లేకుండా మాకు మీ సహాయం కావాలి. మీరు ఎల్లప్పుడూ మాకు సహాయం చేసారు మరియు ఇదే సంవత్సరంలో అనగా 2020లో ఖచ్చితంగా మేము వెల కట్టలేని మీ అభిమానాన్ని పొందుతామని చెబుతున్నాను.

సహారా యొక్క ₹22,000 కోట్లు

ఇప్పటి వరకు, సహారా -సెబీ ఖాతాలో సుమారు ₹22,000 కోట్లు జమ అయ్యాయి. దేశవ్యాప్తంగా 154 దిన పత్రికల ద్వారా 4సార్లు ప్రకటన చేసినా కూడా గౌరవనీయులైన పెట్టుబడిదారులకు సెబీ కేవలం ₹106.10 కోట్లు మాత్రమే ఇవ్వగలిగింది. దీని తరువాత ఎలాంటి క్లైం పరిగణించబోనని నాలుగవ ప్రకటనలో సెబీ స్పష్టంగా రాసింది. ఈ చివరి ప్రకటన ఒక సంవత్సరం క్రితం వచ్చింది అనగా ఇప్పుడు ఎలాంటి చెల్లింపు మిగిలి లేదు. తనిఖీ చేసిన తరువాత, ఈ ₹22,000 కోట్ల మొత్తాన్ని ధృవీకరించిన తరువాత గౌరవనీయమైన సుప్రీం కోర్టు ఆదేశం మేరకు సహారాకు తిరిగి ఇవ్వబడుతుంది.

మేము స్థిరంగా నిలబడతాం.

గత కొద్ది సంవత్సరాలుగా వ్యతిరేక పరిస్థితుల వలన కొన్ని ప్రదేశాలలో మా సుస్థిర సంప్రదాయమైన సరైన సమయానికి చేసే చెల్లింపు మాటను పూర్తిగా నిలబెట్టుకోలేకపోవడం వాస్తవం. కానీ చెల్లించే నిబద్ధతకు మేము ఇంకా కట్టుబడే ఉన్నాము. ఒక్క రోజు చెల్లింపు చేయడంలో ఆలస్యం కలిగినా మేము ఆలస్యానికి గురైన సమయానికి వర్తించే వడ్డీతో సహా మా పెట్టుబడిదారులకు పూర్తి చెల్లింపు చేస్తాము.

మీ పెట్టుబడిదారీ సహోద్యోగులైన మీ ప్రయోజనమే ఎల్లప్పుడూ మాకు అత్యంత ప్రధానం మరియు ఎల్లప్పుడూ ఇదే విధంగా ఉంటుంది.

తప్పుదోవ పట్టించే ప్రచారాలను నివారించండి:

తప్పుదోవ పట్టించే ప్రచారంతో భంగపడవద్దని మరియు ధైర్యంగా ఉండవలసిందిగా నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. మీరు పెట్టుబడి పెట్టిన మొత్తం సొమ్ము వడ్డీతో సహా తిరిగి పొందుతారు. మీరు మీ సొమ్మును మరి కొంత కాలానికి పెట్టుబడి పెట్టినందు వలన ఆలస్యం జరిగినట్లుగా ఊహిద్దాం. ఎక్కువ కాలం పెట్టుబడి వలన మీకు మీ అసలు సొమ్ము పై వడ్డీ కూడా ఎక్కువగా వస్తుందని భావిద్దాం. మీ అందరికీ మెరుగైన ప్రయోజనాలు మరియు సేవలను మేము కేటాయించి ప్రారంభించడాన్ని కూడా మీరు చూస్తారు, ఇంకా, ఈ ఏడాదిలోనే ఈ వ్యతిరేక పరిస్థితుల నుండి కోలుకోవడాన్ని కూడా మీరు చూస్తారు.

మీరు పూర్తి సురక్షితంగా ఉన్నారు

మీ డబ్బు పూర్తి సురక్షితంగా ఉందని నేను మీకు హామీ ఇస్తున్నాను మీకు ఏ విధంగా కూడా హాని కలగదు. మీరు ఎల్లప్పుడూ మాకు మద్దతు ఇచ్చారు మరియు ముమ్ముందు కూడా మాకు మీ మద్దతు కావాలి. మీరు మమ్మల్ని ఎల్లప్పుడూ నమ్మవలసిందిగా మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము.

గౌరవంతో మరియు శుభాకాంక్షలతో
ఉద్వేగభరితమైన మద్దతును కోరుకుంటూ...

ఎల్లప్పుడూ మీ
Sahara Shri
సుబ్రత్ రాయ్ సహారా

SAHARA INDIA PARIWAR

CHHABI202001-11/CORP-Te

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com